

www.andhrajyothy.co
ఆంధ్రజ్యోతి
25
ANDHRAJYOTHI
నూతన సంవత్సర శుభాకాంక్షలు



బుధవారం | 1-1-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 257 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: విదియ రా. 2.22 తదుపరి తదియ; నక్షత్రం: ఉత్తరాషాఢ రా. 11.46 తదుపరి శ్రవణం; వర్జ్యం: ఉ. 7.58-9.22, తె. 3.40-5.13; దుర్ముహూర్తం: ఉ. 11.56-12.40; అమృతఘడియలు: సా. 5.26-7.01; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 5.48 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బిజినెస్

విజయవాడ ● బుధవారం 1 జనవరి 2025



కొత్త ఏడాదికి
నయా పెట్టుబడి వ్యూహాలు

ఈక్విటీ, బులియన్, డెట్.. ఏది బెటర్?

కొత్త సంవత్సరం (2025) వచ్చేసింది. మరి ఈ ఏడాది మన పెట్టుబడుల వ్యూహం ఎలా ఉండాలి?. మన దగ్గర ఉన్న నిధుల్లో ఎంతెంత ఎందులో మదుపు చేయాలి? ఎందులో మదుపు చేస్తే బాగుంటుందో తెలుసుకుందాం.

గత ఏడాది (2024) దేశీయ స్టాక్ మార్కెట్ మదుపరులకు బొటాబొటిగా 8 శాతం మాత్రమే లాభాలు పంచింది. డెట్ మార్కెట్ కంటే ఇది కొద్దిగా మెరుగు. అదే బంగారంలో మదుపు చేస్తే 23 శాతం, వెండిలో మదుపు చేస్తే 23 శాతం లాభాలు కళ్ల జూసేవాళ్లం. ఈ నేపథ్యంలో 2025లో మన పెట్టుబడుల వ్యూహం ఎలా ఉంటే బాగుంటుందో తెలుసుకుందాం.

ఈక్విటీ

ఎన్ని ఆటుపోట్లు ఉన్నా, దీర్ఘకాలిక సంపద సృష్టిలో ఈక్విటీ మార్కెట్లదే అగ్రస్థానం. మదుపరులు ఎప్పుడూ ఈ విషయాన్ని మర్చిపోకూడదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కనీసం తమ పెట్టుబడుల్లో సగం మొత్తాన్ని అయినా మదుపరులు ఈక్విటీ మార్కెట్ కోసం కేటాయించాలి. ఇందుకోసం మిడ్, స్మాల్ క్యాప్ షేర్ల కంటే లార్జ్ క్యాప్ షేర్లను ఎంచుకోవడమే మంచిది. ఎందుకంటే ఇప్పటికీ మిడ్ క్యాప్ కంపెనీల షేర్లు, వాటి అసలు విలువ కంటే అధిక ధరల వద్ద ట్రేడవుతున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మదుపరులు నయా సాల్‌లో ఐటీ, ఫార్మా, టెక్స్‌టైల్ రంగాలకు చెందిన లార్జ్ క్యాప్ షేర్లను ఎంచుకోవటం మంచిది. ప్రస్తుతం కరెక్షన్‌లో ఉన్న ఐటీసీ, డాబర్, మారికో వంటి ఎఫ్‌ఎంసీజీ కంపెనీల షేర్లపైనా మదుపరులు దృష్టి పెట్టవచ్చు.

బులియన్ మార్కెట్

రాబడులపరంగా చూస్తే గత ఏడాది (2024) బులియన్ మార్కెట్.. స్టాక్ మార్కెట్‌ను మించిపోయింది. పసిడిపై 23.25 శాతం, వెండిపై 23.11 శాతం లాభాలు వచ్చాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఇంకా చల్లార లేదు. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియడం లేదు. మరోవైపు అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జమానాలో ఆర్థిక పరిస్థితులు ఎలా ఉంటాయోనని చైనాతో సహా అనేక దేశాలు భయపడుతున్నాయి. పరిస్థితులు దిగజారితే తమ ఆర్థిక, ద్రవ్య పరిస్థితులను కాపాడుకునేందుకు అనేక దేశాల కేంద్ర బ్యాంకులు పెద్దమొత్తంలో బంగారం కొనిపెట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త ఏడాది (2025)లోనూ బంగారం, వెండి ధరలు మరింత చుక్కలనంటే అవకాశం ఉంది. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని మదుపురులు తమ మొత్తం పెట్టుబడుల్లో కనీసం 35 శాతమైనా నేరుగా బంగారం, వెండిలో లేదా వాటికి సంబంధించిన ఈటీఎఫ్‌ల్లో మదుపు చేయడం మంచిది. డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనమూ వచ్చే ఏడాది బంగారం, వెండిలకు మరింత కలిసి రానుంది.

డెట్

ఇవేవీ వద్దు. మేం ఏ మాత్రం రిస్క్ తీసుకోలేమనుకునే మదుపరులకు బ్యాంకు డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్స్ అందించే డెట్ ఫండ్స్ తప్ప వేరే మార్గం లేదు. కొత్త ఏడాది కూడా ఈ ఫండ్స్ సగటున 6 నుంచి 7 శాతం రాబడులు అందించే అవకాశం ఉంది. అయితే ధరల సెగను పరిగణనలోకి తీసుకుంటే బ్యాంకు డిపాజిట్లు, డెట్ ఫండ్స్‌పై వచ్చేది ప్రతికూల రాబడులు మాత్రమే. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మదుపరులు కొత్త ఏడాది తమ మొత్తం పెట్టుబడుల్లో 15 శాతానికి మించి వీటిలో మదుపు చేయకపోవడమే మంచిది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



జనవరి 1			
హైదరాబాద్	520	విజయవాడ	545
వరంగల్	522	గోదావరి	540
చిత్తూరు	563	విశాఖపట్నం	570
		దజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	99	విజయవాడ	106
వరంగల్	99	గుంటూరు	106
కరీంనగర్	99	ఒంగోలు	106
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	97
కర్నూలు	99	నెల్లూరు	97
విశాఖపట్నం	105	అనంతపురం	97
గోదావరి	106		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,560 ▼	71,100 ▼	98,900 ▼
విజయవాడ	78,500 ▲	73,200 ▼	89,500 ▼
విశాఖపట్నం	76,650 ▼	70,260 ▼	87,130 ▼
రాజమండ్రి	77,560 ▼	71,100 ▼	89,800 ▼
ప్రొద్దుటూరు	78,300 ▼	72,510 ▼	88,200 ▼
ముంబై	76,162 ▼	69,764 ▼	86,017 ▼

పసిడి జోరు.. ఆపతరమా!



కొత్త ఏడాదిలో రూ.90,000 చేరే చాన్స్

2024లో పసిడి 23%, వెండి 30% వృద్ధి

ప్రపంచాన్ని అస్థిరతలు ఆవరించినప్పుడల్లా సురక్షితమైన రాబడులు అందించిన ఘనత బంగారానికి ఉంది. భౌగోళిక, రాజకీయ, ఆర్థిక అస్థిరతలు ఆవరించి ఉన్న ప్రస్తుత కాలంలో కూడా అది నిజమని రుజువైంది. తెరమరుగవుతున్న 2024 సంవత్సరంలో మంచి రాబడులు అందించిన బంగారం నూతన సంవత్సరంలో కూడా అదే జోరును కొనసాగిస్తుందని బులియన్ మార్కెట్ నిపుణులంటున్నారు. 2025 సంవత్సరంలో బంగారం 10 గ్రాములు రూ.90,000 తాకే ఆస్కారం ఉన్నదని వారు జోస్యం చెబుతున్నారు. అయితే భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉపశమించి, ద్రవ్య విధానం విషయంలో కాఠిన్యం తగ్గితే మాత్రం బంగారం ధర తగ్గినా ఆశ్చర్యపోనక్కరలేదని వారు చెబుతున్నారు. ఆ పరిస్థితే గనుక ఏర్పడితే మాత్రం రూ.85,000 వరకు వెళ్లవచ్చంటున్నారు. అలాగే కిలో వెండి పరిస్థితులన్నీ సానుకూలంగా ఉంటే రూ.1.25 లక్షలు తాకవచ్చని, ప్రతికూల మొగ్గులో రూ.1.10 లక్షలకు పరిమితం కావచ్చని చెబుతున్నారు. ప్రస్తుతం స్పాట్ మార్కెట్లో 10 గ్రాముల బంగారం రూ.79,350, ఎంసీఎక్స్‌లో ఫ్యూచర్స్ ట్రేడ్‌లో 10 గ్రాములు రూ.76,600 పలుకుతోంది.

సెంట్రల్ బ్యాంకుల వైఖరే కీలకం

కొత్త సంవత్సరంలో బంగారం ధరలకు వివిధ దేశాల కేంద్ర బ్యాంకుల ద్రవ్య విధాన వైఖరే దిక్సూచి అంటున్నారు. కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గించినట్టయితే మార్కెట్లో లిక్విడిటీ పెరిగి అమెరికన్ డాలర్ బలహీనపడుతుందని, ఇది బంగారం ధరల వృద్ధికి దోహదపడే అంశమని విశ్లేషకులంటున్నారు. ఒక వేళ కేంద్ర బ్యాంకులు అప్రమత్త ధోరణి ప్రదర్శించినట్టయితే మాత్రం బంగారం ధర పెరుగుదలకు దోహదకారి అవుతుందని వారంటున్నారు. ప్రస్తుత పరిస్థితిలో కేంద్ర బ్యాంకులు నిల్వలు పెంచుకునే లక్ష్యంతో బంగారం కొనుగోళ్లు కొనసాగిస్తూ కరెన్సీ స్థిరత్వంపై ఆందోళనలు నెలకొంటే మాత్రం బంగారం ధరల పెరుగుదలను ఆపే శక్తి ఏదీ ఉండదని వ్యాఖ్యానించారు. 2024లో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సహా వివిధ కేంద్ర బ్యాంకులు 500 టన్నులకు పైబడిన బంగారం కొనుగోలు చేశాయి.

2024లో 23% లాభం

దేశీయ మార్కెట్లో 23 శాతం లాభంతో బంగారం 2024 సంవత్సరంలో మంచి రాబడి అందించింది. అక్టోబరు 30వ తేదీన 10 గ్రాముల బంగారం జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.82,400ని తాకింది. వెండి కూడా కిలో రూ.1 లక్ష దాటింది. 1979 తర్వాత బులియన్ మార్కెట్ నమోదు చేసిన అత్యుత్తమ ర్యాలీ ఇదే అని బులియన్ వర్గాలు వెల్లడించాయి. అంతర్జాతీయ విపణిలో చూసినా ఔన్సు బంగారం 2,062 డాలర్ల వద్ద ప్రారంభమై అక్టోబరు 31న రికార్డు గరిష్ఠ స్థాయి 2,790 డాలర్లు తాకింది. అంతర్జాతీయంగా ఏడాదిలో బంగారం పెట్టుబడిపై 28 శాతం రాబడి అందించింది.

ఆభరణాల డిమాండూ ప్రధానమే

ఆభరణాల డిమాండ్ బంగారం ధరలను ప్రభావితం చేసే మరో అంశం. ఒక పక్క పండగలు, వివాహాల సీజన్, మరో పక్క గత జూలైలో బంగారంపై దిగుమతి సుంకాన్ని ప్రభుత్వం 0.90 శాతం మేరకు తగ్గించడం వంటి చర్యలతో దేశంలో బంగారం వినియోగం 17 శాతం పెరిగిందని మెహతా ఈక్విటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలంత్రి చెప్పారు. 2019-2024 సంవత్సరాల మధ్య కాలంలో దేశీయ ఆభరణాల పరిశ్రమ 11 శాతం సమీకృతవార్షిక వృద్ధిని నమోదు చేసిందని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీకుమార్ కృష్ణమూర్తి తెలిపారు. పండగలు, వివాహాల సీజన్ కారణంగా నవంబరులో బంగారం దిగుమతులు నాలుగు రెట్లు పెరిగి రికార్డు గరిష్ఠ స్థాయి 1,486 కోట్ల డాలర్లకు చేరాయి.

నూతన సంవత్సరంలో కూడా ఆభరణాల డిమాండు బలంగానే ఉంటుందని అఖిల భారత వజ్రాభరణాల వ్యాపారుల మండలి (జీజేసీ) చైర్మన్ సాయం మెహ్రా అంచనా వేస్తున్నారు. ప్రధానంగా మధ్యతరగతి ప్రజలు, యువత బులియన్ మార్కెట్ వృద్ధికి చోదకంగా నిలుస్తారని చెబుతున్నారు. అలాగే వివాహాభరణాల మార్కెట్ కూడా డిమాండు వృద్ధికి దోహదపడుతుందంటున్నారు. ఇవన్నీ కలిసి 2025 సంవత్సరంలో భారత వజ్రాభరణాల మార్కెట్ 10 వేల కోట్ల డాలర్లను చేరవచ్చని అంచనా.

ఏడాదిలో రూ.77.6 లక్షల కోట్లు

ఆటుపోట్లలోనూ స్టాక్ మార్కెట్ లాభాల పంట

స్వల్ప నష్టంతో 2024కి సెన్సెక్స్ వీడ్కోలు

ముంబై: ఈక్విటీ మార్కెట్ 2024 సంవత్సరం మొత్తం తీవ్ర ఆటుపోట్లలో ప్రయాణించినా చివరికి ఇన్వెస్టర్లకు లాభాల పంట పండించింది. కొంత కాలం బుల్ రన్, మరి కొంత కాలం బేర్ పట్టుతో ఈ ఏడాదిలో మార్కెట్ పయనం సాగింది. అప్పుడప్పుడూ ఆటుపోట్లు ఏర్పడినా స్థూలంగా ఆశావహ దృక్పథం మార్కెట్ పయనాన్ని నిర్దేశించింది. ఏడాది మొత్తం మీద ఈక్విటీ మార్కెట్ పెట్టుబడులకు దిక్సూచిగా భావించే సెన్సెక్స్ 5898.75 పాయింట్లు (8.16%) లాభపడగా, నిఫ్టీ 1913.40 పాయింట్లు (8.80%) లాభపడింది. సెప్టెంబరు 27వ తేదీన సెన్సెక్స్ జీవితకాల గరిష్ఠ స్థాయి 85,978.25 పాయింట్లను తాకగా నిఫ్టీ 26,277.35 పాయింట్ల రికార్డును నమోదు చేసింది. నిఫ్టీ సానుకూల రాబడులు అందించడం ఇది వరుసగా తొమ్మిదో సంవత్సరం అని మెహతా ఈక్విటీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సే చెప్పారు. కాగా బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 12,506.84 పాయింట్లు (29.30%), మిడ్‌క్యాప్ సూచీ 9,605.44 పాయింట్లు (26.07%) లాభపడ్డాయి. ఏడాదిలో మొత్తం మీద ఇన్వెస్టర్ల సంపద లేదా బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.77,66,260.19 కోట్లు పెరిగి రూ.4,41,95,106.44 కోట్ల (5.16లక్షల కోట్ల డాలర్లు) వద్ద స్థిరపడింది. ఏప్రిల్ 8వ తేదీన ఇన్వెస్టర్ల సంపద తొలిసారిగా 400 లక్షల కోట్ల మైలురాయిని తాకింది.

బుల్, బేర్ నువ్వా..నేనా..?

ఏడాది మొత్తం మీద బుల్, బేర్ నువ్వా, నేనా అన్నట్టు పోరాడాయని విశ్లేషకులంటున్నారు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న అస్థిరతలు మార్కెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేశాయి. జనవరి నుంచి సెప్టెంబరు నెలల మధ్య కాలంలో మార్కెట్‌పై బుల్ పట్టు కొనసాగగా ఆ తర్వాత బేర్ గుప్పిట్లోకి వెళ్లిందని చెబుతున్నారు. ప్రపంచ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాల నడుమ భారత మార్కెట్‌పై కన్సాలిడేషన్ ఒత్తిడి అధికంగా ఉందంటున్నారు.

నష్టాలతో ముగింపు: మార్కెట్ 2024 సంవత్సరం చివరి రోజున నష్టాలతో ముగిసింది. ప్రపంచ మార్కెట్ల బలహీన సంకేతాలు, విదేశీ నిధుల తరలింపు నేపథ్యంలో భారీ ఆటుపోట్లకు గురయింది. అమ్మకాల ప్రభావంతో ఇంట్రాడేలో 687.34 పాయింట్లు నష్టపోయి 77,560.79 కనిష్ఠ స్థాయిని తాకిన సెన్సెక్స్ చివరికి నష్టాన్ని 109.12 పాయింట్లకు పరిమితం చేసుకుని 78,139.01 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ మాత్రం 0.10 పాయింట్ల నామమాత్రపు నష్టంతో 23,644.80 వద్ద ఫ్లాట్‌గా ముగిసింది.

రూపాయి 3% డౌన్

ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ఏడాది మొత్తం మీద 3% నష్టపోయింది. మంగళవారం డాలర్ మారకంలో రూపాయి 12 పైసలు నష్టపోయి జీవితకాల కనిష్ఠ స్థాయి 85.64కి పడిపోయింది. కాగా 2023 డిసెంబరు 29వ తేదీన డాలర్ మారకంలో రూపాయి 83.16 వద్ద ఉండగా మంగళవారం (2024 డిసెంబరు 31) 85.64 వద్ద క్లోజైంది. రూపాయి అక్టోబరు 10 వ తేదీన కీలకమైన 84 స్థాయిని, డిసెంబరు 19వ తేదీన 85 స్థాయిని బ్రేక్ చేసింది. డిసెంబరు 27వ తేదీన ఇంట్రాడేలో జీవితకాల కనిష్ఠ స్థాయి 85.80ని తాకింది.



క్రీడాభిమానులకు ఈ ఏడాది ఆరంభంలోనే క్రికెట్ పండుగ రానుంది. ఎనిమిదేళ్ల తర్వాత జరుగుతున్న చాంపియన్స్ ట్రోఫీ హైలైట్‌గా నిలవనుంది. హైబ్రిడ్ విధానంలో నిర్వహించనున్న తొలి ఐసీసీ ఈవెంట్ కావడంతో.. సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇక, మహిళల వన్డే వరల్డ్‌కప్.. భారత్‌లో జరగనున్న మెగా ఈవెంట్. ఎప్పటి లాగానే టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ ఈవెంట్లు మజాను పంచనున్నాయి. ఎఫ్-1 రేస్‌ల క్యాలెండర్ ఫుల్‌గా నిండిపోగా.. బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, ఖో-ఖో వరల్డ్‌కప్ అలరించనున్నాయి.

2025 స్పోర్ట్స్ క్యాలెండర్

ఈ ఏడాదీ ఫుల్ జోష్..

జనవరి

డిసెంబరు 28-ఫిబ్రవరి 1: పురుషుల హాకీ ఇండియా లీగ్ 2024-25 (హాకీ)
జనవరి 12-26: మహిళల హాకీ ఇండియా లీగ్ 2024-25 (హాకీ)
జనవరి 12-26: ఆస్ట్రేలియన్ ఓపెన్ (టెన్నిస్)
జనవరి 13-19: ఖో-ఖో ప్రపంచకప్ (ఖో-ఖో)
జనవరి 14-19: ఇండియా ఓపెన్ (బ్యాడ్మింటన్)
జనవరి 18-ఫిబ్రవరి 2: అండర్ 19 మహిళల టీ20 ప్రపంచకప్ (క్రికెట్)

ఫిబ్రవరి

ఫిబ్రవరి 7-14: ఆసియా వింటర్ క్రీడలు
ఫిబ్రవరి 15-జూన్ 29: మహిళల హాకీ ప్రొ లీగ్ 2024-25 (హాకీ)
ఫిబ్రవరి 15-జూన్ 22: పురుషుల హాకీ ప్రొ లీగ్ 2024-25 (హాకీ)
ఫిబ్రవరి 19-మార్చి 9: చాంపియన్స్ ట్రోఫీ (క్రికెట్)

మార్చి

మార్చి 1-12: మహిళల హాకీ జాతీయ చాంపియన్‌షిప్ (హాకీ)
మార్చి 10-11: వరల్డ్ అథ్లెటిక్స్ రిలే (అథ్లెటిక్స్)
మార్చి 11-16: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ (బ్యాడ్మింటన్)
మార్చి 14- మే 25: ఐపీఎల్ (క్రికెట్)
మార్చి 14-16: ఆస్ట్రేలియన్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
మార్చి 16: ఇంగ్లిష్ లీగ్ కప్ ఫైనల్ (ఫుట్‌బాల్)
మార్చి 21-23: చైనా గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)

ఏప్రిల్

ఏప్రిల్ 4-6: జపనీస్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
ఏప్రిల్ 4-15: సీనియర్ పురుషుల హాకీ జాతీయ చాంపియన్‌షిప్ (హాకీ)
ఏప్రిల్ 7-13: మాస్టర్స్ టోర్నీ (గోల్ఫ్)
ఏప్రిల్ 11-13: బహ్రెయిన్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
ఏప్రిల్ 18-20: అబుదాబి గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
ఏప్రిల్ 19- మే 5: వరల్డ్ స్నూకర్ చాంపియన్‌షిప్ (స్నూకర్)
ఏప్రిల్ 26-28: డైమండ్ లీగ్
ఏప్రిల్ 27: లండన్ మారథాన్ (అథ్లెటిక్స్)

మే

మే 2-4: మయామి గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
మే 15-18: పీజీఏ చాంపియన్‌షిప్ (గోల్ఫ్)
మే 16-18: ఐమోలా గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
మే 17-25: వరల్డ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ (టేబుల్ టెన్నిస్)
మే 21: యూరోపియన్ లీగ్ ఫైనల్ (ఫుట్‌బాల్)
మే 23-25: మొనాకో గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
మే 24: జర్మన్ కప్ ఫైనల్ (ఫుట్‌బాల్)
మే 24: ఫ్రెంచ్ కప్ ఫైనల్ (ఫుట్‌బాల్)
మే 24: మహిళల చాంపియన్స్ లీగ్ ఫైనల్ (ఫుట్‌బాల్)
మే 25-జూన్ 7: ఫ్రెంచ్ ఓపెన్ (టెన్నిస్)
మే 27-31: ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ (అథ్లెటిక్స్)
మే 28: యూరోపా కాన్ఫరెన్స్ లీగ్ ఫైనల్ (ఫుట్‌బాల్)
మే 30-జూన్ 1: స్పానిష్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
మే 31: చాంపియన్స్ లీగ్ ఫైనల్ (ఫుట్‌బాల్)

జూన్

జూన్ 4-8: యూఈఎఫ్ఏ నేషన్స్ లీగ్ ఫైనల్స్ (ఫుట్‌బాల్)
జూన్ 5-22: ఎన్‌బీఏ ఫైనల్స్ (బాస్కెట్‌బాల్)
జూన్ 12-15: యూఎస్ ఓపెన్ (గోల్ఫ్)
జూన్ 13-15: కెనడా గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
జూన్ 14-జూలై 13: ఫిఫా క్లబ్ వరల్డ్ కప్ (ఫుట్‌బాల్)
జూన్ 14-జూలై 6: కాన్‌కాఫ్ గోల్డ్ కప్ (ఫుట్‌బాల్)
జూన్ 27-29: ఆస్ట్రియన్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
జూన్ 30-జూలై 13: వింబుల్డన్ (టెన్నిస్)

జూలై


జూలై 2-27: యూఈఎఫ్ఏ మహిళల యూరో (ఫుట్‌బాల్)
జూలై 4-6: బ్రిటిష్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
జూలై 5-26: సీఏఎఫ్ మహిళల ఆఫ్రికా కప్ ఆఫ్ నేషన్స్ ఫుట్‌బాల్)
జూలై 5-29: ఫిడే మహిళల వరల్డ్ కప్ (చెస్)
జూలై 11-ఆగస్టు 3: వరల్డ్ ఆక్వాటిక్స్ చాంపియన్‌షిప్స్ (స్విమ్మింగ్)
జూలై 12-ఆగస్టు 2: కోపా అమెరికా ఫెమినినా (ఫుట్‌బాల్)
జూలై 17-20: ది ఓపెన్ చాంపియన్‌షిప్ (గోల్ఫ్)
జూలై 25-27: బెల్జియన్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)

ఆగస్టు



ఆగస్టు 1-3: హంగేరియన్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
ఆగస్టు 7-17: వరల్డ్ గేమ్స్ (మల్టీ స్పోర్ట్స్)
ఆగస్టు 15-సెప్టెంబరు 15: మహిళల వన్డే వరల్డ్‌కప్ (షెడ్యూల్ ఖరారు కాలేదు)
ఆగస్టు 25-సెప్టెంబరు 7: యూఎస్ ఓపెన్ (టెన్నిస్)
ఆగస్టు 25-31: వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ (బ్యాడ్మింటన్)
ఆగస్టు 27-28: డైమండ్ లీగ్ ఫైనల్ (అథ్లెటిక్స్)
ఆగస్టు 29-31: డచ్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 స్పోర్ట్స్)

సెప్టెంబరు



సెప్టెంబరు 5-12: వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్ (ఆర్చరీ)
సెప్టెంబరు 5-7: ఇటాలియన్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
సెప్టెంబరు 13-21: వరల్డ్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్
సెప్టెంబరు 13-21: వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్
సెప్టెంబరు 19-21: అజర్‌బైజాన్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
సెప్టెంబరు 25-28: రైడర్ కప్ (గోల్ఫ్)
సెప్టెంబరు 27-అక్టోబరు 19: ఫిఫా అండర్-20 వరల్డ్‌కప్
మహిళల వన్డే వరల్డ్‌కప్ (క్రికెట్) (షెడ్యూల్ ప్రకటించాలి)

అక్టోబరు

అక్టోబరు 1-10: వరల్డ్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్ (వెయిట్ లిఫ్టింగ్)
అక్టోబరు 3-5: సింగపూర్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
అక్టోబరు 13-19: వరల్డ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ (బ్యాడ్మింటన్)
అక్టోబరు 17-19: యూఎస్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
అక్టోబరు 19-25: వరల్డ్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్స్ (జిమ్నాస్టిక్స్)
అక్టోబరు 24-26: మెక్సికో గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)

నవంబరు

వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్ (బాక్సింగ్) (షెడ్యూల్ ప్రకటించాలి)
నవంబరు 6-16: వరల్డ్ రైఫిల్, పిస్టల్ చాంపియన్‌షిప్స్ (షూటింగ్)
నవంబరు 7-9: బ్రెజీలియన్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
నవంబరు 15-26: డెఫిలింపిక్స్ (మల్టీ స్పోర్ట్స్)
నవంబరు 20-22: లాస్ వెగాస్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
నవంబరు 25-30: సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ (బ్యాడ్మింటన్)
నవంబరు 28-30: ఖతార్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)

డిసెంబరు



డిసెంబరు 5-7: అబుధాబి గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
డిసెంబరు 10-14: బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ (బ్యాడ్మింటన్)
డిసెంబరు 21-జనవరి 18: ఆఫ్రికా కప్ ఆఫ్ నేషన్స్ (ఫుట్‌బాల్)
పురుషుల హాకీ జూనియర్ వరల్డ్‌కప్ (హాకీ) (షెడ్యూల్ ప్రకటించాలి)

స్పోర్ట్స్



వావ్.. వైశాలి

అజేయంగా క్వార్టర్స్‌లోకి ● అర్జున్, ప్రజ్ఞానంద, హంపిలకు నిరాశ ● వరల్డ్ బ్లిట్జ్ చెస్

న్యూయార్క్: ప్రపంచ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.వైశాలి అదరగొడుతోంది. అనూహ్య ఆటతీరుతో అజేయంగా దూసుకెళ్తున్న ఈ తమిళనాడు క్రీడాకారిణి 9.5 పాయింట్లతో క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకుంది. దీంతో తాజా టోర్నీలో నాకౌట్‌లో అడుగుపెట్టిన ఏకైక భారత ప్లేయర్‌గా నిలిచిన వైశాలి.. 2024లో గుకేశ్, హంపి తర్వాత మరో వరల్డ్ చాంపియన్‌గా రికార్డులకెక్కాలనుకుంటోంది. తొలి దశలో ఆడిన 11 రౌండ్లలో 8 విజయాలు, మూడు డ్రాలతో వైశాలి టాప్‌లో ఉంది. సెమీస్‌లో చోటు కోసం 23 ఏళ్ల వైశాలి ఝు జినెర్ (చైనా)తో తలపడనుంది. టోర్నీలో వైశాలి మినహా భారత ఆటగాళ్ల పోరాటం ముగిసింది. టాప్-8 మాత్రమే క్వార్టర్స్‌కు వెళ్లనుండగా, 8 పాయింట్లతో హంపి తొమ్మిదో స్థానంలో నిలిచింది. దివ్య, వంతిక కూడా నిరాశపరిచారు. ఇక ఓపెన్ విభాగంలోనూ వైశాలి సోదరుడు ప్రజ్ఞానంద (8.5) 23వ స్థానంలో, అర్జున్ ఇరిగేసి (7) 64వ స్థానంలో, ప్రణవ్ (7) 67వ స్థానంలో నిలిచి నిష్క్రమించారు.

ఆస్ట్రేలియా డ్రీమ్ టీమ్ కెప్టెన్ బుమ్రా



సిడ్నీ: ఆస్ట్రేలియా టూర్‌లో బంతితో ఒంటరి పోరాటం చేస్తున్న బుమ్రాకు అరుదైన గౌరవం దక్కింది. క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ప్రతి ఏడాది ప్రకటించే తమ 'అత్యుత్తమ టెస్ట్ టీమ్ ఆఫ్ ద ఇయర్ కెప్టెన్‌గా బుమ్రాను ఎంపిక చేసింది. యశస్వీ జైస్వాల్‌కు కూడా ఈ జట్టులో చోటు లభించింది. 2024లో బుమ్రా అన్ని ఫార్మాట్లలో కలిపి అత్యధికంగా 84 వికెట్లు పడగొట్టాడు. ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌కు చోటు దక్కక పోవడం గమనార్హం.

ఆస్ట్రేలియా అత్యుత్తమ టెస్ట్ జట్టు: జైస్వాల్, బెన్ డకెట్ (ఇంగ్లండ్), జో రూట్ (ఇంగ్లండ్), రచిన్ రవీంద్ర (న్యూజిలాండ్), హ్యారీ బ్రూక్ (ఇంగ్లండ్), కమిందు మెండిస్ (శ్రీలంక), అలెక్స్ క్యారీ (ఆస్ట్రేలియా), మ్యాట్ హెన్రీ (న్యూజిలాండ్), బుమ్రా (కెప్టెన్), హాజెల్‌వుడ్ (ఆస్ట్రేలియా), కేశవ్ మహరాజ్ (దక్షిణాఫ్రికా).

విరాట్, రోహిత్‌లకు విశ్రాంతి!

బుమ్రాకు సైతం.. ఇంగ్లండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో జరుగబోయే పరిమిత ఓవర్ల సిరీస్‌ల్లో సీనియర్లకు విశ్రాంతినిచ్చే అవకాశముంది. ఈనెల 22 నుంచి ఇంగ్లండ్‌తో టీమిండియా ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌లను ఆడనుంది. ఫిబ్రవరి 6 నుంచి జరిగే మూడు వన్డేల సిరీస్‌లో ఈ ముగ్గురికి పనిఒత్తిడి కారణంగా సెలెక్టర్లు విశ్రాంతినివ్వనున్నట్టు మీడియా కథనం. ఎందుకంటే అదే నెల 19 నుంచి ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ జరుగబోతోంది. ఈ టోర్నీని దృష్టిలో ఉంచుకుని బీసీసీఐ కీలక ఆటగాళ్లను తాజాగా ఉంచాలనుకుంటోంది.

సంతోష్ ట్రోఫీ విజేత బెంగాల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సంతోష్ ట్రోఫీను పశ్చిమ బెంగాల్ జట్టు కైవసం చేసుకుంది. మంగళవారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఫుట్‌బాల్ స్టేడియంలో జరిగిన ఫైనల్లో బెంగాల్ 1-0తో కేరళపై గెలిచింది. ఇంజ్యూరీ టైమ్ నాలుగో నిమిషంలో బెంగాల్ స్టార్ ప్లేయర్ రోబి హన్సడా మెరుపు గోల్ చేసి ఆ జట్టును ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. బెంగాల్ జట్టు సంతోష్ ట్రోఫీ గెలవడం ఇది 33వ సారి.

అశ్విన్, భరత్ శతక మోత

● ఆంధ్ర ఘన విజయం

ముంబై: అశ్విన్ హెబ్బర్ (108 నాటౌట్), కెప్టెన్ కేఎస్ భరత్ (107) అజేయ శతకాలతోపాటు సందీప్ (5/28) విజృంభించడంతో.. విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర జట్టు 10 వికెట్లతో మేఘాలయను చిత్తుచేసింది. తొలుత మేఘాలయ 48.2 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. నిశాంత చక్రవర్తి (101), అర్పిత్ (66) రాణించారు. ఛేదనలో ఆంధ్ర 29.3 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 228 పరుగులు చేసి గెలిచింది.

ఆయుష్ ప్రపంచ రికార్డు

లిస్ట్-ఎ క్రికెట్‌లో 150పైగా పరుగులు సాధించిన పిన్న వయస్కుడిగా ముంబై బ్యాటర్ ఆయుష్ మహత్రే (17 ఏళ్ల 168 రోజులు) ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఈ క్రమంలో యశస్వి జైస్వాల్ (17 ఏళ్ల 291 రోజులు) రికార్డును బద్దలుకొట్టాడు. ఆయుష్ (117 బంతుల్లో 181) అదరగొట్టడంతో.. విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లో నాగాలాండ్ (214/9)పైముంబై(403/7) నెగ్గింది.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
నూతన సంవత్సర శుభాకాంక్షలు

6 వేలు కాదు.. 10 వేలు



2

అన్నదాతలకు మోదీ కొత్త సంవత్సర కానుక

కిసాన్ నిధి కింద ఏటా ఇస్తున్న మొత్తం పెంపు

వచ్చే బడ్జెట్‌లో వెల్లడించకముందే ప్రధాని ప్రకటన

బుధవారం 1-1-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

కొత్త ఏడాదిలో.. కొంగొత్తగా!



గ్రామీణ ప్రాంతాల్లో మరో 2 కోట్ల 'ప్రధాన మంత్రి' ఇళ్లు



నేటి నుంచి రాష్ట్రంలో ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం

ఏటీఎంల నుంచి ఈపీఎఫ్ పెన్షన్ విత్‌డ్రాకు వీలు





ఈ ఏడాది పసిడి పది గ్రాములు రూ.90 వేలకు చేరే అవకాశం

రైళ్ల వేళలు మారాయ్!
అమల్లోకి కొత్త టైమ్ టేబుల్



కొన్ని జ్ఞాపకాలు మిగిల్చి గత ఏడాది అస్తమించింది...
కొత్త ఆశల రెక్కలు విచ్చుకుంటూ సరికొత్త ఏడాది ఉదయించింది...

కీలక నిర్ణయాల అమలు నేటి నుంచే

ముందున్నది మంచికాలం... అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త నిర్ణయాలు ప్రకటించాయి. కొత్త ఏడాది తొలి రోజు నుంచే కొన్ని కొత్త నిర్ణయాల అమలూ ప్రారంభమవుతోంది. 2028-29లోపు గ్రామీణ ప్రాంతాల్లో మరో రెండు కోట్ల గృహాలు నిర్మించాలని కేంద్రం నిర్ణయించుకుంది. 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన' కింద... 'అందరికీ ఇల్లు' నినాదాన్ని సాకారం చేయాలని తీర్మానించుకుంది. ఇక... రాష్ట్రంలో ఇప్పటిదాకా పాఠశాలలకే పరిమితమైన 'మధ్యాహ్న భోజనం' బుధవారం నుంచి ఇంటర్ కాలేజీల్లోనూ అమలు కానుంది. జగన్ సర్కారు రద్దు చేసిన ఈ పథకాన్ని కూటమి సర్కారు పునరుద్ధరించింది. దీని ద్వారా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న లక్షన్నర మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. అలాగే... వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ కళాశాలల్లో చదివే ఇంటర్ విద్యార్థులకూ 'సర్వే పల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర స్టూడెంట్ కిట్' పంపిణీపై ఉత్తర్వులు జారీ చేసింది. ఇక... 2024లో సుమారు 20 శాతం పెరిగిన పసిడి ధర కొత్త ఏడాదిలోనూ పరుగులు తీస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది పది గ్రాముల బంగారం రూ.90వేలను తాకుతుందని అంచనా వేస్తున్నారు. అంతకుమించినా ఆశ్చర్యపోనక్కర్లేదని మరికొందరి అంచనా! 2024లో తారా జువ్వలా దూసుకుపోయిన షేర్ మార్కెట్‌లో ఈసారి మరీ అంత దూకుడు ఉండకపోవచ్చునని... అంతర్జాతీయ పరిస్థితులు, ప్రభుత్వ నిర్ణయాల ఆధారంగా కొన్ని రంగాలకు చెందిన స్టాక్స్ మాత్రమే మెరిసే అవకాశముందని నిపుణులు పేర్కొంటున్నారు. నూతన సంవత్సరం తొలి రోజు నుంచి... అంటే బుధవారం నుంచి ఈపీఎఫ్‌వో పెన్షనర్లు ఏ బ్యాంకు ఏటీఎం నుంచైనా సులువుగా తమ పెన్షన్ విత్ డ్రా చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా రైతులకు ప్రధాని మోదీ నూతన సంవత్సర కానుక ప్రకటించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద ఏటా ఇస్తున్న రూ.6 వేలను రూ.10 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే రైతులు తమ సాగు అవసరాల కోసం ఎలాంటి గ్యారెంటీ చూపకుండా రూ.2 లక్షలు రుణం తీసుకునే అవకాశం కూడా కొత్త ఏడాదిలో అమలులోకి వస్తోంది. గతంలో ఈ మొత్తం రూ.1.60 లక్షలు మాత్రమే. రైల్వే టైం టేబుల్ బుధవారం నుంచి మారుతోంది.



బెజవాడలో యువతుల న్యూ ఇయర్ జోష్



మంచి మాట.. మంచి బాట

హ్యాపీ న్యూ ఇయర్‌లో ఏం చేద్దాం?

నేటి యువతకు ఎవరు ఆదర్శం?

కష్టాలకు ఎదురొడ్డి గెలవడం ఎలా?

ప్రత్యేక కథనాలు 13వ పేజీలో...



విశాఖలోని రుషికొండ ఐటీ పార్కులో ఖాళీగా ఉన్న మిలీనియం టవర్లు

మిలీనియం టవర్లకు మోక్షం!

ఐటీ సెజ్ నుంచి మినహాయింపు యత్నాలు

డీనోటిఫై చేయడానికి ఏపీఐఐసీ ప్రతిపాదనలు

త్వరలోనే కొత్త ఐటీ కంపెనీలకు కేటాయింపు

వేల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖలో ఐటీ హబ్ శరవేగంగా దూసుకుపోతోంది. ప్రభుత్వం మారడంతో ఐటీకి అన్నీ శుభసంకేతాలే కనిపిస్తున్నాయి. రుషికొండ ఐటీ పార్కులో గల మిలీనియం టవర్లకూ మంచి రోజులు రానున్నాయి. వీటిలో ఖాళీగా ఉన్న అంతస్థులను ఐటీ సంస్థలకు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే కొత్తగా వస్తున్న ఐటీ కంపెనీలన్నీ ప్రత్యేక ఆర్థిక మండలి (స్పెషల్ ఎకనామిక్ జోన్-సెజ్)తో

మిగతా 12వ పేజీలో...

అమరావతికి టెండర్ల జోష్

నేటి నుంచే టెండర్లకు ఆహ్వానం



ప్రపంచబ్యాంకు, ఏడీబీ నిధులతో చేపట్టే పనులకు మొదటి టెండర్లు

రూ.1,206 కోట్లతో 'ట్రంక్' పనులు.. జోన్-5బీ పరిధిలో 603 కోట్లు

తుళ్లూరు, అబ్బరాజుపాలెం, బోరుపాలెం, దొండపాడు, రాయపూడి గ్రామాల్లో పనులు

రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి సరఫరా.. సీవరేజీ, డక్ట్స్, ప్లాంటేషన్‌లకు శ్రీకారం 12

ఈ-టెండర్లు ఆహ్వానించిన సీఆర్‌డీఏ.. ఈ నెల 21 సాయంత్రం 4 వరకు చాన్స్

"నేను మంచికి మంచిగా ఉంటా. కానీ, దారి తప్పినవారి పట్ల చండశాసనుడినవుతా. సోషల్ మీడియాలో నాయకులు, మహిళలపై అసభ్యకరంగా పోస్టులు పెట్టి, ఇష్టానుసారంగా మాట్లాడేవారి తాటతీస్తా." - సీఎం చంద్రబాబు

ప్రజలే హైకమాండ్

మంచి నాయకుడుంటే అంతా మంచే: చంద్రబాబు

పేదల జీవితాల్లో వెలుగులే నా లక్ష్యం

పింఛను పంపిణీ ఇంటి వద్దే జరగాలి

ఆఫీస్‌లో ఇచ్చినట్టు తెలిస్తే మెమో పంపిస్తా

ఎన్నడూ చూడని విధ్వంసం ఐదేళ్లలో చూశా

కేంద్ర నిధులను కూడా మళ్లించేశారు

అయినా, ఫస్ట్‌కే జీతాలు వేస్తున్నాం

త్వరలో మెగా డీఎస్సీ, వచ్చే విద్యాసంవత్సరం నాటికి టీచర్ల భర్తీ: సీఎం

పల్నాడు జిల్లాలో పింఛన్ల అందజేత

తొలి రోజే 95.46 శాతం పంపిణీ పూర్తి



నరసరావుపేట నియోజకవర్గం యలమంద గ్రామంలో పెన్షన్ లబ్ధిదారు ఇంటిలో కాఫీ కలుపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

నరసరావుపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): "నాకు హైకమాండ్ ఎవరూ లేరు. ఐదు కోట్ల మంది ప్రజలే నా హైకమాండ్. పేదల జీవితాల్లో వెలుగు చూడాలన్నదే ఏకైక లక్ష్యం. నేను ఏం చేసినా అందరికీ న్యాయం జరగాలనేదే నా ఆలోచన, తపన. ప్రజల స్థితిగతులు తెలుసుకుని న్యాయం చేయడానికే వచ్చాను" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం యలమంద గ్రామంలో మంగళవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. అనంతరం గ్రామంలో జరిగిన 'ప్రజా వేదిక-ప్రజాసేవలో' సభలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. "గత ఐదేళ్ల ప్రజలు బయటకు పోలేని పరిస్థితి. కనీసం స్వేచ్ఛగా నవ్వలేకపోయారు. ఇప్పుడు పరిస్థితి మారిందని మిమ్మల్ని చూస్తేనే తెలుస్తోంది. ఇంటింటికి వచ్చి పింఛన్ అందిస్తున్నాం. పింఛన్లు ఒకరోజు ముందే 31నే ఇస్తున్నాం. ఇంటి వద్ద ఇవ్వకుండా ఆఫీస్‌లో

మిగతా 2వ పేజీలో...

వీసీల నియామకానికి

లైన్‌క్లియర్

యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్ల నామినీలు ఖరారు

2 రోజుల్లో సెర్చ్ కమిటీ జీవోలు

2 వారాల్లో కొత్త వీసీలు

5



మద్యం లైసెన్సీలకు

ఊరట

మార్జిన్ 14 శాతానికి పెంపు

గీత కులాలకు వారంలో 340 షాపులు

ముఖ్యమంత్రి ఆదేశం.. ఎక్సైజ్‌పై సమీక్ష

క్వార్టర్ రూ.99 మద్యంతో ఆదాయం రావడం లేదన్న అధికారులు

అయినా తప్పదన్న సీఎం.. అన్ని చోట్లా అందుబాటులో ఉంచాలని స్పష్టీకరణ

బెల్టు షాపులపై కఠినంగా వ్యవహరించాలని నిర్దేశం

అమరావతి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల పాలసీ విషయంలో రాష్ట్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం ఇస్తున్న తక్కువ మార్జిన్‌తో నష్టపోతున్నామని ఆవేదన చెందుతున్న లైసెన్సీలకు ఊరటనిచ్చింది. ప్రస్తుతం సగటున 10.5 శాతం ఉన్న మార్జిన్‌ను 14 శాతానికి పెంచాలని నిర్ణయించింది. మంగళవారమిక్కడ ఎక్సైజ్ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు జరిపిన సమీక్షలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అలాగే కూటమి

మిగతా 12వ పేజీలో...

జలహారతికి ప్రపంచ బ్యాంకు దన్ను

ఆ బ్యాంకు మిగులు నిధులపై చంద్రబాబు దృష్టి!

వివిధ ప్రాజెక్టులకు ఖర్చు చేయగా మిగిలే మొత్తాన్ని తీసుకునే యోచన

ఇప్పటికే ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రితో సీఎం చర్చలు

ప్రస్తుతం 51,364 కోట్ల మిగులు

ఇందులో 40 వేల కోట్లు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖత!

మిగతా 40 వేల కోట్లు కాంట్రాక్టు సంస్థల నుంచి సమీకరణ

'తెలుగు తల్లికి జలహారతి'.. రాష్ట్రం దశ, దిశ మారుస్తుందని సీఎం చంద్రబాబు దృఢంగా విశ్వసిస్తున్నారు. దీనిని సాకారం చేయడానికి ప్రపంచ బ్యాంకు తోడ్పాటు తీసుకోవాలని భావిస్తున్నారు. ఆ బ్యాంకు వివిధ ప్రాజెక్టుల కింద మన దేశానికిచ్చిన రుణంలో మిగిలిపోయిన నిధులను ఈ పథకానికి మళ్లించే అంశంపై ఆయన దృష్టిసారించారు. అంచనా వ్యయం రూ.80,112 కోట్లలో 40 వేల కోట్లు ఇచ్చేందుకు కేంద్రం సానుకూలంగా స్పందించడంతో కార్యాచరణకు నడుం బిగించారు.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గోదావరి జలాలను పోలవరం డ్యాం నుంచి బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్ వరకు తరలించే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు 'తెలుగుతల్లికి జలహారతి'. దీనిపై సీఎం చంద్రబాబు సోమవారం మీడియా సమావేశంలో సవివర ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుకు రూ.80,112 కోట్ల వ్యయం

మిగతా 12వ పేజీలో...

డయాఫ్రం వాల్ పనులు వాయిదా


ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్చర్‌ను నిపుణులు ఆమోదించాకే అనుమతి

కేంద్ర జలసంఘం స్పష్టీకరణ.. 4 నమూనాలు పంపిన జలవనరుల శాఖ

క్రిస్మస్ సెలవుల్లో ఉన్న నిపుణులు.. ఎన్ని సార్లు సంప్రదించినా స్పందన లేదు

7-10 తేదీల మధ్య వారితో వీడియో కాన్ఫరెన్సు

ఇక జనవరి మూడో వారంలోనే పనులు మొదలయ్యే పరిస్థితి 12





రేషన్ బియ్యం మాయం కేసులో

ఆరో నిందితుడిగా

పేర్ని నాని

నగదు బదిలీలన్నీ ఆయన ఆదేశాలతోనే!

గోడౌన్ మేనేజర్ అంగీకారం 14

దాంతోనే మాజీ మంత్రిపై కేసు నమోదు

తెల్లవారుజామున అరెస్టుకు యత్నం

అదృశ్యమై హైకోర్టుకు వెళ్లిన మాజీ మంత్రి

6 వరకు తొందరపాటు చర్యలొద్దు: హైకోర్టు

ఆన్‌లైన్‌లో బ్రేక్ దర్శనాల బుకింగ్! 14

ప్రజాప్రతినిధులకు ప్రత్యేక యూజర్ ఐడీ, పాస్‌వర్డ్

కోటా ప్రకారం వారే నేరుగా బుక్ చేసుకొనే అవకాశం

సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్న టీటీడీ ఉన్నతాధికారులు



సీఎస్‌గా విజయానంద్ బాధ్యతల స్వీకరణ

» సీఎం చంద్రబాబుతో మర్యాదపూర్వక భేటీ

అమరావతి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా కె.విజయానంద్ అమరావతి సచివాలయంలో మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. మంగళవారమే సీఎస్‌గా పదవీ విరమణ చేసిన నీరబ్‌కుమార్ ప్రసాద్.. విజయానంద్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంకా.. ప్రత్యేక సీఎస్‌లు జి.సాయిప్రసాద్, కృష్ణబాబు, టీటీడీ ఈవో శ్యామలరావు, జీఏడీ కార్యదర్శి సురేష్ కుమార్, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, సచివాలయ అధికారులు, ఉద్యోగులు, వివిధ ఉద్యోగ సంఘాల నేతలు నూతన సీఎస్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. బాధ్యతలు చేపట్టాక విజయానంద్ సీఎం చంద్రబాబును ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన విజయానంద్ 1993లో ఉమ్మడి రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టరుగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. సబ్ కలెక్టర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేశారు. ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కోలో ఉన్నత బాధ్యతలు నిర్వహించారు. 2019-21 మధ్య రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా పనిచేశారు. 2023 నుంచి ఇంధన శాఖ ప్రత్యేక సీఎస్‌గా ఉన్నారు. విద్యుత్ రంగంలో సుదీర్ఘ అనుభవం ఉంది. సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు.

ఐదుగురు ఐఏఎస్‌లకు పదోన్నతులు

» ఇద్దరు ఐపీఎస్‌లకు సీనియర్ ఎస్పీలుగా పదోన్నతి

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులకు పదోన్నతులు లభించాయి. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శిగా ఉన్న సురేష్‌కుమార్ ముఖ్య కార్యదర్శిగా పదోన్నతి పొందారు. కేంద్ర సర్వీసులో ఉన్న సాల్మన్ ఆరోఖ్యరాజ్ కూడా ముఖ్య కార్యదర్శి హోదాలో కేంద్రంలోనే కొనసాగనున్నారు.2009 బ్యాచ్‌కు చెందిన మరో ముగ్గురికి కార్యదర్శి హోదా కల్పించారు. సీఎం అదనపు కార్యదర్శిగా ఉన్న కార్తికేయ మిశ్రాకు కార్యదర్శి హోదాలో ఆయన సీఎంవోలో కొనసాగుతారు. సెర్ప్ సీఈవో జీ.వీరపాండియన్, కడప కలెక్టర్ సి.శ్రీధర్ కూడా కార్యదర్శిగా పదోన్నతి పొందారు. వీరు కూడా ప్రస్తుత స్థానాల్లోనే కొనసాగనున్నారు. 2012 బ్యాచ్‌కు చెందిన సిద్ధార్థ కౌశల్, విక్రాంత్ పాటిల్ సీనియర్ ఎస్పీలుగా పదోన్నతి పొందారు.

95.46శాతం పెన్షన్లు పంపిణీ పూర్తి

అమరావతి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉదయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా సామాజిక పింఛన్ల పంపిణీ ప్రారంభించి, సాయంత్రానికి 95.46శాతం లబ్ధిదారులకు నగదు అందజేసింది. అన్నమయ్య జిల్లాలో అత్యధికంగా 96.86శాతం మందికి, ప్రకాశం జిల్లాలో అత్యల్పంగా 93.79 శాతం మందికి పంపిణీ పూర్తయింది. రూ.2,593 కోట్లు లబ్ధిదారులకు చేరింది. కాగా ఇళ్ల వద్దే పెన్షన్లు ఇచ్చే విధానాన్ని పకడ్బందీగా అమలుచేసేందుకు లబ్ధిదారుల ఇళ్లను జియో ట్యాగింగ్ చేశారు. దీంతో పెన్షన్లు ఇళ్ల వద్ద ఇస్తున్నారా? ఇంకెక్కడైనా ఇస్తున్నారా? అనేది అధికారులకు తెలుస్తుంది.



నరసరావు పేట నియోజకవర్గం యలమంద గ్రామంలో ఏడు కొండలు ఇంటిలో కాఫీ కలుపుతున్న చంద్రబాబు



యలమంద గ్రామంలో మహిళకు పెన్షన్ అందజేస్తున్న సీఎం



యలమంద గ్రామంలో నిర్వహించిన ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు

ప్రజలే నా హైకమాండ్

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తే వెంటనే మెమో పంపిస్తా. ఫోన్లో జీపీఎస్ ద్వారా సమాచారం వస్తుంది. రూ.4 వేలు చొప్పున 64 లక్షల మందికి పింఛన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం ఏపీ. మంచి నాయకుడు ఉంటే అంతా మంచే జరుగుతుంది. జూన్‌లో అధికారంలోకి వచ్చినా ఏప్రిల్ నుంచే పింఛన్లు ఇచ్చాం. ఐదు కోట్లమంది ప్రజల కోసమే కష్టపడుతున్నా. ఏం చేసినా అందరికీ న్యాయం జరగాలనేదే నా ఆలోచన, తపన. రాష్ట్ర ప్రజలకు కొత్త సంవత్సరం శుభాకాంక్షలు. తెలుగువారంతా చేసుకునే పండుగ సంక్రాంతి. మళ్లీ మీ అందరి జీవితాల్లో శుభం జరగాలి. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లే బాధ్యత నాది. ఆర్థిక సంస్కరణలకు నాంది పలికిన వ్యక్తి మన్మోహన్‌సింగ్. రాజకీయాలకు అతీతంగా మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలపాలి" అని తెలిపారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే.

వారిని మరిచిపోను..

"పార్టీ కోసం పనిచేసిన వారిని ఎప్పటికీ మరిచిపోను. 90 లక్షల మంది సభ్యత్వం తీసుకున్నారు. కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటాను. ప్రజలు అనుకుంటే ఏదైనా సాధ్యం చేస్తారు. టీడీపీని బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఏమైనా చేయగలరని నిరూపించారు. 40 ఏళ్లలో ఎప్పుడూ చూడని విజయాన్ని చూశాను"

టీచరు పోస్టులు భర్తీ చేస్తాం

"వైసీపీ పాలనలో కంపెనీలన్నీ రాష్ట్రం నుంచి పారిపోయాయి. ఇవాళ ఒక్కో కంపెనీ తిరిగివస్తోంది. మిట్టల్ రూ.లక్ష కోట్ల వ్యయంతో స్టీల్ ప్లాంట్ పెట్టడానికి ముందుకు వచ్చారు. ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నాం. త్వరలోనే మెగా డీఎస్సీ నిర్వహిస్తాం. వచ్చే విద్యా సంవత్సరం నాటికి టీచర్ పోస్టులను భర్తీ చేస్తాం. సంపద సృష్టించాలి. పేదలకు పంచాలి. కష్టాల్లో ఉన్న పేదలకు అండగా ఉండాలన్నది నా ఆశయం. పేదల ఆకలి తీర్చడానికి 198 అన్న క్యాంటీన్లు పెట్టాం. అవసరమైతే ఇంకా పెడతాం. నా జీవితంలో ఎప్పుడూ చూడని విధ్వంసం గత ఐదేళ్లలో చూశా. అన్ని వ్యవస్థలను దోపిడీ చేసి ధ్వంసం చేశారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులన్నీ దారి మళ్లించేశారు. మేం అధికారంలోకి రాగానే చెత్తపై పన్ను ఎత్తేశాం. మత్స్యకారుల ఉపాధి దెబ్బతీసే 217 జీవో రద్దు చేశాం. స్వర్ణకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. మద్యం దుకాణాల్లో కల్లు గీత కార్మికులకు 10 శాతం కేటాయించాం. చేనేత కార్మికుల ఉత్పత్తులపై జీఎస్టీ ఎత్తివేశాం. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే ఖాతాల్లో డబ్బు వేస్తున్నాం. డ్రోన్ల ద్వారా వ్యవసాయానికి శ్రీకారం చుట్టబోతున్నాం. రాబోయే రోజుల్లో రైతులకు ఎలాంటి కష్టాలు రాకుండా చూసుకుంటాం. గాడి తప్పిన ప్రభుత్వాన్ని గాడిలో పెడుతున్నా. నదుల అనుసందానంతో నీటి కొరత లేకుండా చేస్తాం. నేల తల్లికి జలహారతి ద్వారా శ్రీకారం చుడుతున్నాం."

పల్నాడు హింస పోవాలి

"పల్నాడులో హింస పోవాలి. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరిచి, ఉపాధిని కల్పించాలన్నదే నా ఆశయం. రాయలసీమలో ఫ్యాక్షన్‌ను అణచివేశాను. పల్నాడులో మాత్రం నాలాంటి వారు కూడా అడుగుపెట్టలేని పరిస్థితి నిన్నటిదాకా ఉంది. నేను మంచికి మంచిగా ఉంటాను. దారి తప్పిన వారి పట్ల చండశాసనుడిగా ఉంటా. సోషల్ మీడియాలో నాయకులు, మహిళలపై అసభ్యకరంగా పోస్టులు పెట్టి.. ఇష్టానుసారంగా మాట్లాడేవారి తాటతీస్తాం. పల్నాడు జిల్లాలో లెదర్ పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాను. పిడుగురాళ్ల మెడికల్ కళాశాలను ఈ ఏడాది అందుబాటులోకి తేలేకపోయాం. రాబోయే సంవత్సరంలో ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటాం. వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేస్తా" అని చంద్రబాబు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, కడియాల వెంకటేశ్వరరావు, కలెక్టర్ అరుణ్‌బాబు పాల్గొన్నారు.

త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్న సీఎం

కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామిని సీఎం దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు స్వామివారి ప్రసాదం, వస్త్రాన్ని అందజేశారు. అనంతరం కోటప్పకొండలో చేపట్టాల్సిన పనులపై చంద్రబాబు చర్చించారు. రోప్‌వే నిర్మాణం చేపట్టాలని, పాతకోటేశ్వర స్వామి దేవస్థానానికి సోపాన మార్గం నిర్మించాలని ఎంపీ, ఎమ్మెల్యే కోరారు. కోతుల బెడద తగ్గించాలని చంద్రబాబు సూచించారు. ఆయన వెంట దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఉన్నారు.

పింఛను చేతికి.. భరోసా ఇంటిల్లిపాదికి..

పల్నాడు జిల్లా యలమందలో ప్రజలను కలిసి పింఛన్లు అందించిన బాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం యలమందలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని తలారి శారమ్మ ఇంటికి వెళ్లి స్వయంగా పింఛన్ అందజేశారు. ఆమె కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఇల్లు ఎప్పుడు కట్టుకున్నారని చంద్రబాబు ఆరా తీయగా, ఇంటిపై ఇంకా రూ 40 వేల బిల్లు బకాయి ఉందని తెలిపారు. వెనువెంటనే ఇంటి బకాయి చెల్లించాలని అక్కడున్న అధికారులను సీఎం ఆదేశించారు. సెల్ షాపులో పనిచేస్తున్నాననీ, షాపు పెట్టుకొనేందుకు ఆర్థిక సాయం కావాలని శారమ్మ కొడుకు నాగరాజు.. చంద్రబాబును కోరారు. రూ. 3 లక్షలు ఎస్సీ కార్పొరేషన్ నుంచి రుణం ఇస్తారనీ, దీనిలో రూ. 2 లక్షలు రాయితీ పోగా, చిన్నగా రూ. లక్ష రుణం చెల్లించవచ్చని నాగరాజుకు ఆయన సూచించారు. పదవ తరగతి దాకా చదివానని పనికి వెళ్లి అమ్మకు తోడుగా ఉంటున్నానని చెప్పగా.. పని చేసుకుంటునే చదువు కొనసాగించాలని చంద్రబాబు సూచించారు. ఇంటర్ చదవుతున్నాననీ, డాక్టర్ చదవాలని ఉందని శారమ్మ కుమార్తె తెలిపారు. ఆమెకు నీట్ కోచింగ్ ఇప్పించాలని అధికారులకు ఆయన సూచించారు. తన భర్త కరోనాతో మృతి చెందాడని శారమ్మ తెలిపారు. "గత ప్రభుత్వంలో వితంతు పింఛను కోసం దరఖాస్తు చేస్తే విద్యుత్ బిల్లు ముందుగా చెల్లించాలని చెప్పారు. రూ.50 వేలు కరెంట్ బిల్లు బాకీ అప్పు చేసి చెల్లించాకే, పింఛన్ వచ్చింది. అప్పు ఇప్పటికీ తీరలేదని ఆమె చెప్పారు. పింఛన్ రూ 4 వేలు వస్తుందనీ, ఈ డబ్బుతోనే తన కుమార్తెను చదివించుకుంటున్నానని తెలిపారు. ఇంటికి సోలార్ విద్యుత్ ఉచితంగా ఏర్పాటు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. శారమ్మను ప్రజా వేదిక వద్దకు పిలిపించి.. ఎస్సీ కార్పొరేషన్ కింద రూ. 3 లక్షలు విలువైన చెక్కును అందించారు.


కాఫీ కలిపి ఇచ్చిన బాబు

యలమందలోని ఏడు కొండలు ఇంటికి చంద్రబాబు వెళ్లారు. ఇంట్లో ఎంత మంది ఉంటున్నారు...ఉచిత గ్యాస్ ఇచ్చారా?' అని ఆరా తీశారు. టీ పెడతావా అని అడిగి.. తానే తయారు చేస్తానంటూ స్టౌ వద్దకు వెళ్లారు. పాలు కాచి పొడి కలిపి కాఫీని స్వయంగా తయారు చేశారు. ఏడుకొండలు కుటుంబ సభ్యులందరికీ అందించి తాను కూడా కాఫీ సేవించారు. రేకుల షెడ్డులో ఉంటున్నామని, పక్కా ఇల్లు కట్టుకోవడానికి సాయం చేయాలని ఏడుకొండలు కుమారుడు కోరగా, చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఇల్లు కట్టుకునేందుకు రుణం, స్వయం ఉపాధి కోసం బీసీ కార్పొరేషన్ నుంచి రూ.5 లక్షల రుణం అందివ్వాలని అధికారులను ఆదేశించారు. ఏడుకొండలు నడుపుతున్న టైర్ల షాపునకు రూ.60 వేలు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పింఛన్ అందజేశారు. వేదిక వద్ద శ్రీకాకుళం సామ్రాజ్యం, షేక్ రేణుకలకు సీఎం పింఛన్లు అందజేశారు.

మణిపూర్ సీఎం క్షమాపణ

» హింసలో 200 మందికిపైగా మరణించారు

» కొత్త ఏడాదిలోనైనా శాంతి నెలకొనాలి: బీరేన్ సింగ్



ఇంఫాల్/న్యూఢిల్లీ, డిసెంబరు 31: జాతుల వైరం సుదీర్ఘకాలంగా కొనసాగుతుండటంపై మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. మైతేయి, కుకీ తెగల మధ్య ఘర్షణతో 2023 మే నుంచి ఆ రాష్ట్రంలో హింస కొనసాగుతోంది. 250 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. వేలాదిమంది ఇళ్లను వీడిపోయారు. ఇప్పటికీ అనేకమంది పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకుంటున్నారు. దీనిపై మంగళవారం మీడియా ఎదుట విచారం వ్యక్తం చేసిన బీరేన్ సింగ్ ప్రజలను క్షమాపణ కోరారు. 'ఈ ఏడాదంతా చాలా దురదృష్టకర పరిణామాలతోనే కొనసాగింది. గతేడాది మే 3 నుంచి ఇప్పటి వరకు జరిగినదానికి క్షమించమని రాష్ట్ర ప్రజలను కోరుతున్నా. నూతన సంవత్సరం-2025 రాష్ట్రంలో శాంతి, సాధారణ పరిస్థితులను పునరుద్ధరిస్తుందని ఆశాభావంతో ఉన్నా. జరిగిందేదో జరిగిపోయింది. గత తప్పులను మరచిపోయి ఇప్పుడు మనమంతా కొత్త జీవితాన్ని ప్రారంభించాలి. శాంతియుత మణిపూర్, సుసంపన్న మణిపూర్ కోసం మనమంతా కలిసి జీవించాలని రాష్ట్రంలోని అన్ని కులాలను కోరుతున్నా' అన్నారు.

ఈశాన్యంలో 77% హింస మణిపూర్‌లోనే

ఇంఫాల్/న్యూఢిల్లీ, డిసెంబరు 31: ఈశాన్య ప్రాంతంలో 2023లో జరిగిన మొత్తం హింసలో 77 శాతం మణిపూర్‌లోనే చోటుచేసుకుందని తాజాగా కేంద్ర హోంశాఖ వార్షిక నివేదిక వెల్లడించింది. 2022తో పోల్చితే మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు 2023లో పెరిగాయని తెలిపింది. ఈశాన్య ప్రాంతంలో 243 హింసాత్మక ఘటనలు జరుగగా, వాటిలో 187 ఘటనలు మణిపూర్‌లోనే జరిగాయని పేర్కొంది. మణిపూర్‌లో తిరుగుబాటు వ్యతిరేక ఆపరేషన్లలో 33 మంది తిరుగుబాటుదారులను హతమార్చామని, 184 మందిని అరెస్టు చేశామని, 49 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని వివరించింది. అలాగే, 80 తిరుగుబాటు సంస్థల కేడర్ లొంగిపోయారని, 31 ఆయుధాలను స్వాధీనం చేశారని తెలిపింది. కాగా, గడిచిన పదేళ్లలో దేశంలో నక్సలిజం తగ్గుముఖం పట్టిందని కేంద్ర హోం శాఖ వెల్లడించింది. 2026 మార్చి 31కల్లా మావోయిజం పూర్తిస్థాయిలో తుడిచిపెట్టుకుపోతుందని స్పష్టం చేసింది. 2013తో పోలిస్తే.. 2023కల్లా నక్సల్స్ హింస 48%(1,136 నుంచి 594కు) తగ్గిందని.. నక్సల్స్ దాడుల్లో భద్రత బలగాలు, పౌరుల మరణాలు కూడా 65%(397 నుంచి 171) తగ్గినట్లు వివరించింది. నక్సల్స్ ఉనికి కూడా 76 జిల్లాలోని 328 పోలీస్‌స్టేషన్ల నుంచి 42 జిల్లాల్లోని 171 ఠాణాలకు తగ్గినట్లు పేర్కొంది. నక్సల్స్ హింస 25 జిల్లాలకే పరిమితమైనట్లు తెలిపింది.

కేరళ నర్సుకు యెమెన్‌లో మరణశిక్ష



న్యూఢిల్లీ, డిసెంబరు 31: యెమెన్‌లో మరణశిక్ష పడిన భారతీయ నర్సు నిమిష ప్రియను ఆదుకొనేందుకు అన్నివిధాలా ప్రయత్నిస్తున్నామని విదేశాంగ శాఖ తెలిపింది. ఆ దేశ పౌరుడు తలాల్ అబ్దో మెహదీని హత్య చేసిన కేసులో కేరళకు చెందిన ఆమెకు విధించిన మరణశిక్షను దేశాధ్యక్షుడు రషాద్ అల్-అలిమి తాజాగా ఖరారు చేశారు. ఒక నెలలోపే ఆమెకు శిక్ష అమలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ అంశంపై విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం స్పందించారు. 'ప్రియను కాపాడుకొనేందుకు ఆమె కుటుంబం అన్ని అవకాశాలను అన్వేషించడాన్ని అర్థం చేసుకోగలం. ఈ విషయంలో ప్రభుత్వం అన్నివిధాలుగా సహకరిస్తుంది' అని తెలిపారు. 2017 జూలైలో మెహదీని హత్య చేయడంతో పాటు అతడి మృతదేహాన్ని ముక్కలు చేసి పారేసిన కేసులో ప్రియకు ట్రయల్ కోర్టు 2020లో మరణశిక్ష విధించింది. 2022 మార్చిలో ఆమె అప్పీలును అప్పిలేట్ కోర్టు తిరస్కరించింది. 2023 నవంబరులో ఆ దేశ సుప్రీంకోర్టు ఈ తీర్పును సమర్థించింది.

పీఎం కిసాన్ ఇక రూ.10 వేలు!

ఏడాదికి ఇస్తున్న రూ.6 వేలను పెంచిన కేంద్రం



న్యూఢిల్లీ, డిసెంబరు 31: దేశవ్యాప్తంగా రైతులు, పేదలకు ప్రధాని మోదీ నూతన సంవత్సర కానుకలు ప్రకటించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద అన్నదాతలకు అందిస్తున్న పెట్టుబడి సాయాన్ని పెంచుతున్నట్లు తెలిపారు. అలాగే దేశంలో పేదల కోసం మరో 2 కోట్ల ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సర్వే చేయాలని నిర్ణయించారు. 2019 నుంచి మోదీ సర్కారు ఏటా రైతులకు రూ.6 వేలు పెట్టుబడి సాయం అందిస్తోంది. రూ.2 వేల చొప్పున మూడు విడతల్లో అన్నదాతల ఖాతాల్లో సొమ్మును జమ చేస్తున్నారు. ఈ మొత్తాన్ని ఇప్పుడు రూ.10 వేలకు పెంచుతున్నట్లు మోదీ 'ఎక్స్'లో తెలిపారు. రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు వారి ఖాతాల్లో నేరుగా రూ.10 వేలు జమ చేయనున్నట్లు ప్రకటించారు. కిసాన్ నిధిని పెంచేందుకు కేంద్రం కసరత్తు చేస్తోందని.. ఆర్థిక మంత్రి నిర్మల త్వరలో ప్రవేశపెట్టే 2025-26 బడ్జెట్‌లో ప్రకటన చేసే అవకాశాలున్నాయని అధికార వర్గాలు ఇదివరకే పేర్కొన్నాయి. అయితే దానికి ముందే ఆ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచుతున్నట్లు మంగళవారం ప్రధాని స్వయంగా వెల్లడించడం గమనార్హం. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఆరేళ్లుగా అమలు చేస్తున్న ఈ పథకానికి దేశవ్యాప్తంగా విశేష ఆదరణ ఉంది. రైతులకు పంట సాయం కింద బాగా ఉపయోగపడుతోంది. ఇప్పటి వరకు కేంద్రం 18 వాయిదాలు చెల్లించింది. కొత్త ఏడాది ఫిబ్రవరిలో 19వ వాయిదా జమ కోసం రైతులు ఎదురుచూస్తున్న తరుణంలో ప్రధాని ప్రకటన వారిలో ఆనందోత్సాహాలు రేపింది.

మరో 2 కోట్ల ఇళ్ల నిర్మాణంపై సర్వే

దేశంలో పేదల కోసం మరో 2 కోట్ల ఇళ్లను నిర్మించే విషయంపై సర్వే జరిపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాని మోదీ తరఫున నూతన సంవత్సర కానుకగా ఈ నిర్ణయం తీసుకుంది. 2025 మార్చి 31లోపు ఈ సర్వేను పూర్తి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ప్రాధాన్య ప్రాతిపదికన ఈ సర్వేను మూడు నెలల్లో పూర్తి చేయాలంటూ డిసెంబరు 27న కేంద్రం అన్ని రాష్ట్రాలకూ లేఖ రాసింది. 'ఆవాస్ 2024' పేరిట రూపొందించిన యాప్‌లో ప్రజలు స్వయంగా సర్వేలో పాల్గొనేందుకు కేంద్రం అవకాశం కల్పించింది. గత సెప్టెంబరులో ప్రధాని మోదీ ఈ యాప్‌ను ప్రారంభించారు. ఆధార్ ఆధారిత ఈ-కేవైసీ ద్వారా ప్రజలు సర్వేలో పాల్గొనే అవకాశం కల్పించారు. కాగా పేదలకు మరో 3 కోట్ల ఇళ్లు నిర్మిస్తామని బీజేపీ 2024 ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. అయితే రాబోయే నాలుగేళ్లలో అదనంగా 2 కోట్ల ఇళ్లు నిర్మించాలని కేంద్రం భావిస్తున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ మంగళవారం విడుదల చేసిన వార్షిక నివేదికలో పేర్కొంది. మొత్తం 3.33 కోట్ల ఇళ్లను రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేటాయించగా, అందులో 3.22 కోట్ల ఇళ్లు మంజూరయ్యాయని.. 2.68 కోట్ల ఇళ్లు నిర్మించారని తెలిపింది. పీఎంఏవై గ్రామీణ లబ్ధిదారులను గుర్తించేందుకు కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత ఫేస్ టెక్నాలజీని రూపొందించామని, దీనివల్ల మోసాలకు అవకాశం ఉండదని వెల్లడించింది.

మోదీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు

ఆకాంక్షల భారతావనికి ప్రధాని మోదీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. "అంతరిక్షం నుంచి భూమి వరకు.. రైల్వేస్ నుంచి రన్‌వేస్ దాకా.. సంస్కృతి నుంచి ఆవిష్కరణ వరకు.. 2024లో భారత్ గణనీయ పురోగతిని, పరివర్తనను సాధించింది. ప్రగతి దిశగా నా భారత్ వడివడిగా అడుగులేస్తోంది. మేరా భారత్ బఢ్ రహా" అని 'ఎక్స్'లో తెలిపారు. 2025లోకి విశ్వాసంతో అడుగుపెడుతున్న తరుణంలో తన ట్వీట్‌ను కవితా వేదుకగా అభివర్ణించారు. 2024లో భారత విజయాలను, చేరుకున్న మైలురాళ్లను వివరించే 2.41 నిమిషాల వీడియోను ఈ సందర్భంగా ఆయన పోస్టు చేశారు. ఇందులో అంతరిక్ష ప్రయోగాల విజయాలు, సూపర్-కంప్యూటింగ్, రక్షణ ఉత్పత్తుల పెంపు, పౌరవిమానయాన పరిశ్రమ వృద్ధి, హౌరా మైదాన్ అండర్‌వాటర్ మెట్రో, రామేశ్వరం రైలు వంతెన, వందే భారత్ రైళ్లు, దేశవ్యాప్తంగా వైద్యకళాశాలల పెంపు, ఆరోగ్య సౌకర్యాల మెరుగుదల, అటల్ పెన్షన్ స్కీం, పీఎం ఆవాస్ యోజన, అబుదాబిలో దేవాలయ ప్రతిష్ఠ, మూడు కొత్త క్రిమినల్ చట్టాల అమలు మొదలైనవాటి ప్రస్తావన ఉంది. 2024లో తన ప్రభుత్వ ప్రోగ్రెస్ రిపోర్టు కార్డు ఉంది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు 70 వేల కోట్ల డాలర్లకు చేరుకోవడం సహా ఆర్థిక రంగానికి సంబంధించిన ప్రత్యేక సమాచారాన్ని కూడా అందులో పొందుపరిచారు. ఆసియాలో మూడో అతిపెద్ద శక్తిగా భారత్ ఆవిర్భవించడం.. ఉపాధి కల్పన రంగంలో 4.1 కోట్ల మంది యువతకు రూ.2 లక్షల కోట్ల ప్యాకేజీ అందించడం, క్రీడల రంగంలో.. పారా-ఒలింపిక్స్‌లో రికార్డు స్థాయిలో 29 పతకాలు సాధించడం.. పర్యావరణహితం కోరి 'అమ్మ పేరుతో ఒక మొక్క నాటుదాం (ఏక్ పేడ్ మా కే నామ్)' అన్న సందేశం.. గ్రీన్ పవర్ ఉత్పత్తి సామర్థ్యం మొదలైనవాటిని కూడా వివరించారు. సమష్టి కృషితో 2024లో అనేక విజయాలు అందుకున్నామన్నారు. 2025లో మరింత కష్టించి 'వికసిత్ భారత్' కలను సాకారం చేసుకుందామని తెలిపారు. కొత్త సంవత్సరం అందరికీ పురోగతి, శాంతి, ఆరోగ్యం అందిస్తుందన్న ఆశాభావాన్ని మోదీ వ్యక్తంచేశారు.

అప్పు ఎగ్గొట్టి.. మరింత దోచేయాలని!

» పోలీసు వేషంలో ముఠా యత్నం

» రూ.3.5 కోట్ల డిమాండ్

» పోలీసులను ఆశ్రయించిన వ్యాపారి

» సూత్రధారి సహా ఏడుగురు అరెస్టు

ఒంగోలు క్రైం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు ఎగ్గొట్టడమేకాక, పోలీసులమంటూ బెదిరించి మరికొంత నగదు దోచుకునేందుకు ప్రయత్నించిన ముఠాను ప్రకాశం జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు సహా ఏడుగురిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలులోని మంగమూరు రోడ్డులో నివసించే చలగర్ల శ్యామ్‌కుమార్ ఒంగోలుకు చెందిన బంగారం వ్యాపారి వద్ద రూ.10లక్షలు అప్పు తీసుకున్నాడు. ఈ సొమ్ము ఆరు నెలల్లో తిరిగిస్తానని చెప్పాడు. ఇచ్చిన 10 నెలల గడువు ముగియడంతో శ్యామ్‌కుమార్‌పై డబ్బు కోసం బంగారం వ్యాపారి ఒత్తిడి తెచ్చాడు. అప్పు తిరిగి ఇవ్వకుండా వ్యాపారి నుంచి డబ్బు గుంజేందుకు శ్యామ్‌కుమార్ పన్నాగం పన్నాడు. ఈ నెల 29న ఓ మహిళను పిలిపించి మంగమూరురోడ్డులోని ఓ ఇంట్లో ఉంచాడు. సాయంత్రం వస్తే మీ డబ్బు చెల్లిస్తానని వ్యాపారికి చెప్పాడు. అతడి ఇంటికి వచ్చిన వ్యాపారి.. వాష్‌రూమ్‌లోకి వెళ్లొచ్చేసరికి పోలీసు డ్రెస్ వేసుకున్న నలుగురు అతడిపై దాడి చేశారు. దుస్తులు విప్పించి ఫొటోలు, వీడియోలు తీశారు. ఫేస్ పౌడర్ ప్యాకెట్లు అక్కడ పడేసి, ఇక్కడ డ్రగ్స్ దొరికాయని, అమ్మాయి కూడా ఉందని వ్యాపారిని భయపెట్టారు. అతని వద్ద ఉంగరం లాక్కున్నారు. ఆ నలుగురూ శ్యామ్‌కుమార్‌ను కూడా బెదిరించారు. మహిళతో ఉన్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతామన్నారు. ఈ కేసు నుంచి తప్పించాలంటే రూ.3.5 కోట్లు ఇవ్వాలని చెప్పి, సొమ్ము తీసుకురమ్మని వ్యాపారిని పంపారు. మరునాడు వ్యాపారి ఒంగోలు తాలుకా పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు అక్కడికి వెళ్లేసరికి ముఠా పరారైంది. కేసు పెట్టిన తాలుకా సీఐ.. ఫోన్ నంబర్ల ఆధారంగా దర్యాప్తు చేపట్టి సంఘమిత్ర హాస్పిటల్ సమీప ఫ్లైఓవర్ వద్ద ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడు శ్యామ్‌కుమార్‌తోపాటు హైదరాబాద్ మణికొండకు చెందిన నిమ్మల విజయలక్ష్మి, లింగంపల్లికి చెందిన సందాపురం శ్రీశైలం, అంబర్‌పేట శ్రీలక్ష్మి, కొక్కరపాటి దుర్గాప్రసాద్, దోర్నాల వినోద్‌కుమార్, దోర్నాల శ్రీశైలంను అరెస్టు చేశారు. రాజు, సురేశ్ అనే ఇద్దరు పరారీలో ఉన్నారు.

లోకం తీరు



మంచు విష్ణు అనుచరుల

అడవి పందుల వేట?

» సోషల్ మీడియాలో వీడియో వైరల్

» పాత వీడియోగా తేల్చిన అధికారులు

పహాడీషరీఫ్/హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మంచు కుటుంబంలో అంతర్గత కటుంబ కలహాలు చల్లారక ముందే మరో వీడియో వైరల్‌గా మారింది. ముగ్గురు వ్యక్తులు అడవి పందిని వేటాడి తీసుకెళ్తున్న ఓ వీడియో మంగళవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జల్‌పల్లిలోని మంచు కుటుంబం నివాసం సమీపంలోని గరిగుట్ట అడవిలో మంచు విష్ణు అనుచరులైన మేనేజర్ కిరణ్, ఎలక్ట్రీషన్ దేవేంద్ర ప్రసాద్‌తో పాటు మరో వ్యక్తి అడవి పందిని వేటాడి బంధించి భుజాలపై మంచు టౌన్ లోకి తీసుకెళ్తున్న దృశ్యాలు వైరల్ గా మారాయి. దీనిపై స్పందించిన పహాడిషరీఫ్ పోలీసులు, అటవీశాక సిబ్బంది రంగంలోకి దిగి.. ఇది పాత వీడియోగా తేల్చారు. జల్‌పల్లిలో మంచు టౌన్‌షిప్‌లో మంచు మోహన్‌బాబు ఫ్యామిలీ గత పదిహేను సంవత్సరాలుగా నివసిస్తున్నారు. కొన్నాళ్లుగా వారి కుటుంబంలో తగాదాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ వీడియోను మంచు మనోజ్ వైరల్ చేశాడన్న ప్రచారం జరుగుతోంది.

రైళ్ల వేళల్లో మార్పులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొత్త రైల్వే టైమ్ టేబుల్ బుధవారం నుంచి అమలులోకి వచ్చింది. దీని ప్రకారం దక్షిణ మధ్య రైల్వేతో పాటు దేశవ్యాప్తంగా పలు రైళ్ల వేళలు మారాయి. ఈ వివరాల కోసం ఐఆర్‌సీటీసీ, ఎన్‌టీఈఎస్ వెబ్‌సైట్లను సందర్శించాలని రైల్వే అధికారులు సూచించారు. ప్రయాణికులు ముందుగా తాము ఎక్కవలసిన రైలు వేళలు మారాయో లేదో ఒకసారి తనిఖీ చేసుకోవాలన్నారు. విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఇక నుంచి 15 నిమిషాలు ముందుగా ఉదయం 6 గంటలకే బయలుదేరుతుంది.


నూతన సంవత్సర శుభాకాంక్షలతో...
Happy new year 2025
సోనోవిజన్ న్యూ ఇయర్ సేల్
Upto 22.5% క్యాష్ బ్యాక్
Credit Card Customers, Conditions Apply
15% క్యాష్ బ్యాక్
Paper Finance Customers, Conditions Apply
1 EMI Free
Conditions Apply
అన్ని కంపెనీలకు చెందిన ఎల్ఇడి, మొబైల్స్, ల్యాప్‌టాప్స్, రిఫ్రిజిరేటర్స్, వాషింగ్‌మెషిన్స్, ఎయిర్‌కండీషనర్స్, మిక్సర్ గ్రైండర్స్, మైక్రోఓవెన్స్, గ్యాస్‌స్టౌవ్స్, చిమ్నీ లాంటి అన్ని గృహోపకరణములపై
ముందెన్నడూ లేని న్యూ ఇయర్ డిస్కౌంట్ సేల్ ఆఫర్స్
BAJAJ FINSERV
HDB FINANCIAL SERVICES
IDFC FIRST Bank
HDFC BANK
LG Life's Good
Home Theatre
208 Cm (83") Ultra HD 4K OLED
165 Cm (65") Ultra HD 4K QLED
SAMSUNG
SONY
189 Cm (75") LED 4K Ultra UHD
164 Cm (65") LED 4K Ultra HD Smart
Panasonic
LLOYD
108 Cm (43") LED 4K HD
108 Cm (43") Ultra 4K Google LED
TCL
Haier
BPL
108 Cm (43") 4K Google LED
108 Cm (43") UHD Google LED
108 Cm (43") Ultra 4K Google LED
iPhone 16, 16+ Upto 5000/- Cash Back
16 Pro, 16 Pro Max Upto 4000/- Cash Back
Smart WATCH 9/0, 12/0, 12/4 Schemes Available
24/0, 9/0, 12/0 Schemes Available SBI, ICICI, Kotak Credit Cards and Selected Bank Cards (Exchange Bonus)
S-24 Ultra 5G Upto 12000/- Cash Back
SAMSUNG
A-55 5G
9/0, 12/0, 24/0 Schemes Available
vivo
5G X-200, X-200 Pro
Upto 10% Cash Back
8/0, 12/0, 24/0 Schemes Available
oppo
5G Reno 12 Pro, 12 Pro+
6/0, 8/0, 11/2 Schemes Available
ONEPLUS
5G 12 & 12 Pro
Instant CashBack ICICI Credit Card
12/4 Scheme Available
realme
5G 13 Pro, 13 Pro+
6/0, 8/2, 10/3 Schemes Available
mi Redmi
5G Note13, Note 13 Pro
6/0, 8/0, 10/2, 12/4 Schemes Available
hp LAPTOP 12/4 Scheme Available
DELL LAPTOP 15/4 Scheme Available
ASUS LAPTOP 12/4 Scheme Available
MacBook LAPTOP 24/0 Scheme Available 10000/- Cash Back
LG
SAMSUNG
Whirlpool
Haier
Side by Side 635 Litres Refrigerator
Side by Side 650 Litres Refrigerator
Frost Free Double Door 235 Litres Refrigerator
Frost Free Double Door 240 Litres Refrigerator
LG
SAMSUNG
BOSCH
IFB
Front Load Automatic Washing Machine 11 KGS
Front Load Automatic AI Ecobubble Washing Machine 12 KGS
Front Load Automatic Washing Machine 8.5 KGS
Top Load Automatic Washing Machine 7 KGS
LLOYD 5Star & 3Star Inverter A.C
BLUE STAR 5Star & 3Star Inverter A.C
DAIKIN 5Star & 3Star Inverter A.C
VOLTAS 5Star & 3Star Inverter A.C
HITACHI 5Star & 3Star DC Inverter A.C
Haier 5Star & 3Star Inverter A.C
SMALL APPLIANCES
Water Dispenser
Water Purifier RO
Water Geyser 10 Litres
Microwave Oven
Air Chimney
3 Burner Glass Cooktop
Wet Grinder
Rice Cooker
Mixer Grinder 3 Jar, 750 Watts
Juicer
Air Fryer
Kettle
Iron Box
Blender
Conditions Apply
కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు లోకల్ అడ్రస్ ప్రూఫ్ అవసరం లేకుండా EMI సదుపాయం కలదు, షరతులు వర్తిస్తాయి
AMAZON PAY Upto 2000/- CASH BACK Conditions Apply
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్
విజయవాడ, విజయప్లాజా, ఏలూరు రోడ్, విజయవాడ 9154281648, 649, 650.
విజయవాడ, ఏలూరు రోడ్, రామమందిరం దగ్గర. 9440804182, 9246666202
విజయవాడ, ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట. 9246666664, 9100991701, 9440804184
విజయవాడ, యం.జి.రోడ్, ఆల్ ఇండియా రేడియో ఎదురు. 9246666203, 9154281640
విజయవాడ, పటమట, మోహన్‌దాస్ థియేటర్ దగ్గర. 9246661616, 9100991702
విజయవాడ, కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్ 9440804183, 9246666209
గొల్లపూడి, ఆంధ్రహాస్పిటల్ బిల్డింగ్. 8333924930, 9154281628
విజయవాడ, కానూరు, యం.జి.రోడ్. 8712600536, 8712600537,
శ్రీనగర్ కాలని, రింగ్ రోడ్డు, విజయవాడ. 8712600531, 32, 33
ఎనికేపాడు, ఏలూరు రోడ్. 9100991703, 9154281626
పోరంకి, మెయిన్ రోడ్ సెంటర్. 9154281645, 46, 47
కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి. 7331149366, 367, 368
గుడివాడ, ఏలూరు రోడ్. 9154281178, 79
మచిలీపట్నం, కోనేరు సెంటర్, మునిసిపల్ పార్క్ ఎదురు. 7331149379, 80, 81

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రాజనీతిజ్ఞుడు, రైతుబిడ్డ

ప్రజాస్వామ్య వ్యవస్థలు ప్రజానుకూలంగా ఉండడం లేదు. ఉత్తమ నాయకులు కొరవడడం కూడా అందుకు ఒక కారణం. గత గురువారంనాడు మన్మోహన్ సింగ్, ఆదివారం నాడు జిమ్మీ కార్టర్ శాశ్వత నిష్క్రమణలు కాలధర్మమే అయినప్పటికీ ప్రపంచ పురాతన, అతి పెద్ద ప్రజాస్వామ్య సమాజాలకు పరితాప ఘటనలు. ఇరువురూ తమ తమ గణతంత్ర రాజ్యాల సంస్థాపక ఆశయాలకు నిబద్ధమైనవారు. ఒకరు యాదృచ్ఛికంగా భారత ప్రధానమంత్రి అయ్యారు; మరొకరు జీవనయానంలో పౌర ధర్మాలను నిజాయితీగా నిర్వర్తిస్తూ నాయకుడుగా వికసించిన విలక్షణుడు. ప్రపంచ వ్యాప్తంగా పలు సమస్యల పరిష్కారానికి కృషి చేసిన రాజనీతిజ్ఞుడు.

వంద సంవత్సరాల పైబడిన వయసులో మరణించిన అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ రైతు కుటుంబం నుంచి ప్రభవించారు. చిన్నతనంలోనే పొలం పనులు అన్నీ చేసేవారు. స్వరాష్ట్రమైన జార్జియాలో జాతి వివక్ష తీవ్రంగా ఉండేది. అయినా నల్లజాతి పాలేర్లతో కలిసిమెలిసి పనిచేయడం, తల్లిదండ్రుల సంస్కార భావాలు చిన్నారి జిమ్మీని ఆ సంకుచితత్వ ధోరణుల పట్ల విముఖుడిని చేశాయి. వ్యవసాయాన్ని జీవనాధారంగా చేసుకున్న కార్టర్ 1962లో రాజకీయాలలోకి ప్రవేశించేందుకు నిర్ణయించుకున్నారు. జార్జియా సెనేట్ కు రెండుసార్లు ఎన్నికయ్యారు. గవర్నర్ పదవికి పోటీ చేసి ప్రథమ ప్రయత్నంలో విఫలమయ్యారు. రెండో ప్రయత్నంలో జయపతాక ఎగురవేశారు. ఈ సందర్భంలో ఇరానియన్ – జూయిష్ మూలాలు ఉన్న డేవిడ్ రబ్హాన్ తన విమానంలో కార్టర్‌ను ప్రచారానికి రాష్ట్రమంతటా తిప్పాడు. ఎటువంటి ప్రతిఫలాన్ని ఆడగలేదు కానీ, జాతివివక్షకు కాలం చెల్లిపోయిందని గవర్నర్‌గా మీ ప్రారంభోపన్యాసంలో ప్రకటించాలని కోరాడు. 1971 జనవరిలో జార్జియా గవర్నర్‌గా తన ప్రారంభోపన్యాసంలో కార్టర్ అదే మాట గట్టిగా చెప్పారు. పేదలు, గ్రామీణులు, నల్ల జాతివారు అందరికీ అన్నిటా సమన్యాయం చేయడమే తన విధ్యుక్త ధర్మమని ప్రకటించారు. 1976లో అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకై డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థిత్వాన్ని కార్టర్ సాధించుకున్నారు.

వియత్నాం నుంచి అవమానకరంగా నిష్క్రమించవలసిరావడం; చమురు ధల పెరుగుదల, వాటర్ గేట్ కుంభకోణం.. ఈ మూడూ 1970 దశకం ప్రథమార్థంలో అమెరికా సమాజాన్ని కుదిపివేశాయి. వీటి నేపథ్యంలో నీతి నిజాయితీలకు నిండుతార్కాణంగా ఉన్న జిమ్మీ కార్టర్ ను అమెరికా ఓటర్లు గెలిపించారు. 1977 నుంచి 81 దాకా కొనసాగిన ఆయన అధ్యక్షతను, దురదృష్టవశాత్తు ఇరాన్ లో అమెరికా ఖైదీల ను విడిపించడంలో వైఫల్యానికి మాత్రమే గుర్తు చేసుకోవడం పరిపాటిగా ఉన్నది. నిజానికి కార్టర్ పాలన చాలా ప్రభావశీలమైన మార్పులు తీసుకువచ్చింది. పనామా కాలువపై నియంత్రణ అధికారాలను పూర్తిగా పనామా దేశానికి అప్పగించేందుకు కార్టర్ చొరవ తీసుకున్నారు. లాటిన్ అమెరికా దేశాలలోని సైనిక పాలకులకు అమెరికా మద్దతు నిచ్చే ఆనవాయితీకి స్వస్తి చెప్పారు. కమ్యూనిస్టు చైనాతో సత్సంబంధాలను నెలకొల్పుకునేందుకు నిక్సన్ హయాంలో జరిగిన ప్రశస్త కృషిని కార్టర్ మరింత ముందుకు తీసుకువెళ్లారు. అయితే ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం రావడం, టెహ్రాన్ లోని అమెరికా రాయబారి కార్యాలయంలోని సిబ్బందిని ఇరానియన్ విప్లవకారులు తమ నిర్బంధంలోకి తీసుకోవడం సంభవించింది. వారిని విడిపించే ప్రయత్నం విఫలమవడం కార్టర్ ప్రభుత్వ ప్రతిష్ఠను పూర్తిగా మసకబార్చింది. 1980 అధ్యక్ష పదవి ఎన్నికలలో కార్టర్ ఘోర పరాజయానికి అది దారితీసింది.

ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణకు జిమ్మీ కార్టర్ అగ్ర ప్రాధాన్యమిచ్చారు. ఇజ్రాయిల్, ఈజిప్ట్ మధ్య చరిత్రాత్మక శాంతి ఒప్పందాన్ని సుసాధ్యం చేయడంలో ఆయన కీలక పాత్ర వహించారు. వాతావరణ మార్పు విషమ పర్యవసానాలపై సమగ్ర అవగాహనతో వాటి నిరోధానికి ఆయన పటిష్ఠ చర్యలు చేపట్టారు. వైట్ హౌస్ నుంచి నిష్క్రమించిన తరువాత కార్టర్ ప్రపంచవ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలకు అంకిత మయ్యారు. అమెరికా అధ్యక్షుడుగా కార్టర్ వైఫల్యాలు ఏవైనప్పటికీ ఆయనపై చరిత్ర తీర్పు దయాభావంతో ఉంటుంది. కార్టర్ మహా చదువరి, బహు గ్రంథ రచయిత కూడా. బ్రిటిష్ కవి డిలాన్ థామస్ ను అమితంగా అభిమానించే కార్టర్ కవిత్వమూ రాశారు. తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన చిన్ననాటి పరిసరాల ప్రభావం తనలో సజీవంగా ఉందని ఒక కవితలో అభివర్ణించుకున్న మట్టి మనిషి జిమ్మీ కార్టర్.

కొన్ని ప్రశ్నలతో కొత్త ఏడాదిలోకి..!





■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'ఈ దేశం ఎటు పోతుందో అని భయమేస్తోంది. ఎవర్నీ నమ్మడానికి వీల్లేదు. ప్రతి ఒక్కరూ అవినీతికి పాల్పడుతున్నారు. మనుషులకు డబ్బే ప్రధానమైంది. ఎవరి గురించి ఏ ఆరోపణ వస్తుందో చెప్పలేకుండా ఉన్నాం. చాలా బాధ కలుగుతోంది. ఈ దుస్థితి చూసి నాకు మనశ్శాంతి కరువైంది. మా పిల్లలైతే ఈ వయస్సులో విశ్రాంతి తీసుకొమ్మని కోరుతున్నారు' అని 2013 మే 8న అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నిర్వేదం వ్యక్తపరిచారు. మాజీ ఎంపీ, అంతకు ముందు రాజ్యసభలో తనకు సహచరుడుగా ఉన్న యలమంచిలి శివాజీ తనను పార్లమెంట్‌లో కలుసుకున్నప్పుడు మన్మోహన్ తన ఆవేదన వెళ్లగక్కారు. బొగ్గు బ్లాకుల కేటాయింపులు, 2జీపై జేపీసీ ముసాయిదా నివేదిక, తెలంగాణ తదితర అంశాలపై పార్లమెంట్ అట్టుడికి పోతున్న రోజులవి. 'మీరు విశ్రాంతి తీసుకుంటే మీకంటే నిజాయితీ గల నాయకుడు దేశానికి మరెవరు దొరుకుతారు?' శివాజీ ఆయనతో అన్నారు. 'మనం నిజాయితీగా ఉన్నామన్నా నమ్మేదెవరు?' అని మన్మోహన్ వ్యాఖ్యానించారు. 'కార్పొరేట్ సంస్థలే అన్నీ నిర్ణయిస్తున్నాయి' అని ఆయన వాపోయారు. యూపీఏ ప్రభుత్వం పదవీకాలం మరో ఏడాది ఉండనగా మన్మోహన్ సింగ్ చేసిన వ్యాఖ్యలవి. దేశంలో ఏడాది తర్వాత జరిగే పరిణామాలను మన్మోహన్ అప్పటికే ఊహించారనడానికి ఈ వ్యాఖ్యలే నిదర్శనం. మన్మోహన్‌తో మాట్లాడి వచ్చిన తర్వాత శివాజీ సెంట్రల్ హాలులో ఆంధ్రజ్యోతి ప్రతినిధికి ప్రధానితో తన సంభాషణను పంచుకున్నారు. మరునాడు 'దేశం ఎటుపోతోంది?' అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతి మొదటి పేజీలో వార్త వచ్చింది. ఇది సంచలనం సృష్టించడంతో ప్రధానమంత్రి కార్యాలయం ఆంధ్రజ్యోతి ప్రతులను తెప్పించుకున్నది. నిజానికి అప్పుడున్న పరిస్థితుల్లో ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించేవే. కాని మన్మోహన్ సింగ్ కానీ, ఆయన కార్యాలయం కానీ ఈ వార్తను ఖండించలేదు. మన్మోహన్ సింగ్ ప్రజాస్వామిక దృక్పథానికి, ఆయనలో కూడా పీవీ మాదిరి 'లోపలి మనిషి' ఉన్నాడని చెప్పేందుకు ఇది నిదర్శనం.

'కాంగ్రెస్ పార్టీలో రెండు అధికార కేంద్రాలు ఉండడానికి వీలు లేదు. నేను ఒక ప్రభుత్వాధినేతగా పార్టీకి అనుగుణంగా నడుచుకోవాలి' అని భావించిన మన్మోహన్ సింగ్ ప్రధానిగా తనకిష్టం లేని పనులు ఎన్ని జరిగినా పెదవి విప్పలేదు. పార్టీ విస్తృత ప్రయోజనాల కోసం ఆయన మౌనం పాటించేవారు. అయితే అదే సమయంలో తనను ఆర్థిక మంత్రిగా నియమించిన తన రాజకీయ గురువు పీవీ నరసింహారావును ఆయన తరుచూ కలుసుకునేవారు. పీవీ లేకపోతే తాను రాజకీయాల్లోకి వచ్చే వాడిని కానని ఆయన పలు సందర్భాల్లో అంగీకరించారు. పీవీ మరణానంతరం ఏపీ భవన్‌లో ప్రతి ఏడాది నిర్వహించే సంస్మరణ సభకు ఎవరు హాజరు కాకపోయినా ఆయన మాత్రం వచ్చి వెళ్లేవారు. తన హయాంలో కేంద్రమంత్రిగా ఉన్న జైపాల్ రెడ్డితో ఆయన సత్సంబంధాలు కొనసాగించేవారు. మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు 1993లో జరిగిన స్టాక్ మార్కెట్ కుంభకోణంపై నియమించిన జేపీసీలో తనపై వ్యాఖ్యలు చేసేందుకు జైపాల్ కారకుడని తెలిసినప్పటికీ ఆయన జైపాల్‌తో సన్నిహితంగా కొనసాగుతూ తన ఆలోచనలు పంచుకునేవారు. రాంనివాస్ మీర్ధా చైర్మన్‌గా ఉన్న ఈ జేపీసీ మన్మోహన్ సింగ్‌కు క్లీన్‌చిట్ ఇచ్చినప్పటికీ స్టాక్ మార్కెట్‌లో ఉత్థాన పతనాలను పట్టించుకోకుండా ఆర్థిక మంత్రి మొద్దు నిద్రలో ఉండడం సరైంది కాదనే వ్యాఖ్యను జైపాల్ చేర్చారు. జైపాల్ వాడిన 'స్లంబర్' (మొద్దు నిద్ర) అనే పదం మన్మోహన్ సింగ్‌కు బాధ కలిగించడంతో తన పదవికి రాజీనామా చేశారు. కాని పీవీ ఆయనకు నచ్చచెప్పి రాజీనామాను తిరస్కరించారు. అదే మన్మోహన్ సింగ్ కాంగ్రెస్‌పై కార్పొరేట్ సంస్థల ఒత్తిడి రీత్యా జైపాల్ రెడ్డిని పెట్రోలియం మంత్రిత్వ శాఖ నుంచి శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖకు మార్చినప్పుడు స్వయంగా జైపాల్‌తో మాట్లాడి మనస్తాపం చెందవద్దని కోరారు. యూపీఏ ప్రభుత్వం గద్దె దిగిన తర్వాత జైపాల్ రచించిన 'టెన్ ఐడియాలజీస్' పుస్తకాన్ని మన్మోహన్ సింగ్ ఢిల్లీలో ఆవిష్కరించారు. సైద్ధాంతిక చర్చలు నిరంతరం జరుగుతున్నప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని ఆయన చెప్పారు. ఈ పుస్తకం చదువుతుంటే తనకు కేంబ్రిడ్జిలో రోజులు గుర్తుకు వస్తున్నాయని, వృత్తిపరంగా రాజకీయ నాయకుడు అయినప్పటికీ ప్రస్తుత సంక్షోభాలకు కొత్త పరిష్కారాలను అన్వేషించిన మేధావిగా జైపాల్ గుర్తింపు పొందారని మన్మోహన్ సింగ్ అన్నారు.

పాత సంవత్సరం గడిచి కొత్త సంవత్సరం ప్రవేశిస్తున్న వేళ కొత్త ఏడాదిలో మన్మోహన్ సింగ్ లాంటి వ్యక్తులు లేరన్న విషయం గుర్తుకు వచ్చి ఎంతో బాధ కలుగుతుంది. ప్రతి ఏడాదీ వ్యక్తులనే కాదు, చరిత్రల్నీ, సంప్రదాయాల్నీ, విలువల్నీ కూడా తుడిచిపెడుతుంటుంది. మన్మోహన్ సింగ్ ఏనాడూ మీడియాతో మాట్లాడేందుకు వెనుకాడేవారు కాదు. ఆయనతో రెండు మూడు సార్లు విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఆయన ప్రత్యేక విమానంలో ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పరిచయం చేసుకుని పలకరించడమే కాదు. అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానం ఇచ్చిన సందర్భాలు మరిచిపోలేనివి.

ఆధునిక భారతదేశ నిర్మాణంలో మన్మోహన్ సింగ్ పాత్ర విస్మరించలేనిది. కాంగ్రెస్‌లో తన కంటే సీనియర్ లైన పీవీ నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీ, చిదంబరం, ఎకె ఆంటోనీ లాంటి మేధావులు ఎందరో ఉన్నప్పటికీ మన్మోహన్ సింగ్ ఆ పార్టీలో ప్రవేశించిన కొద్ది రోజులకే వారితో పాటు ఇమిడిపోయారు. జైపాల్ మాదిరే ఆయన కాంగ్రెస్ మేధావిగా గుర్తింపు పొందారు. మన్మోహన్ సింగ్ మరణించిన తర్వాత ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోనే కాదు, దేశంలోనే భావదారిద్ర్యం ఏర్పడిందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. మేధావులను, ఆలోచనాపరులను ప్రోత్సహించి వారి ద్వారా ఎంతో కొంత ప్రయోజనం పొందే సంస్కృతిని పార్టీలు కోల్పోతున్నాయి. వారికి బదులు వేల కోట్ల డబ్బులు ఖర్చులు పెట్టి ఎమ్మెల్యేలను గెలిపించే నేతలు, వ్యూహకర్తలు ఉంటే సరిపోతుందన్న భావన ఇప్పుడు పెరిగిపోతోంది. రాజకీయ పార్టీలు ఇప్పుడు సిద్ధాంతాల ఆధారంగా ప్రజల ముందుకు వెళ్లనప్పుడు, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు, ధనబలం ప్రధానమైనప్పుడు, పార్టీలకు మేధావులు, సిద్ధాంతకర్తల అవసరం ఏముంటుంది?

> మేధావులు, ఆలోచనాపరులను ప్రోత్సహించి వారి ద్వారా ఎంతో కొంత ప్రయోజనం పొందే సంస్కృతిని పార్టీలు కోల్పోతున్నాయి. వారికి బదులు వేల కోట్ల డబ్బులు ఖర్చులు పెట్టి ఎమ్మెల్యేలను గెలిపించే నేతలు, వ్యూహకర్తలు ఉంటే సరిపోతుందన్న భావన ఇప్పుడు పెరిగిపోతోంది. సిద్ధాంతాల ఆధారంగా ప్రజల ముందుకు వెళ్లనప్పుడు, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు, ధనబలం ప్రధానమైనప్పుడు రాజకీయ పక్షాలకు మేధావులు, సిద్ధాంతకర్తల అవసరం ఏముంటుంది?

దేశ రాజకీయాలకు సంబంధించినంత వరకు 2024 ఒక చారిత్రక ఘట్టం. రాజకీయాలకు సంబంధించి మలుపుగా భావించవచ్చు. అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగి శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరగడంతో ప్రారంభమైన ఈ సంవత్సరం భారతీయ జనతా పార్టీకి సంబంధించి అత్యంత కీలకమైనది. రామమందిర నిర్మాణం జరిగిన వెంటనే మోదీ ఎన్నికలకు వెళ్లి ఉంటే ఏమి జరిగేదో కాని, ఆయన ఉన్నట్లుండి వ్యూహం మార్చి పూర్తిగా మోదీ పేరుతోనే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దేశమంతటా మోదీ అనే వ్యక్తి ఆధారంగానే బీజేపీ ఎన్నికల బరిలోకి దిగింది. తన పేరు చెబితే దేశం దేశం ఏకమై ఉవ్వెత్తున జనం ముందుకు వచ్చి ఓటు వేస్తారని ఊహించుకున్న మోదీ 400 సీట్లు సాధిస్తామని చెప్పుకున్నారు. కాని ఈ ప్రయోగం అంతగా సఫలీకృతం కాకపోవడంతో బీజేపీ కేవలం 240 సీట్లకే పరిమితమయింది. ఈ విఘాతాన్ని అధిగమించాలంటే హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడం తప్పదని మోదీ గ్రహించారు. అందుకే అన్నిశక్తులూ ఒడ్డి, అన్ని రకాల వ్యూహాలు పన్ని ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ గెలుపొందేలా చేయడంతో దేశ రాజకీయ చిత్రపటంపై తనకు మించిన బలమైన నేత ఎవరూ లేరని నిరూపించుకున్నారు. ఈ క్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తెర వెనుక బలమైన శక్తిగా పనిచేసిందనడంలో సందేహం లేదు. తమకు ఆర్‌ఎస్‌ఎస్ అవసరం లేదని, బీజేపీ తన పార్టీ వ్యవహారాలు తానే నిర్ణయించుకోగలదని లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా చేసిన వ్యాఖ్యల పరిణామాలు ఎన్నికల ఫలితాలలో ప్రతిఫలించాయి. ఆ తర్వాత హరియాణా, మహారాష్ట్రలో గెలుపుకు సంఘ్‌పై బీజేపీ పూర్తిగా ఆధారపడవలిసి వచ్చింది. 2024లోనే వందో సంవత్సరంలో అడుగుపెట్టిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ గత పదేళ్లలో అన్ని వ్యవస్థల్లోనూ చొచ్చుకుపోయింది. అనేక మంత్రిత్వశాఖల్లో, ప్రభుత్వ సంస్థల్లో సంఘ్ ప్రతినిధులు కీలక బాధ్యతల్ని నిర్వహిస్తున్నారు. ఒక దేవాలయం నిర్మించో, కొన్ని పదవులు కట్టబెట్టో సంఘ్‌ను సంతృప్తిపరిచి తమ పని తాము చేసుకోవచ్చునుకునే రోజులు పోయాయి. ఎన్నికలు జరుగుతున్న తీరుపై, అబద్ధాలు ప్రచారం చేయడంపై, మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండపై ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత్ ప్రకటనలు చేసిన తర్వాత అంతా బీజేపీ ఇష్టారాజ్య ప్రకారం సాగదనే అభిప్రాయం క్రమంగా ఏర్పడుతోంది. ఈ క్రమంలో 2025 ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, బీజేపీకి సంబంధించి కీలక సంవత్సరం. రాజ్యాంగం, కులగణన, అదానీ కుంభకోణం వంటి అంశాలను లేవనెత్తుతున్న కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం కూడా అంత సులభం కాదు. పార్లమెంట్ చర్చలకు వేదిక కాకుండా కుమ్ములాటలకు రంగస్థలం కావడంపై ప్రతిపక్షాల కంటే మోదీయే జవాబుదారీ కావల్సి ఉంటుంది.

2024లో దేశంలో దాదాపు పది సంవత్సరాల తర్వాత జాతీయ స్థాయిలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడడం, ఈ ప్రభుత్వంలో తెలుగుదేశం వంటి దక్షిణాది పార్టీ ప్రధాన భాగస్వామి కావడం, ప్రధాన రాజకీయ పార్టీలు రెండు ప్రధాన కూటములుగా ఏర్పడడం మరో ముఖ్యమైన పరిణామం అని చెప్పక తప్పదు. బీజేపీ, కాంగ్రెస్ కూటములకు చెందని ప్రాంతీయ పార్టీలు అస్తిత్వ పరీక్షను ఎదుర్కొంటున్నాయి. బీఆర్‌ఎస్, బీజేడి, వైసీపీ, ఆమ్ ఆద్మీ పార్టీ మనుగడకోసం కష్టిస్తున్నాయి. 2025 ఈ విషయంలో మరింత స్పష్టత నిస్తుందనడంలో సందేహం లేదు. 2025 కూడా ముగిసేలోపు కాలం మరెందరి అధ్యాయాలకు తెర వేస్తుందో చెప్పలేము.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

కమ్యూనిస్టులకు కొత్త పాఠాలు

మన తెలుగు రాష్ట్రాలలో ప్రజా సమస్యల మీద ఉద్యమించడం, రాజీ లేని పోరాటాలు చేయడం, ఫలితంగా ప్రభుత్వం నుంచి తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కోవడం ఇప్పటి వరకు కమ్యూనిస్టుల పేటెంట్‌గా ఉండేది. ఆ నిర్బంధం అక్రమ అరెస్టులు, దేశద్రోహంలాంటి తీవ్రమైన కేసులు; అర్ధరాత్రి, అపరాత్రి లేకుండా ఇళ్ల మీద పడి అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌లో చిత్రహింసలు; హత్యలకు, దాడులకు గురికావడం; ఆస్తుల విధ్వంసాన్ని ఎదుర్కోవడం; జీవనోపాధి కోల్పోవడం; నలుగురి ముందు తీవ్ర అవమానాలు ఎదుర్కోవడం లాంటి రూపాలలో ఉండేది (ఇప్పటికీ ఉంది). అయితే 2019–24 సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం నుంచి ఈ తరహా నిర్బంధకాండ ఎదుర్కొంది కమ్యూనిస్టులు కాదు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ తెలుగుదేశం, దాన్ని బలపరిచిన జనసేన, బీజేపీలోని ఒక వర్గం, వాళ్లకు అనుకూలంగా వ్యవహరించిన ఏబీయన్ ఛానల్, టీవీ 5, ఈనాడు లాంటి టీవీ ఛానళ్లు, కొన్ని యూట్యూబ్ చానళ్లు, దినపత్రికలు కావడం ఆశ్చర్యకరం! కమ్యూనిస్టుల ప్రజాసంఘాలు కూడా కొన్ని పోరాటాలలో కొంత నిర్బంధం చవిచూసినప్పటికీ, ప్రధాన ప్రతిపక్షం ఎదుర్కొన్నంతగా కాదు.

అప్పటి వైసీపీ ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీసిన తెలుగుదేశం పార్టీ నాయకులూ, కార్యకర్తలు, అభిమానులు తీవ్ర నిర్బంధం ఎదుర్కొన్నారు. సీనియర్ ఎమ్మెల్యేలను కూడా నిర్దాక్షిణ్యంగా అరెస్టులు చేసి పోలీస్ మార్క్ ట్రీట్‌మెంట్ చూపించారు. అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు వంటి వారిని అక్రమ అరెస్టులు, దాడులతో వేధించారు. టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిని అక్రమ కేసులో ఇరికించి అరెస్ట్ చేసి లాకప్‌లో పడేసి గుర్తు తెలియని వ్యక్తులు కుమ్మేసారు. ఆనాటి నిర్బంధ పాలనకు పరాకాష్ఠగా పాలక పార్టీ రెబెల్ ఎంపీ రఘురామ కృష్ణంరాజును హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి తీసుకెళ్లి, తీవ్రంగా చిత్రహింసల పాలు చేసి, ప్రాణాపాయం కల్పించడం అందరికీ తెలిసిందే! ఈవిధంగా ఆ పాలనా కాలంలో ప్రతిపక్ష పార్టీ క్రియాశీల సభ్యుల నుంచి, బడానాయకులు దాకా పోలీస్ స్టేషన్‌లు, కేసులు, దాడులు ఎదుర్కొనని వారు లేరనడం అతిశయోక్తి కాదు. చివరకు సుదీర్ఘ రాజకీయ జీవితంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడును కూడా ఒక కేసులో ఇరికించి 56 రోజుల పాటు ఊచలు లెక్కించేలా చేశారు. విశేష జనాదరణ గల పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌ని కూడా అడుగడుగునా నిర్బంధంతో హింసించారు.



> తెలుగు రాష్ట్రాలలో తొలిసారిగా వైసీపీ పాలనలో కమ్యూనిస్టుల మీద కాకుండా బూర్జువా ప్రతిపక్ష పార్టీల మీద ఇంత పెద్ద నిర్బంధకాండ సాగించడం అనుభవంలోకి వచ్చింది. ఆర్థికంగా, రాజకీయంగా, భౌతికంగా బలమైన వైసీపీని ప్రతిపక్షాలైన టీడీపీ, జనసేనలు ఎలా ఎదుర్కొన్నాయనేది మనకి విలువైన పాఠాలు నేర్పుతుంది.

పాలక పార్టీ అయినా వైసీపీ జర్మనీలో నాజీల గెస్టపో లాగా ఒక వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసుకొని ప్రజల మీద, ప్రతిపక్షాల మీద నిఘా పెట్టింది. ప్రతి యాభై కుటుంబాలకొక వలంటీర్‌ను కాపలా పెట్టి వాళ్ళ ప్రతి కదలికను, రాజకీయ విశ్వాసాలను రికార్డు చేసి సమాచారాన్ని సేకరించింది. అలాగే సోషల్ మీడియా సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ ఖజానా నుంచి జీతాలు ఇచ్చింది. సోషల్ మీడియాలో జగన్‌కు లేదా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు పోస్టు పెట్టినా తీవ్రమైన అసభ్య పదజాలంతో దూషించడమే పనిగా పెట్టుకుంది. పైగా వాళ్ళ మీద కేసులు పెట్టి అరెస్టులు చేయడం, భౌతిక దాడులకు గురిచేయడం పరిపాటైపోయింది.

ఈ దాడులలో సామాన్య ప్రజానీకం కూడా పెద్ద ఎత్తున బలై పోయింది. గుంటూరులో ఒక మహిళ తన హోటల్‌ను మూసుకుని హైదరాబాద్‌కు వెళ్లిపోవాల్సి వచ్చింది. కరోనా సమయంలో మాస్కులు ఇవ్వడం లేదని పిర్యాదు చేసిన డాక్టర్ సుధాకర్‌ను నడివీధుల్లో తన్నుకుంటూ పోలీసులు ఈడ్చుకు పోవడం చూసాం. అతడి మీద పిచ్చివాడని ముద్ర వేయడం, తర్వాత అతను గుండె పోటుతో మరణించడం తెలిసిందే! ఒక జడ్జి స్థాయి వ్యక్తి ఇంటిమీద దాడి చేసి భయోత్పాతం సృష్టించారు. లాకప్‌లలో శిరోముండనాలు, చిత్రహింసలు మామూలై పోయాయి. ఒక ఎమ్మెల్సీ తన కార్ డ్రైవర్‌ను హత్య చేసి కుటుంబానికి డోర్ డెలివరీ చేయడం చూసాం. ఆ ఎమ్మెల్సీ అతి కష్టం మీద అరెస్ట్ అయి అనతికాలం లోనే బెయిల్ మీద వచ్చి ఊరేగడం చూసాం. అదే విధంగా తమకు గిట్టని మీడియా ప్రతినిధుల మీద దేశద్రోహం లాంటి కేసులు పెట్టి వేధించారు. ఒక కుంటి సాకుతో టీడీపీ కేంద్ర కార్యాలయం మీద దాడి చేసి ధ్వంసం చేశారు. ఇవన్నీ ఒక ఎత్తయితే అమరావతి రైతుల మీద, అందులోను మహిళల మీద సాగించిన దుష్ప్రచారం, భౌతిక దాడుల, కేసులు మరో ఎత్తుగా చెప్పుకోవాలి.

మొత్తంగా చూస్తే తెలుగు రాష్ట్రాలలో తొలిసారిగా కమ్యూనిస్టుల మీద కాకుండా బూర్జువా ప్రతిపక్ష పార్టీల మీద ఇంత పెద్ద నిర్బంధకాండ సాగించడం అనుభవం లోకి వచ్చింది. ఆర్థికంగా, రాజకీయంగా, భౌతికంగా బలమైన వైసీపీని ప్రతిపక్షాలైన టీడీపీ, జనసేనలు ఎలా ఎదుర్కొన్నాయనేది మనకి విలువైన పాఠాలు నేర్పుతుంది. చంద్రబాబు నాయకత్వం లోని టీడీపీ సంఖ్యలో తక్కువైనా అటు అసెంబ్లీ లోను, ఇటు ప్రజాక్షేత్రం లోను నిర్బంధాన్ని లెక్క చేయకుండా వీరోచితంగా పోరాడింది. తీవ్ర దమనకాండను ఎదిరిస్తూనే ప్రజల సమస్యల మీద, ప్రభుత్వ వైఫల్యాల మీద మీడియా ద్వారా, ప్రజా సమావేశాల్లోనూ, రకరకాల మార్గాలలో వివరించింది. తన పార్టీ క్యాడర్‌ను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వాళ్ళ మనోస్థైర్యాన్ని నిలబెట్టింది. ఎంతో వ్యూహాత్మకంగా, ప్రణాళికాబద్ధంగా, రాజకీయ చతురత, నైపుణ్యంతో సామాన్య ప్రజలకు చేరువయింది. మరో వైపు పవన్ కళ్యాణ్ కూడా తన సినీ కెరీర్‌ను కూడా పణంగా పెట్టి ప్రజలలోకి చొచ్చుకు పోయాడు. ప్రజా సమస్యల మీద ఎప్పటికప్పుడు ఉద్యమించడం, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం, తమపై దుష్ప్రచారాలు ఎప్పటికప్పుడు తిప్పికొట్టడం, నిర్బంధాలను అధిగమించడం ఒక ఉద్యమంగా ఐదేళ్ల పాటు కొనసాగించాడు. యువ నాయకుడు లోకేష్ కూడా పరిణతి ప్రదర్శిస్తూ, పాదయాత్ర చేసి ప్రజల్లో కలిసి పోయి తానొక స్థానాన్ని సాధించుకున్నాడు.

ఈ విధంగా 2019–24 మధ్య ఐదేళ్ల కాలంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సాగిన అపూర్వ ప్రజాస్వామిక వెల్లువను అధ్యయనం చేసి గుణపాఠాలు తీసుకోవడం కమ్యూనిస్టులకు ఎంతో ఉపయోగపడుతుంది. సామాన్య ప్రజల నుంచి ఉన్నత స్థాయి ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, మీడియా ప్రతినిధులు మొదలైన వారు ప్రదర్శించిన తెగువ, సాహసాన్ని అర్థం చేసుకోవాలి. మన పిలుపులకు స్పందించడం లేదని, ప్రజలలో చైతన్యం లోపించిందని నీరసం మాటలు చెబుతూ కాలక్షేపం చేసే వామపక్ష సోదరులు పెను నిద్దర నుంచి మేలుకోవాలి. వాస్తవానికి టీడీపీ, జనసేన పోషించిన పాత్రను వామపక్ష పార్టీలు పోషించాలి. అలాకాకుండా లోపాయకారిగా వైసీపీతో అంటకాగారనే అప్రదిష్టను మూట కట్టుకున్నారు. ఒక ప్రాంతీయ పార్టీ ప్రదర్శించిన ఫాసిస్ట్ నిర్బంధాన్ని ఎదుర్కొని గెలవలేని వామపక్ష పార్టీలు, జాతీయ, అంతర్జాతీయ బూర్జువాలు, సామ్రాజ్యవాదుల అండతో బలమైన నిర్మాణం గల బీజేపీ ఫాసిజాన్ని ఓడించగలరని ఎలా నమ్మగలం!? రాబోయే రోజుల్లోనైనా సరైన గుణపాఠాలు తీసుకుని తమ పని తీరును మెరుగుపర్చుకోవాల్సిన బాధ్యత అన్ని కమ్యూనిస్టు పార్టీల మీదా ఉంది.

● జనార్దన్. ఎస్

నిలబెట్టేది ఆత్మస్థైర్యమే!

అంకెలను వెంటేసుకుని
దొరకకుండా తిరిగే కాలాన్ని
గుప్పిట పట్టుకోలేము,
మనసుతో ముడేసుకున్న
కాలంతోనే అడుగులు వేస్తాము,
లెక్కలను తేల్చి చెప్పేది కాదు
లెక్కకు అందని ఆనందాన్ని
మిగిల్చేదే అసలైన కాలం!

కాలం నీటిలా ఆవిరయ్యేకొద్ది
చివరికి మిగిలేదేమిటో
తేటతెల్లం చేస్తుంది,
అనుభవాలు చినుకులై రాలి
కొత్తగా చిగురించడానికి
ఊతమై ఊపిరి పోస్తుంది!

కాలప్రవాహం
ప్రపంచాన్ని ఒక్కసారిగా
సంతోషంలో ముంచేస్తుంది,
ఎన్నో కొత్తదారులను
మన కళ్ళ ముందు పరుస్తుంది,
మనసులో దాగున్న లక్ష్యాన్ని
గుండెధైర్యంతో చేరుకోవాలి!

పొగిడేవాళ్ళు, తెగిడేవాళ్ళు
నీ చుట్టూ ఎందరున్నా
ఎప్పటికీ నిమిత్తమాత్రులే,
నిన్ను నిలబెట్టేది నీ ఆత్మస్థైర్యమే
నిన్ను చూపించేది నీ విజయమే!

– పుట్టి గిరిధర్



నవ్యజీవనగతుల సంధానమిదియె

మంచుముత్యాలు దండలై మరులు చిలుక
సుప్రభాత గీతమ్ములు సుప్రసన్న
భావమకరంద ధారలై పల్లవింప
వచ్చెభువికి నూత్నాంగ్లసంవత్సరంబు

పేదసాదల కండ్లలో మోదకళిక
మొగ్గతొడగంగ పసిపాప బుగ్గలందు
నిగ్గులెల్ల గంతులు వేయ నియతితోడ
వచ్చె భువికి నూత్నాంగ్లసంవత్సరంబు

కర్షకస్వామి కనులలో కౌతుకంబు
పలుకరించుచు నేడునంబరమునంటి
తాండవంబాడుచుండంగ ధైర్యగరిమ
వచ్చె భువికినూత్నాంగ్లసంవత్సరంబు

పల్లెపల్లెలో నవశోభ వల్లెవేసి
దారులెల్లనద్దంబులై తనియుచుండ
పచ్చదనముతో బ్రతుకులు పరిఢవిల్ల
వచ్చెభువికి నూత్నాంగ్లసంవత్సరంబు

తెలుగుజాతి తేజమ్మిట వెలుగులీన
జిలుగుజెండాలనెత్తి రాజిల్లునటుల
సరససాంకేతికజ్ఞాన సరణిమెరయ
వచ్చె భువికి నూత్నాంగ్లసంవత్సరంబు

ప్రజలు స్వాగతంబును పల్కరండురండు
నవ్యజీవనగతులసంధానమిదియె
స్వప్న సాఫల్య సౌందర్య జాణ యిదియె
ప్రగతిశీల విశాల విపంచి యిదియె

– మంకుశ్రీను

కొత్తగా మొదలవ్వాలి

కొత్తగా సరికొత్తగా జీవితం మొదలవ్వాలి
చిగురులు తొడుగుతూ రెక్కలు మొలిచినట్టు
స్వేచ్ఛగా విహరించాలి

బతుకును దుక్కులు దున్ని చదును చేసుకోవాలి
మెట్ట, మాగాణి రంగులేసుకుని
పచ్చని పంటలు పండాలి
బీదాబిక్కి జనం గొంతులో
గుక్కెడు గంజి ఒంపుకోవాలి
ఆత్మగౌరవంగా బతకాలి



పిల్లపెద్ద, ముసలి ముతక స్త్రీల బతుకుల్లో
ధైర్యం కాగడాల్లా దేశానికి వెలుగులు జిమ్మాలి
తాడిత పీడిత కులాలపై దాడులు లేకుండా
ఆధిపత్యం నశించి అగ్రకులాల సమాన భావన కలగాలి

ముగ్గుల్లో రంగులు కలిసినట్టు
మనుషుల్లో సోదర భావం కలవాలి
జాతులంతా వేరైనా మానవత్వం ఒకటై పండగసేయాలి

నూతనోత్సవం కొరకు
నూతన జీవితం మొదలెట్టాలి
ఎప్పుడూ నిత్యనూతనంగా మనుషులు బతకాలి
దేశమంతా వెలుగుల వేడుకలు చేయాలి.

– తంగిరాల సోని

విశ్వమానవుడిగా వికసించాలి

ఎన్నో మిఠాయి పొట్లాలను ఎదలపై
వదిలేసి వయ్యారంగా వెళ్ళిపోతుంది
ఎన్నో కన్నీళ్లను చెక్కిళ్ళపై జారవిడిచి
గుండెకు లోతైన గాయాలను చేసి
క్యాలెండర్ మార్చుకొని కాలగర్భంలో
కలిసిపోతుంది 2024 సంవత్సరం.



పోతూ పోతూ కొన్ని జీవిత పాఠాలను
నేర్పింది, కొన్నింటిని అలవాటు చేసింది
మనం కొన్నింటికి కామా పెట్టాలి
మరికొన్నింటికి ఫుల్‌స్టాప్ చుట్టాలి
మదిలో కొత్తదనానికి అంటు కట్టాలి

కొత్త సంవత్సరానికి స్వాగతం అంటే
చాటింగ్‌లు, గ్రీటింగ్‌లు, కేక్ కటింగ్‌లు కాదు
బీరు పొంగిచ్చుడు, బొక్క కొరుకుడు అంతకన్నా కాదు
భవిత కోసం బెర్తు భద్రంగా మలచుకోవాలి.
కులాల కంపు, మతాల మత్తును,
మనసులోని మలినాలను కడిగేసుకొని
మల్లెపువ్వులా మానవతా పరిమళాలను వెదజల్లుతూ
కొత్త సంవత్సరంలో విశ్వమానవుడిగా వికసించాలి.

– తాటిపాముల రమేశ్ (తార)

శుభ'ఆకాంక్షలు'



కొత్త సీసాలో పాత సారాను
పోసేసుకునీ
సంబరాలను అంబరంగా
జరిపేసుకునీ
క్యాలెండర్లో తారీఖును
చింపేసుకునీ
మొఖానికి నవ్వుల్ని
పూసేసుకునీ
అదే నూతనత్వం అంటే
నేన్నమ్మను కాక నమ్మను

కల్మషాలను కడిగేసుకొని
కళ్లల్లో కాంతులు పోసేసుకుని
గతాన్ని నెమరేసుకొని
బాధల్తో తడుస్తున్న
వర్తమానాన్ని మానాన్ని
ఓ కొత్త వలువతో చుట్టుకోవాలి
భవిష్యత్తును అందంగా
ముస్తాబు చేసుకోవాలి...

సమతను పెంచి మమతను పంచి
ఈ నూతన వత్సరాన
కొత్తగా.. కొంగ్రొత్తగా..
అభ్యుదయ భావాల చిగుళ్ళు
తోడుక్కోవాలి
ఉషస్సులా.. తపస్సులా..
నూతనత్వం వెల్లివిరియాలి..!

– కటుకోఝ్వల రమేష్

కొత్త సమరం

కేలండర్ బ్లాక్ బోర్డు మీద
కొత్త పాఠం రాయడం
మళ్ళీ మొదలుపెట్టింది కాలం

పూసల్లా జారిపోతున్న తేదీలను
మరో సంవత్సరపు దారంలోకి ఒడుపుగా ఎక్కిస్తుంది

నిన్నటి పాఠాల్ని అర్థం చేసుకునే పనిలో
కూడికల్నీ తీసివేతల్నీ భాగిస్తూ
జీవిత లెక్కల్ని పరిష్కరించే
కాలిక్యులేటర్ సిద్ధం చేసుకోవాలి



నిచ్చెనల్నీ పాముల్నీ గుర్తిస్తూ
ఆటలో విజయాన్ని చేరుకోవాలి

ఇప్పుడు సంవత్సరమంటే
కేవలం కాలం మాత్రమే కాదు
365 శత్రువులతో
ప్రతి క్షణం విశ్రమించక చేసే మహత్తర యుద్ధం కూడా...

ఈ గెలిచి తీరాల్సిన కొత్త సమరానికి
స్వాగత సత్కారాలు చేద్దాం.

– ర్యాలి ప్రసాద్

మంచిని ఆహ్వానించు

ఓ నేస్తం!
నూతనవత్సరం విచ్చేస్తున్న సందర్భంగా
చిన్న మాట.

గతం పునాది,
వర్తమానం ఇల్లు,
భవిష్యత్ ఆ ఇంటిలో
నువ్వు వేసే అడుగులు.



గతాన్ని తెరిచి చూడలేకపోవచ్చు.
కాని ఆ పేజీల సారాంశం
అవపోసన పట్టినప్పుడే,
రేపనే తెల్లకాగితంపై
విలువైన సమాచారం
రాయగలవని గుర్తెరుగు.

నీ ప్రవర్తనే నీ ఉనికి,
దానిని పలువురు హర్షించేలా నిలుపుకో,
మంచిని ఆహ్వానించు.

ఈ సదాశయసంకల్పంతో
నూతన సంవత్సరాన్ని ప్రారంభిద్దాం. సరేనా!

– వేమూరి శ్రీనివాస్

మజిలీ దాటి మరో మజిలీ!



రెండు చక్రాలు
దూరం భారం మోసినట్టు
రెండు ముళ్ళు
అనంత కాలాంబుధి ఈదుతాయి
సజీవ హృదయాలపై
భూత భవిష్యత్ వర్తమానాలు
ప్రదర్శించే చలనమే కాలచక్రం
అంతం లేని కాలంలో
ఏ ఒక్క మజిలీలో
నిరాశతో మనిషి ఆగడు
ఆశల శ్వాసలు ఆశయాల ఘోషలు
మళ్ళీ మూటలు కట్టుకొని
లెక్కలు బేరీజు వేసుకొని
రేపటి మజిలీకి ఉవ్విళ్లూరతాడు
నిన్న మొన్నకి నేడు నిన్నకిలానే
రేపు నేటికి..
రేపన్న ఆశే మనిషి శ్వాస
వచ్చే కాలాన్ని పోయే కాలం
దైవంలా భావిస్తుంది అందుకే!
గతం నుండి నేర్చుకుంటూ
వర్తమానంలో జీవిస్తూ
భవిత దిద్దుకోడమే ప్రగతి లక్షణం!

– భీమవరపు పురుషోత్తమ్

తక్కువ మంది విద్యార్థులున్న ఎయిడెడ్ పాఠశాలలకు షోకాజు నోటీసులు!

అమరావతి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తక్కువ మంది విద్యార్థులున్న ఎయిడెడ్ పాఠశాలలపై చర్యలకు పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. తగిన స్థాయిలో విద్యార్థుల సంఖ్య లేకుండానే పాఠశాలలు నడపడంపై వివరణ కోరాలని జిల్లాల అధికారులను ఆదేశించింది. ఈ మేరకు షోకాజు నోటీసుల జారీకి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఆదేశాలు జారీచేశారు.

నేటి నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

- 475 కాలేజీల్లో అమలు.. 1.5 లక్షల మందికి లబ్ధి
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి స్టూడెంట్ కిట్స్ పంపిణీ
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

గత ప్రభుత్వం రద్దు చేసిన పథకం పునరుద్ధరణ

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించింది. ఇటీవల ఈ పథకం అమలుకు కేబినెట్ ఆమోదముద్ర వేసిన నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. బుధవారం నుంచి 475 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న 1.5 లక్షల మంది విద్యార్థులకు పథకం అమలు కానుంది. గతంలో పాఠశాలలతో పాటు జూనియర్ కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమల్లో ఉండేది. ఇంటర్ విద్యార్థులకు అమ్మఒడి పథకం ఇస్తున్నామనే సాకుతో గత వైసీపీ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని రద్దుచేసింది. దీనివల్ల పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన కూటమి ప్రభుత్వం తిరిగి అమల్లోకి తీసుకొచ్చింది. పథకం అమలుకు ఏడాదికి రూ. 85.84 కోట్లు ఖర్చు అవుతుందని, ఈ విద్యా సంవత్సరంలో మిగిలిన కాలానికి రూ. 27.39 కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వం తెలిపింది.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల కిట్లు

పాఠశాల విద్యార్థులతో పాటు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో చదివే ఇంటర్ విద్యార్థులకూ 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర' స్టూడెంట్ కిట్ పంపిణీ చేసేందుకు ప్రభుత్వం మరో ఉత్తర్వు జారీ చేసింది. కిట్‌లో పాఠ్యపుస్తకాలు, ఒకేషనల్ పాఠ్యపుస్తకాలు, కాంపిటీటివ్ పరీక్షల మెటీరియల్, ప్రాక్టికల్స్ మాన్యువల్స్, నోట్ పుస్తకాలు, ప్రాక్టికల్స్ రికార్డులు ఇవ్వనుంది. జూనియర్ కాలేజీలతో పాటు కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, గురుకుల విద్యాలయాలు, హైస్కూల్ ప్లస్‌లలో విద్యార్థులకు కిట్లు అందజేయనుంది. ఇందుకోసం రూ. 32.95 కోట్లు అవుతాయని అంచనా వేసింది.

- సీనియర్ ఐపీఎస్ అధికారులైన రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్‌పర్సన్ అంజనా సిన్హా, ఆంధ్రప్రదేశ్ పోలీస్ ట్రైనింగ్ విభాగం ఐజీ పి.వెంకట్రామిరెడ్డి మంగళవారం పదవీ విరమణ చేశారు. వారిద్దరినీ మంగళగిరి రాష్ట్ర పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో డీజీపీ ద్వారకాతిరుమలరావు సత్కరించారు.

కోటికి చేరువగా టీడీపీ సభ్యత్వం

- రెండు నెలల్లో 94 లక్షలు నమోదు
- సంక్రాంతి వరకూ గడువు పొడిగింపు

అమరావతి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదు ఈసారి రికార్డులు బద్దలు కొడుతోంది. డిసెంబరు 31నాటికి ఏకంగా 94 లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయి. ఈ స్థాయిలో సభ్యత్వం నమోదు కావడం ఆ పార్టీ చరిత్రలో ఇదే తొలిసారి. ఈ సారి కోటి సభ్యత్వాలను నమోదు చేయాలన్న లక్ష్యంతో అక్టోబరు 26న పార్టీ అధినేత చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అప్పటి నుంచి సరాసరి రోజుకు లక్షన్నర చొప్పున సభ్యత్వాలు నమోదవుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో మంగళవారం నాటికి 94 లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయి. కోటి సభ్యత్వాల లక్ష్యాన్ని అందుకోవడానికి మరో 6 లక్షలు మాత్రమే కావాలి. దీంతో సభ్యత్వ నమోదు గడువును పొడిగించాలని ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జులు పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌ను కోరారు. వాస్తవానికి ఈ గడువు డిసెంబరు 31తో ముగిసింది. కానీ, పార్టీ నేతల వినతి మేరకు దీన్ని సంక్రాంతి వరకూ పొడిగిస్తూ మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకూ జరిగిన సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో పది అసెంబ్లీ నియోజకవర్గాలు లక్ష మార్కుని దాటేశాయి. ఇందులో మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ నియోజకవర్గం నెల్లూరు 1.47 లక్షల సభ్యత్వాలతో అగ్రస్థానంలో నిలిచింది. మంత్రి నిమ్మల రామానాయుడు నియోజకవర్గం పాలకొల్లు (1,44,992), మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి నియోజకవర్గం ఆత్మకూరు (1,34,584) రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. రాజంపేట (1,29,783), కుప్పం (1,28,496), ఉండి (1,14,443), గురజాల (1,08,839), వినుకొండ (1,05,158), మంగళగిరి (1,04,122), కల్యాణదుర్గం (1,00,325) వరుసగా ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

వీసీల నియామకానికి లైన్‌క్లియర్

- యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్ల నామినీలు ఖరారు
- రెండు రోజుల్లో సెర్చ్ కమిటీ జీవోలు
- రెండు వారాల్లో కొత్త వీసీల నియామకం

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీలను గాడిలో పెట్టే దిశగా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. వైస్ చాన్సలర్ల నియామకానికి లైన్ క్లియర్ చేస్తూ.. సెర్చ్ కమిటీలు వేసేందుకు సిద్ధమైంది. ఇందుకోసం యూనివర్సిటీల ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్ల నుంచి నామినీలను మంగళవారం ఖరారు చేశారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లతో ఉన్నత విద్యాశాఖ అధికారులు వర్చువల్ సమావేశం నిర్వహించి పేర్లు ఖరారు చేశారు. దీంతో రెండు రోజుల్లో సెర్చ్ కమిటీల జీవోలు జారీ కానున్నాయి. రెండు వారాల్లోనే కొత్త వీసీల ఎంపిక ప్రక్రియను ముగించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సెర్చ్ కమిటీలో యూజీసీ నుంచి ఒకరు, ప్రభుత్వం నుంచి ఒకరు, సంబంధిత యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఈసీ) నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు. ఇప్పటికే యూజీసీ నామినీల పేర్లను పంపింది. ప్రభుత్వం నుంచి నామినీలు సిద్ధంగా ఉన్నారు. ఈసీల నుంచి నామినీల కోసమే ఇంత ఆలస్యమైంది. ఇప్పుడు పేర్లు ఖరారు చేయడంతో సెర్చ్ కమిటీలు వేసి, ఆ వెంటనే వేగంగా వీసీల నియామక ప్రక్రియ పూర్తిచేయనున్నారు. కాగా రెండు నెలల కిందట 17 యూనివర్సిటీల వీసీల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీచేసింది. సుమారు 2,500 దరఖాస్తులు అందాయి. అయితే అప్పటినుంచీ సెర్చ్ కమిటీలు వేయకపోవడంతో ప్రక్రియ నిలిచిపోయింది.

విశాఖ సెంట్రల్ జైల్లో సెల్‌ఫోన్ల కలకలం

- భూమిలో పాతిన వాటిని గుర్తించిన అధికారులు

ఆరిలోవ (విశాఖపట్నం) డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్ర కారాగారంలో రెండు సెల్‌ఫోన్లు, రెండు పవర్ బ్యాంకులు, రెండు చార్జింగ్ వైర్లు లభించడం కలకలం రేపింది. ఖైదీల బ్యారక్‌ల వద్ద కవర్లతో చుట్టి నాలుగు అడుగుల లోతులో భూమిలో పాతిపెట్టి ఉంచిన వాటిని తనిఖీల్లో భాగంగా జైలు అధికారులు గుర్తించారు. ఇటీవల జైలులోని పలువురు వార్డర్ల తీరుపై అనుమానాలు రేకెత్తడంతో తనిఖీలు చేసిన విషయం తెలిసిందే. ఓ వార్డర్‌ను తనిఖీ చేసినపుడు ఆ సమీపంలోనే సెల్‌ఫోన్లు, పవర్ బ్యాంకులు, చార్జింగ్ వైర్లు లభించాయని, దీనిపై ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశామని జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మహేశ్‌బాబు మంగళవారం తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుగుతుందన్నారు.

నిబంధనల మేరకే వార్డర్ల తనిఖీ

జైలు నిబంధనలు, హెడ్డాఫీసు ఉత్తర్వులకు అనుగుణంగానే వార్డర్లను ప్రైవసీ రూంలో తనిఖీ చేసినట్టు మహేశ్‌బాబు తెలిపారు. విశాఖ జైల్లో నెలకొన్న వివాదంపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన వార్తపై ఆయన మంగళవారం వివరణ ఇచ్చారు. నిరంతరం ఉన్నతాధికారుల పర్యవేక్షణలోనే ఖైదీల్లో పరివర్తన తీసుకొచ్చేందుకు జైల్లో పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు.

ఆరంభం హుషారుగా..

కొత్త ఆశలతో.. కొత్త ఊహలతో మళ్లీ కొత్త సంవత్సరం వచ్చేస్తోంది. 2025 హుషారుగా సాగాలంటే ఈ కింది పనులన్నీ మీరు చేయాల్సిందే!

ఎక్కువ చదవండి..

ప్రస్తుతం మొబైల్స్ మన జీవితాలను శాసిస్తున్నాయి. ఒక సారి మొబైల్ చూడటం మొదలుపెడితే ఆగటమే ఉండదు. సోషల్ మీడియా మన ఆలోచనలను కమ్మేస్తుంది. అసలు ఆలోచించకుండా చేసేస్తుంది. అందుకే మొబైల్స్ చూసే సమయాన్ని తగ్గించి.. ఆ సమయంలో నచ్చిన పుస్తకాలను చదవమని మానసిక నిపుణులు సలహా ఇస్తున్నారు. పుస్తకాలు చదవటం వల్ల మన ఆలోచనలలో స్పష్టత వస్తుంది. ఒక వేళ పుస్తకాలు చదివే అలవాటు లేకపోతే - ఆడియో పుస్తకాలు అందుబాటులో ఉంటున్నాయి. వాటిని శ్రద్ధగా విన్నా బావుంటుంది.



చిన్న పొదుపు

వారానికి వంద రూపాయలు దాచగలిగితే- ఏడాదికి 5200 రూపాయలు అవుతుంది. దానిని మంచి రిటర్న్స్ ఇచ్చే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడితే? అతి తక్కువ సమయంలో రెండు రెట్లు అవుతుంది. ఇది ఒక చిన్న ఉదాహరణే కావచ్చు.. చిన్నగా పొదుపు చేయటం మొదలుపెడితే - దీర్ఘకాలంలో మంచి ఫలితాలు ఇస్తాయి. చాలా మంది పొదుపు చేయటమంటే ఒకే సారి వేలో, లక్షలో జమపరుచుకోవటం అనుకుంటారు. అలా కాకుండా చిన్న చిన్న మొత్తాలను పొదుపు చేస్తే చాలా మంచి ఫలితాలు ఉంటాయి. మనం చేసే పొదుపును ట్రాక్స్ చేసే అప్లికేషన్లు కూడా అనేకం వచ్చేసాయి. ఆర్థిక వ్యవహారాలపై కొద్దిగా అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో ఎంతో ప్రయోజనం ఉంటుంది.

> **ధ్యానం..**
>
> **రోజుకు ఒక అరగంట ధ్యానం చేయగలిగితే అద్భుతమైన ఫలితాలు లభిస్తాయి. యోగా, ధ్యానం ఒకటే అనుకొనేవారు ఇంకా ఉన్నారు. వారందరూ తెలుసుకోవాల్సినది ఒకటే. యోగా శరీరానికి సంబంధించినది. ధ్యానం మన మనసుకు సంబంధించినది. ఈ రెండు కలిపి చేయటం వల్ల ఇటు శరీరం అటు మనసు చురుకుగా పనిచేస్తాయి. ఆలోచనా విధానం కూడా మారుతుంది.**

వ్యసనాలు మానండి..

ప్రపంచంలో అత్యంత సులభంగా చెప్పగలిగినది.. ఆచరణలో అత్యంత కఠినమైనది ఇదే! ఒకసారి అలవాటు అయిన తర్వాత సిగరెట్లు, ఆల్కాహాల్ వంటివి మానటం కష్టం. కానీ ఆ అలవాటును నెమ్మదిగా నియంత్రించుకోవచ్చు. ఉదాహరణకు ఒక నెల రోజులు పూర్తిగా సిగరెట్లు మానేస్తానని పెట్టుకుంటే- పెద్దగా ఇబ్బంది అనిపించదు. అదే విధంగా ప్రతి వారం తాగే మద్యం కోటాను సగానికి తగ్గించుకోవచ్చు. ఇలా చేయటం వల్ల అనుకూల ఫలితాలు వస్తున్న కొలది.. వ్యసనాలు పూర్తిగా మానేందుకు అవకాశం చిక్కుతుంది.

కొత్త భాష నేర్చుకోండి..

కొత్త భాషలను నేర్చుకోవటం వల్ల మన ఆలోచనా పరిధి పెరుగుతుంది. కొత్త ప్రాంతాలకు వెళ్లినప్పుడు వారితో సంభాషించగలుగుతాం.. వారి సంస్కృతి సంప్రదాయాలు తెలుసుకోగలుగుతాం.. అంతకు మించి.. ఆ భాషలో ఉన్న సాహిత్యాన్ని చదవగలుగుతాం. ఇదంతా మన మేధో విస్తృతిని పెంచుతుంది. అంతే కాకుండా ఈ ఆధునిక యుగంలో భాషలు నేర్చుకోవటం చాలా సులభం కూడా. ప్రస్తుతం ఇంటర్నెట్‌లో అనేక యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా కొత్త భాషలు నేర్చుకోవటం సులభమనే చెప్పాలి.

విజన్ బోర్డు

2025లో ఏం చేయాలనుకుంటున్నామో ఆలోచించి.. వాటన్నింటిని ఒక చోట పెడితే దానిని విజన్ బోర్డు అంటారు. దీనిలో మనం చేయాలనుకుంటున్న ప్రయాణాలు కావచ్చు.. చేరుకోవాలనుకుంటున్న లక్ష్యాలు కావచ్చు.. ఊహలు కావచ్చు.. ఇలా మనకు సంబంధించిన వాటన్నింటినీ కలిపినదే ఈ విజన్ బోర్డు.





వెనీలా కేక్... మీ కోసం

కొత్త సంవత్సరం మొదటి రోజున కేక్ కావాలని పిల్లలు అడుగుతూ ఉంటారు. బేకరీల్లో కొని తెచ్చే కేక్ పిల్లల ఆరోగ్యాన్ని పాడు చేసే ప్రమాదం ఉంది. అలాకాకుండా పిల్లలు ఇష్టపడే కేక్‌ని ఇంట్లోనే తయారుచేస్తే వారి ఆనందానికి అవధులు ఉండవు. ఓవెన్ అందుబాటులో లేకపోయినా కుక్కర్‌లోనే రుచికరమైన వెనీలా కేక్ తయారు చేసుకోవచ్చు.

తయారీ విధానం

- ముందుగా ఒక గిన్నెలో రెండు కప్పుల చక్కెర పొడి, ఒక కప్పు వెన్న, రెండు చెంచాల బేకింగ్ సోడా, అర చెంచా ఉప్పు, రెండు గుడ్లు పగులగొట్టి వేసి బాగా కలపాలి. తరవాత ఇందులో మూడు కప్పుల మైదా పిండి, రెండు చెంచాల వెనీలా ఎసెన్స్ వేసి కలపాలి. రెండు కప్పుల పాలను కొద్ది కొద్దిగా వేస్తూ పిండి మిశ్రమాన్ని వేగంగా కలపాలి. పిండిలో ఉండలు రాకుండా చూసుకోవాలి.
- కుక్కర్‌లో పెట్టడానికి అనువుగా ఉన్న మందపాటి గుండ్రని గిన్నెను తీసుకుని అందులో ఒక చెంచా మైదా పిండి వేసి గిన్నె అంతా అంటుకునేలా తిప్పాలి. పిండి మిగిలితే గిన్నె వంచేయాలి. ఈ గిన్నెలో ముందుగా తయారుచేసుకున్న కేక్ పిండి మిశ్రమాన్ని వేయాలి. గిన్నెని కుక్కర్‌లో పెట్టి సన్నని మంట మీద 45 నిమిషాలు ఉడికించాలి. కుక్కర్‌కు విజిల్ పెట్టకూడదు.
- సమయం పూర్తయిన తరవాత కుక్కర్‌లో నుంచి గిన్నెను బయటకి తీసి పది నిమిషాలు చల్లారనివ్వాలి. గిన్నె గోడల నుంచి కేక్ విడిపోయేలా చాకును గిన్నె చుట్టూ ఒకసారి తిప్పాలి. ఒక పళ్లెంలోకి గిన్నెను బోర్లించి పైన తడితే కేక్ గిన్నె నుంచి వచ్చేస్తుంది.
- కేక్ పైన చెర్రీలు అలంకరించి చాక్లెట్ క్రీమ్ లేదా బట్టర్ క్రీమ్‌తో హ్యాపీ న్యూ ఇయర్ 2025 అని రాసేస్తే వెనీలా కేక్ సిద్ధం అయిపోతుంది.

ఇంటిని అందంగా అలంకరిద్దాం!

నూతన సంవత్సరం వచ్చేసింది. శుభాకాంక్షలు చెప్పడానికి స్నేహితులు, బంధువులు మన ఇంటికి వస్తుంటారు. ఇంటిని అందంగా శోభాయమానంగా అమర్చుకుంటే అందరితో కలిసి సంతోషంగా గడిపేయవచ్చు. కొత్త ఏడాదిని స్వాగతిస్తూ ఇంటిని ఎలా ముస్తాబు చేసుకోవాలో తెలుసుకుందాం!

ఇల్లు శుభ్రం: ఇల్లు పరిశుభ్రంగా ఉంటేనే ఏ అలంకరణ చేసినా ఇంటి అందం ఇనుమడిస్తుంది. రోజూ చేసేదానికంటే కొంచెం ఎక్కువ శ్రద్ధ పెట్టి ఇంటిని శుభ్రం చేయండి. పాత కర్టెన్లు, బెడ్‌షీట్లు, సోఫా కవర్లు మార్చి కొత్తవి వేయండి. అలాగే పనికి రాని వస్తువులను తీసివేయండి. మీ అభిరుచిని తెలిపే పుస్తకాలను చక్కగా సర్దండి. అందమైన గాజు వస్తువులను పొందికగా అమర్చండి. వంటిల్లు, బెడ్ రూమ్, స్టడీరూమ్, లివింగ్ రూమ్, హాల్ అన్నింటిని దుమ్ము, ధూళి లేకుండా శుభ్రం చేసి అక్కడి వస్తువులను అందంగా అమర్చండి. జలపాతాల సవ్వడి, పక్షుల అరుపులు వినిపిస్తూ అందమైన చేపలు తిరుగాడే అక్వేరియాన్ని హాల్లో అమర్చండి. ఇది పిల్లలను, పెద్దలను ఆకర్షిస్తుంది. మనీ ప్లాంట్, స్నేక్ ప్లాంట్ లాంటి మొక్కల కుండీలను కూడా గది మూలల్లో ఉంచండి.



ముగ్గులు: రంగురంగుల ముగ్గులు ఇంటి శోభని పెంచుతాయి. రంగులతోనే కాకుండా రకరకాల పూల రెక్కలతో చిన్న చిన్న ముగ్గులను అక్కడక్కడా పెడితే ఇంటికి మంచి కళ వస్తుంది. ఇంటి గుమ్మం, దేవుని గది. బెడ్ రూమ్‌ల ముందు ముగ్గులు వేస్తే బాగుంటుంది. హాల్లో సోఫా ఎదుట కొంచెం పెద్ద ముగ్గు ఉండేలా చూసుకోవాలి.

బెలూన్స్: హాల్, లివింగ్ రూమ్, స్టడీ రూమ్‌లలో రంగురంగుల బెలూన్లను అమర్చండి. వాటి మీద 0, 2, 5 అంకెలు ఉండేలా చూడండి. ఇవి ఇంటిని ప్రత్యేకంగా కనిపించేలా చేస్తాయి.

ఫెయిరీ లైట్స్: బాల్కనీ, గార్డెన్ ఏరియాలను ఫెయిరీ లైట్లతో అలంకరించండి. ఇవి సాయంత్రం వేళ అందంగా అహ్లాదకరంగా కనిపిస్తాయి. గార్డెన్ మధ్యలో టేబుల్.... చుట్టూ కుర్చీలు వేస్తే అతిథులు కూర్చోవడానికి ఆసక్తి చూపిస్తారు. ఇంటి ముందు, బాల్కనీలో కూడా కుర్చీలు వేసి ఉంచండి. ఇంటి పరిసరాల్లో నియాన్ లైట్లు ఏర్పాటు చేస్తే అహ్లాదకరంగా ఉంటుంది.

గోడల అలంకరణ: గోడల మీద అందమైన ఫొటో ఫ్రేమ్‌లు, చక్కని పెయింటింగ్‌లు, పిల్లలు-స్నేహితులతో కలిసి దిగిన ఫొటోలు ఏర్పాటు చేస్తే చూడడానికి ఆకర్షణీయంగా ఉంటుంది. చిన్న కథలు, సరదా వాక్యాలు రాసిన రంగుల కాగితాలు అక్కడక్కడా అంటిస్తే అతిథులను కట్టిపడేస్తాయి.

కొవ్వొత్తులు: రకరకాల కొవ్వొత్తులు ప్రస్తుతం అందుబాటులో ఉంటున్నాయి. కొవ్వొత్తుల వెలుతురులో ఇల్లు మెరిసిపోతుంది. మంచి సువాసనలు వెదజల్లే కొవ్వొత్తులు కూడా లభ్యమవుతున్నాయి. వీటిని టీవీకి ఇరుపక్కలా, టీపాయ్ మీద, సోఫా పక్కన ఏర్పాటు చేస్తే ఇల్లు సువాసన భరితంగా కళకళలాడుతుంది. వేలాడే లాంతర్లు, చిన్న దీపాలతో కూడా ఇల్లు అలంకరించుకోవచ్చు.

ప్రేరణ

సంకల్ప బలం... సేవా పథం

కలెక్టరు హోదాలో వీలైనంత సమాజ సేవ చేయొచ్చనే సంకల్పంతో సివిల్స్‌కు సిద్ధపడిన ఒకమ్మాయి, ఆ ప్రయత్నాలు విఫలమవడంతో అక్కడితో ఆగిపోలేదు. 'ఎర్త్ హీరోస్ ఫౌండేషన్'ను స్థాపించి, ప్రత్యామ్నాయ మార్గంలో సమాజానికి సాయపడుతోంది. వినూత్నమైన ప్రాజెక్టుల ద్వారా తన సేవా సంకల్పాన్ని నెరవేర్చుకుంటున్న హోసినిరెడ్డి రావులతో 'నవ్య' మాటామంతీ.



చిన్నప్పటి నుంచే సమాజ సేవ పట్ల ఆసక్తి ఏర్పడింది. కానీ ఎలా చేయాలో, ఎక్కడి నుంచి మొదలుపెట్టాలో తెలియని అయోమయం. ఊహ తెలిశాక, ఉన్నతమైన హోదాలో ఉన్నప్పుడే సమాజానికి ఉపయోగకరమైన పనులు చేయగలుగుతామనే ఆలోచన స్ఫురించింది. అందుకోసం కలెక్టరుగా ఎదగాలనే పట్టుదలను పెంచుకుని, బీటెక్ పూర్తి చేసి, సివిల్స్‌కు సిద్ధపడడం మొదలుపెట్టాను. అందుకోసం ఢిల్లీ వెళ్లి కోచింగ్ తీసుకుని, పరీక్షలు రాసి మెయిన్స్ వరకూ చేరుకోగలిగినా, అక్కడ విఫలమవుతూ వచ్చాను. అలాగని నేను కుంగిపోలేదు. సమాజసేవే లక్ష్యమైనప్పుడు యుపిఎస్సీ ద్వారా కాకపోయినా, బదులుగా ప్రత్యామ్నాయ మార్గాల్లో కూడా అదే లక్ష్యాన్ని అందుకోవచ్చనే ఆలోచనతో 2019లో ఎర్త్ హీరోస్‌ను స్థాపించాను. కానీ దురదృష్టవశాత్తూ కొవిడ్ వల్ల సంస్థ కార్యకలాపాలన్నిటికీ అవాంతరం ఏర్పడింది. దాంతో కాస్త ఆలస్యంగా, సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యంగా, 2024 ప్రారంభంలో, విస్తృతమైన పది లక్ష్యాలతో సంస్థ కార్యకలాపాలను చేపట్టడం మొదలుపెట్టాను. వీటిలో విద్య, పేదరికం, మహిళా సాధికారత, మాదకద్రవ్యాలు... ఇలా పది భిన్నమైన లక్ష్యాలను ఏర్పరుచుకుని భిన్నమైన అవగాహనా కార్యక్రమాలను మొదలుపెట్టాను.

> మాది మహబూబ్‌నగర్, వనపర్తి దగ్గరి కానేపల్లి. నేను అక్కడే పుట్టి, పెరిగాను. చదువు కోసం మొదట వనపర్తికీ, తర్వాత హైదరాబాద్‌కూ మారిపోయాను. అమ్మ విజయలక్ష్మి ప్రభుత్వ టీచర్. నాన్న చంద్రశేఖర రెడ్డి, వ్యవసాయ పనులు చూసుకుంటూ ఉంటారు. అమ్మా, నాన్న వనపర్తిలోనే ఉంటారు. సమాజ సేవ నేను చేయడమే కాదు, సమాజానికి ఉపయోగపడే కొత్త ఆలోచనతో ఎవరు నన్ను సంప్రతించినా వాళ్లకొక వేదికను అందించి ప్రోత్సహిస్తాను. ఎర్త్ హీరోస్ సంస్థకు నేను ఛైర్ పర్సన్‌గా వ్యవహరిస్తున్నాను. నాతో పాటు నా స్నేహితులు నరేష్ కుమార్ జాజుల, అమల్ కిరణ్ కొ ఫౌండర్లుగా వ్యవహరిస్తున్నారు. మేం ముగ్గురం కలిసి ఎర్త్ హీరోస్‌ను స్థాపించాం.

వినూత్నమైన కార్యక్రమాలతో...

ఇప్పటివరకూ విజయవాడ ఇస్కాన్‌తో కలిసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా, వాటి వాడకం వల్ల తలెత్తే దుష్ప్రభావాలకు సంబంధించి అవగాహనా కార్యక్రమాలు, సైక్లాథాన్స్, వాకథాన్స్ ఏర్పాటు చేశాను. నారీ శక్తిలో భాగంగా బడుల్లో ఆడపిల్లల నుంచి అనుభవాలను సేకరించి, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వ్యత్యాసాలను నేర్పించడంతో పాటు, లైంగిక దోపిడీ సంబంధిత అవగాహనా కార్యకలాపాలనూ చేపట్టాం. అలాగే అనాథ శరణాలయాలను సందర్శించి సెషన్లను ఏర్పాటు చేసి, పరీక్షలు నిర్వహించి లైంగిక దోపిడీల పట్ల అవగాహన పెంచాను. అలాగే జెనరిక్ మెడిసిన్‌కు ప్రచారం కల్పించే ప్రధానమంత్రి జనౌషధి పరియోజన పట్ల అవగాహన కల్పించడంలో భాగంగా నల్గొండ దగ్గరి గిరిజన దుకాణాలకు వెళ్లి, సర్వేలు చేపట్టాం. అక్కడి గిరిజనులకు ప్రాథమిక ఔషధాల పట్ల ఎలాంటి అవగాహన లేకపోవడం నేను గమనించాను. సర్వేలో వెల్లడైన వాస్తవాల ఆధారంగా స్థానిక ప్రభుత్వాధికారుల అనుమతితో గిరిజనులకు ఆరోగ్య పరీక్షలు చేపట్టి, ప్రాథమిక ఆరోగ్యం పట్ల అవగాహన పెంచే ఆలోచన ఉంది. అలాగే పూర్తి స్థాయిలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా ఉంది.




భవిష్యత్తు ప్రాజెక్టులు..

ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. ఎంతోమంది ప్రజలు, సైబర్ నేరగాళ్లకు బలవుతూ లక్షల్లో డబ్బు పోగొట్టుకుంటున్నారు. కాబట్టి ఈ నేరాల పట్ల అవగాహన కల్పించాలనే లక్ష్యంతో, తెలంగాణా ప్రభుత్వం, సైబర్ డిపార్ట్‌మెంట్‌ను సంప్రతించి, లైవ్ ఈవెంట్స్‌ను నెలకొల్పాలనే ఆలోచనలో ఉన్నాను. దీన్లో సైబర్ ముప్పు నుంచి రక్షణ పొందే మెలకువలను నేర్పే వర్క్‌షాప్స్ కూడా ఉంటాయి. అలాగే పని ప్రదేశాల్లో ఎదురయ్యే ఒత్తిడులను తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడే వారి సంఖ్య కూడా ఇటీవల పెరిగింది. అంతర్జాతీయ సూత్రాల ఆధారంగా ఒక మోడల్‌ను రూపొందించి, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ సహాయంతో ఒత్తిడులను సమర్థంగా ఎదుర్కోగలిగే మెలకువలను పెంపొందించాలనే ఆలోచన కూడా ఉంది.

• గోగుమళ్ల కవిత

ముత్యాల ముగ్గు





11 చుక్కలు,
6 వచ్చేవరకు,
సంధుచుక్క



ఎ.స్వాతి
తెనాలి

మాకు పంపండి

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్సు, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.

ఈ-మెయిల్: features@andhrajyothy.com



కొత్త వెలుగులతో...

ఫ్యాషన్

ధగధగలాడే జిలుగు వెలుగులతో మెరిసిపోవాలంటే షిమ్మర్ డ్రస్సులు ఎంచుకోవాలి. కొత్త సంవత్సర వేడుకల్లో మిరుమిట్లుగొలిపే లైట్లు వెలుగుల్లో, తళతళలాడే డ్రస్సులతో వెలిగిపోవడం కోసం ఈ దుస్తులను ఎంచుకోండి.

బంగారం, వెండి వర్ణాల్లో...

బంగారపు మెరుపులు విరజిమ్మే గోల్డ్, సిల్వర్ లైక్రా డ్రస్సులున్నాయి. కొత్త సంవత్సర వేడుకల కోసం సెక్విన్ వర్క్‌లు కలిగిన లైక్రా గౌన్లు బాగుంటాయి. ఎలాస్టిక్‌లా సాగుతూ, మెత్తగా, ఒంటికి హత్తుకుపోయేలా ఉండే ప్లెయిన్ లైక్రా డ్రస్‌ను మెరుపులీనే హ్యాండ్ బ్యాగ్, శాండిల్స్‌తో మ్యాచ్ చేస్తే ఆకర్షణీయంగా కనిపిస్తారు.

భిన్నమైన వస్త్రాలతో...

మెటాలిక్ దారాలు, సెక్విన్లతో పాటు లేమ్, ల్యూరెక్స్ లాంటి వేర్వేరు మెరుపులీనే షిమ్మర్ వస్త్రాలు ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. ఈ వస్త్రాలు కలిగి ఉండే వైవిధ్యం వల్ల ప్రత్యేకించి సాయంకాలపు వేడుకల్లో ధరించడానికి తగిన దుస్తుల కోసం వీటిని ఎంచుకుంటూ ఉంటారు. షిమ్మర్ బాడీకాన్ డ్రస్, మ్యాక్సీ, మిడి డ్రస్‌లతో పాటు, సెక్విన్, కాక్‌టెయిల్ డ్రస్సులు న్యూ ఇయర్ వేడుకలకు చక్కగా సూటవుతాయి.









అర్ధరాత్రి 12.00 గంటలకు బెంజి సర్కిల్‌లో యువత కేరింతలు



విజయవాడ ఫన్‌టౌన్ క్లబ్‌లో డాన్స్ చేస్తున్న యువత

కొత్త హుషారు..

నూతన సంవత్సరానికి నగరం ఘన స్వాగతం పలికింది. బాణసంచా కాల్పులు, కేక్ కటింగ్‌ల మధ్య 2024కు వీడ్కోలు పలికి 2025ను ఆహ్వానించింది. సాయంత్రం నుంచే నగరంలో సందడి వాతావరణం నెలకొంది. పలు భారీ ఈవెంట్లకు విజయవాడ వేదికైంది. బబ్బూరి గ్రౌండ్స్‌లో మెలోడీ మాస్టర్ మణిశర్మ సంగీత విభావరి నిర్వహించారు. పెనమలూరు మండలం కానూరు శివారున ఉన్న రిసార్ట్స్‌లో సినీ గాయని గీతామాధురి మధుర గీతాలతో కుర్రకారును ఉర్రూతలూగించింది. - విజయవాడ-ఆంధ్రజ్యోతి





చలో అస్సాం!

కొడాలి నాని ప్రధాన అనుచరుడు కాళీ అరెస్టు

- అస్సాంలో అదుపులోకి తీసుకున్న గుడివాడ పోలీసులు
- కేసుల భయంతో అస్సాం పరారైన కాళీ
- అక్కడ చేపల వ్యాపారం చేసుకుంటూ జీవనం
- పోలీసులు వస్తున్నారని మరోచోటుకు మకాం
- ఫోన్ సిగ్నల్స్ ట్రాక్ చేసి వెంటాడి పట్టుకున్న పోలీసులు
- గడ్డం గ్యాంగ్‌లో ప్రధాన పాత్రధారి ఇతనే
- ఐదేళ్లూ నాని అండతో రెచ్చిపోయిన కాళీ
- పలు కేసుల్లో ఏ1.. గన్నవరంలో హత్యాయత్నం కేసులో నిందితుడు



గడ్డం గ్యాంగ్ కాళీ (ఫైల్)

(విజయవాడ/గుడివాడ - ఆంధ్రజ్యోతి): అధికారం ఉందని ఐదేళ్ల పాటు చెలరేగిపోయిన మాజీ మంత్రి కొడాలి నాని ప్రధాన అనుచరుడు, గడ్డం గ్యాంగ్‌లో కీలక పాత్రధారి, కృష్ణాజిల్లా వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీని గుడివాడ పోలీసులు అరెస్టు చేశారు. గుడివాడ టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుపై దాడి కేసులో కాళీ కీలక సూత్రధారి. 2022 డిసెంబరు 25న రావి వెంకటేశ్వరరావుపై కాళీ, అతని గ్యాంగ్ పెట్రోలు సంచులు, కర్రలు, రాడ్‌లతో హత్యాయత్నానికి పాల్పడ్డారు. రావి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన 15మందిపై గుడివాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండటంతో ఈ కేసులో ఎలాంటి పురోగతి లేదు. 2024లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ కేసును పోలీసులు తిరగదోడారు. 13 మంది నిందితులను అరెస్టు చేశారు. ఇదే కేసులో ప్రధాన నిందితుడు కాళీ, మరో నిందితుడు కూచిపూడి శ్రీను అలియాస్ జిమ్ శ్రీను పరారీలో ఉన్నారు. మంగళవారం కాళీని అస్సాంలో అరెస్టు చేసినట్లు గుడివాడ వన్ టౌన్ పోలీసులు ప్రకటించారు. మరో నిందితుడు జిమ్‌శ్రీను అరెస్టు చేయాల్సి ఉంది.

లెక్కలేనన్ని అరాచకాలు

వైసీపీ హయాంలో గడ్డం గ్యాంగ్ ముసుగులో కాళీ అతని అనుచరులు ఎన్నో అరాచకాలకు పాల్పడ్డారు. ఎన్నో కేసుల్లో కాళీ ఏ1గా ఉన్నాడు. గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఇతనిపై హత్యాయత్నం కేసు నమోదైంది. వైసీపీ అధికారంలో ఉన్నంత వరకు కొడాలి నాని అండతో రెచ్చిపోయిన కాళీ రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన వెంటనే గుడివాడ నుంచి అదృశ్యమైపోయాడు. చాలా కాలం పాటు పోలీసుల నిఘాకు కూడా అందకుండా తప్పించుకు తిరిగాడు. పోలీసులు నిరంతరాయంగా అతని అనుచరులపైన కుటుంబ సభ్యులపైన నిఘా ఉంచడంతో ఎట్టకేలకు అస్సాంలో ఉన్నట్లు మిగతా 8లో..



పుస్తకాలకు పండగొచ్చింది

రేపటి నుంచి పుస్తక మహోత్సవం

- ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రారంభం
- 35వ పుస్తక మహోత్సవంలో 290 స్టాల్స్ ఏర్పాటు
- ఈసారి ఇంగ్లీష్ ప్రచురణకర్తల సందడి.. వారికి 100 స్టాల్స్
- ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ 10లో

కదులుతున్న డొంక

- పీడీఎస్ బియ్యం మాయం కేసులో ఏ-6గా పేర్ని నాని పేరు 8లో
- పోలీసుల అదుపులో ఉన్నాడంటూ ఉదయం నుంచి విస్తృత ప్రచారం



దుర్గగుడి ఇన్‌చార్జి ఈవోగా రామచంద్ర మోహన్



ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న రామచంద్ర మోహన్

విజయవాడ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా రామచంద్ర మోహన్‌ను నియమిస్తూ దేవదాయ శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుతం ఆయన కమిషనర్ కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా ఉన్నారు. కేఎస్ రామారావు పదవీకాలం మంగళవారంతో ముగిసింది. రామారావు రెవెన్యూ శాఖ నుంచి డిప్యూటేషన్‌పై ఇంద్రకీలాద్రికి వచ్చారు. దసరాకు ఆయన డిప్యూటేషన్ సమయం అయిపోయింది.







హెల్మెట్ ప్లీజ్..



హెల్మెట్ ధరించండి..
ఓ భక్తుడిని వేడుకుంటూ..

» న్యూ ఇయర్ గిఫ్ట్.. పోలీసు కమిషనర్ వినూత్న ఆలోచన

విజయవాడ సిటీలైఫ్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : కొత్త ఆశలతో నూతన సంవత్సర ఘడియలు అడుగుపెడుతున్న సమయంలో ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటారు. ఆలింగనాలు చేసుకుంటూరు. చేతులు చేతులు కలుపుకుని గ్రీటింగ్స్ చెప్పుకుంటారు. పుష్పగుచ్చాలు ఇచ్చుకుంటారు. కేకులు కోసి తినిపించుకుంటారు. కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికే సమయంలో కనిపించే దృశ్యాలు ఇవి.. రాబోయే కొత్త రోజుల్లో కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టారు పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు. కేక్ కటింగ్‌లను పక్కన పెట్టి యువతకు హెల్మెట్లను కానుకగా ఇవ్వాలని నిర్ణయించారు. హెల్మెట్లు లేకుండా రహదారుల మీదకు వచ్చిన యువతను గుర్తించి హెల్మెట్లు పంపిణీ చేశారు. హైకోర్టు స్పందనతో నగరంలో హెల్మెట్ డ్రైవ్ విస్తృతంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. పలుచోట్ల పోలీసులతో వాహనదారులు వివాదానికి దిగుతున్నారు. అయినా హెల్మెట్ నిబంధన విషయంలో వెనక్కి తగ్గేదిలేదని ఇప్పటికే పోలీసు కమిషనర్ ప్రకటించారు. యువతలో అవగాహనను తీసుకొచ్చేందుకు వారికి కానుకగా హెల్మెట్ అందజేశారు.



మంగళవారం తనిఖీల్లో భాగంగా నగరంలో హెల్మెట్ లేని వాహనదారులను ఎక్కడికక్కడ అడ్డుకుంటున్న ట్రాఫిక్ పోలీసులు

ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలి

» ప్రజలకు ఎంపీ కేశినేని శివనాథ్ శుభాకాంక్షలు



వన్‌టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, వారి జీవితాల్లో కొత్త వెలుగులు రావాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆకాంక్షించారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి కుటుంబం ఆర్థిక స్వావలంబన వైపు అడుగులు వేయాలంటే, ప్రతి ఇంటినుంచి ఒక ఎంటర్‌ప్రెన్యూర్ రావాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు అందరికీ మార్గదర్శకమన్నారు. నిరుద్యోగ యువత జాతీయ గ్రామీణ స్వయం ఉపాధి పథకాన్ని ఉపయోగించుకుని ముందడుగు వేయాలన్నారు. నూతన ఆలోచనలకు, ఆత్మవిశ్వాసానికి కొత్త సంవత్సరం ఒక పునాది కావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేలా కృషి చేయటంతో పాటు, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తానన్నారు. 2025 సంవత్సరం ప్రజల ఆనందాల సంవత్సరం కావాలని, ప్రతిఇంటా సమృద్ధిగా సంపద, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.



డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్

2025 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

విజయవాడ లీగల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్ మంగళవారం సిటీ సివిల్ కోర్టుల ఆవరణలో 2025 డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ప్రతి ఏడాది రాష్ట్రంలో అన్ని జిల్లాల బార్ అసోసియేషన్‌కు డైరీలు, క్యాలెండర్లను పంపడం జరుగుతుందని చలసాని తెలిపారు. దీనిలో భాగంగా న్యాయవాదులకు పదివేల డైరీలు, ప్యాకెట్ క్యాలెండర్లు, గోడ క్యాలెండర్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఐఏఎల్ నాయకులు ఎం.ఎ.షరీఫ్, బోను జయమ్మ, కేఎస్ సుధాకరరాజు, ఈఎస్ ప్రసాద్, కేవీవీ పరమేశ్వరరావు, ఎస్.సాయి శంకర్, గోరిపర్తి శ్రీనివాస్, ఎస్.సురేష్‌బాబు, ఉప్పుప్రసాద్, గుంట్ల శ్రీనివాస్, తాతా మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు క్రెడాయ్ ప్రాపర్టీ షో ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

క్రెడాయ్ ప్రాపర్టీ షోకు ముఖ్యమంత్రికి ఆహ్వానం

ఆటోనగర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : క్రెడాయ్ ప్రాపర్టీ షో జనవరి 10న ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబును క్రెడాయ్ విజయవాడ అధ్యక్షుడు డి.రాంబాబు, కార్యదర్శి వి.శ్రీధర్, కన్వీనర్ కె.రఘురాం, కోశాధికారి టి.వంశీకృష్ణలు మంగళవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. మూడురోజుల పాటు నిర్వహించబోయే ప్రాపర్టీ షోలో పలు దిగ్గజ కంపెనీలు పాల్గొంటున్నాయని, పేదలకు అందుబాటులో ఇల్లు నిర్మాణం చేయడంలో ఆయా కంపెనీలకు సుదీర్ఘ అనుభవముందని ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు ఇంద్రకీలాద్రికి చంద్రబాబు

విజయవాడ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు బుధవారం ఇంద్రకీలాద్రికి రాబోతున్నారు. కొత్త సంవత్సరం తొలి రోజున శ్రీ దుర్గామల్లేశ్వరస్వామిని దర్శించుకుంటారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆయన ఆలయానికి చేరుకుంటారు. మహానివేదిన ఇచ్చిన తర్వాత ఆయన అమ్మవారిని దర్శించుకుంటారు.

దొంగల గుట్టు విప్పిన గూగుల్!

» గూగుల్‌పేతో నిందితుల ఆచూకీ
» దోపిడీ కేసును ఛేదించిన సీసీఎస్ పోలీసులు
» మహిళ సహా ఇద్దరు నిందితుల అరెస్టు
» రూ.4లక్షల బంగారు ఆభరణాలు స్వాధీనం



పాయకాపురం దోపిడీ కేసు వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్ పోలీసులు, అదుపులో నిందితులు



విజయవాడ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : టీ, టిఫిన్ దగ్గర నుంచి ఏదైనా వస్తువు కొనుగోలు చేయాలన్నా నగదు చెల్లింపులకు దాదాపు అందరూ ఉపయోగించే సాధనం గూగుల్‌పే. ఆన్‌లైన్ చెల్లింపులు నేడు సర్వ సాధారణమైపోయాయి. ఇదిలా ఉంటే ఓ దోపిడీ కేసులో నిందితుల ఆచూకీని గూగుల్ పే ద్వారా పోలీసులు కనుగొన్నారు. సీసీ కెమెరాల ఫుటేజీతో పాటు గూగుల్ పేలో జరిగిన లావాదేవీలను బట్టి నిందితులను అరెస్టు చేశారు. ఆ వివరాలను సీసీఎస్ ఏడీసీపీ ఎం.రాజారావు మంగళవారం వెల్లడించారు. విజయవాడ వాంబేకాలనీకి చెందిన విన్నకోట శాలిని ఈవెంట్స్ డ్యాన్సర్. గుంటూరు జిల్లా రుద్రవరానికి చెందిన యార్లగడ్డ హరిబాబు శుభకార్యాయాల వేదికలకు డెకరేషన్ చేస్తుంటాడు. పశ్చిమగోదావరి జిల్లా వేల్పూరుకు చెందిన బెడెల్లి రాజేష్ డ్యాన్సర్. వివిధ ఈవెంట్లలో చేసిన కార్యక్రమాల్లో ఈ ముగ్గురికి పరిచయం ఏర్పడింది. శాలిని మొదటి భర్తతో విడాకులు తీసుకుని తిరుపతికి చెందిన మరో వ్యక్తిని వివాహం చేసుకుంది. కొద్దిరోజుల క్రితం అతడితో విడిపోయి వాంబేకాలనీలో ఒంటరిగా ఉంటోంది. ఆమె తల్లిదండ్రులు పాయకాపురంలోని దేవినేని గాంధీపురంలో ఓ భవనంపై అంతస్తులో ఉంటున్నారు. ఈ ఇంటి యజమాని దంపతులు ఇద్దరూ వృద్ధులు. శాలిని తరుచుగా తల్లిదండ్రుల వద్దకు వచ్చి వెళ్తుండేది. ఈ క్రమంలో వృద్ధురాలి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలపై కన్నేసింది. దంపతులిద్దరూ వృద్ధులు కావడం, నిత్యం ఇంట్లోనే ఉండటంతో దోపిడీకి వ్యూహం రచించి విషయాన్ని హరిబాబు, రాజేష్‌కు వివరించింది.

శాలిని ఇంట్లో ఉంటూ దోపిడీ ఎలా చేయాలన్న దానిపై చర్చించుకున్నారు. ఈనెల 26న వృద్ధ దంపతుల్లో భర్త ఒక గదిలో నిద్రపోయాడు. భార్య మొదటి గదిలో నిద్రపోయింది. ముందు తలుపులకు గడియ వేసుకున్నప్పటికీ వెనుక వైపు తలుపులకు గడియ వేయలేదు. ఆ రోజున ముందుగా శాలిని, రాజేష్ వృద్ధ దంపతుల ఇంటికి వచ్చారు. తర్వాత కాసేపటికి హరిబాబు వచ్చి రాజేష్‌ను బయట కాపలాగా పెట్టారు. మరో వైపున శాలిని తన బావను కాపలాకు పెట్టింది. శాలిని, హరిబాబు వృద్ధురాలి నోట్లో గుడ్డముక్కలు కుక్కి, ఒంటిపై ఉన్న బంగారాన్ని చోరీ చేశారు. ఆ వస్తువులను తీసుకుని రాజేష్, హరిబాబు కలిసి ఇంట్లో నుంచి బయటకు వచ్చి ఆటో మాట్లాడుకుని బస్ స్టాండ్ వెళ్లిపోయారు. ఆటో చార్జీలకు వారి వద్ద డబ్బులు లేకపోవడంతో శాలినికి ఫోన్‌చేశారు. ఆటోడ్రైవర్ ఫోన్‌నంబరు ఇచ్చి ఆమెతో గూగుల్ పే చేయించుకున్నారు.

ఇలా చిక్కారు..

దోపిడీకి సంబంధించి నున్న పోలీసులు ఈనెల 27న కేసు నమోదు చేశారు. తర్వాత దర్యాప్తును సీసీఎస్ పోలీసులు చేపట్టారు. ఘటనా స్థలంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా ఇంట్లో నుంచి హరిబాబు, రాజేష్ బయటకు రావడం కనిపించింది. హడావుడిగా ఆటో ఎక్కిన దృశ్యాలు ఫుటేజీల్లో స్పష్టంగా ఉన్నాయి. ముందుగా ఆటో నంబర్‌ను బయటకు తీసిన పోలీసులు డ్రైవర్‌ను విచారించారు. 26వ తేదీ రాత్రి ఇద్దరు యువకులు ఆటో ఎక్కిన మాట వాస్తవమేనని, వారు ఎవరో తనకు తెలియదని చెప్పాడు. డబ్బులు లేకపోవడంతో మరొకరికి ఫోన్ చేసి గూగుల్ పే చేయించారని వివరించాడు. దీనితో డ్రైవర్ ఫోన్ నుంచి శాలిని నంబరును పోలీసులు గుర్తించారు. ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా మొత్తం దోపిడీ గుట్టును విప్పేసింది. శాలినితోపాటు హరిబాబు, రాజేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరో నిందితుడు శాలిని బావ పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి రూ.4లక్షల విలువ చేసే 60 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పేదల సామాజిక భద్రతకు ఎన్టీఆర్ భరోసా

» జిల్లాలో 2,30,619 లబ్ధిదారులకు రూ.98.19 కోట్లు
» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సామాజిక భద్రత కల్పించి ఆర్థికంగా చేయూత ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకాన్ని అమలుచేస్తోందని, క్షేత్రస్థాయిలో అధికారుల నిరంతర పర్యవేక్షణలో కొత్త సంవత్సరం నేపథ్యంలో ఒక రోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ విజయవాడ అర్బన్ పరిధిలోని పటమట, చిట్టినగర్‌తో పాటు వివిధ కాలనీల్లో పెన్షన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేదలకు గౌరవప్రదమైన జీవితాన్ని అందించే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని అమలుచేస్తోందన్నారు. దీనిలో భాగంగా జిల్లావ్యాప్తంగా 2,30,619 పెన్షన్లకు రూ.98.19 కోట్లు అందజేయడం జరుగుతోందన్నారు. ఉదయం 6 గంటలకే ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఎన్టీఆర్ భరోసా మొత్తాన్ని లబ్ధిదారుల చేతిలో పెడుతుంటే వారు ఎంతో ఆనందిస్తున్నారన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు తమకు మ్యాప్ చేసిన లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి పెన్షన్ మొత్తం అందించినట్టు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో జిల్లాను నెం.1 స్థానంలో నిలిపేందుకు అధికార యంత్రాంగం కృషిచేస్తున్నట్టు వివరించారు. ఆర్డీవోలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పెన్షన్ల పంపిణీ సజావుగా జరిగేలా చూసినట్టు తెలిపారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, వీఎంసీ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధుడికి పెన్షన్ అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

4న జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్

కృష్ణలంక : నూతన ఆవిష్కరణలు దేశ ప్రగతికి సోపానాలని, విద్యార్థుల వైజ్ఞానిక ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్ మంచి వేదిక అని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి దక్షిణ భారత ఎన్టీఆర్ జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్-2025 పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ సైన్స్ ఫెయిర్ జనవరి 4న అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎంకే బేగ్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో ప్రారంభమవుతుందని, ప్రతి మండలం నుంచి ఆరు ప్రాజెక్టులు పోటీల్లో పాల్గొంటాయన్నారు. టీచర్ ఎగ్జిబిట్, వ్యక్తిగత, గ్రూప్ కేటగిరిల్లో దాదాపు 120 ప్రాజెక్టుల ప్రదర్శన వుంటుందని, విద్యార్థులు, ఉపాధ్యాయులు కొత్త ఆవిష్కరణలతో ప్రాజెక్టులను ఎంపిక చేసుకొని జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యేలా కృషిచేయాలన్నారు. నూతన ఆవిష్కరణలు ప్రజల అవసరాలను తీర్చడంతో పాటు దేశాభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. బెంగుళూరులోని విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం (వీఐటీఎం) సహకారంతో సమగ్రశిక్ష ఎస్పీడీ, ఎస్ఈఆర్టీ మార్గదర్శకాల మేరకు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, గణితం, ఎర్త్/స్పేస్‌సైన్స్, పర్యావరణ శాస్త్రం, ఇంజనీరింగ్, బయోసైన్స్/బయోకెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో ప్రాజెక్టులు వుంటాయని వివరించారు. డీఈవో యూవీ సుబ్బారావు, షైనం హుస్సేన్ పాల్గొన్నారు.

పలు రైళ్ల వేళల మార్పు

రైల్వేస్టేషన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వే డివిజన్‌లో జనవరి 1 నుంచి 94 ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకల సమయాల్లో మార్పులు అమలులోకి రానున్నాయి. ఈ మేరకు విజయవాడ డివిజన్ రైల్వే పీఆర్వో నుస్రత్ ఎ మండ్రూపకర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడ డివిజన్ పరిధిలో రైళ్ల వేళలు, సర్వీసులను భారీగా మార్పుచేసినట్టు ఆమె తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించిన మేరకు ఈ మార్పులు బుధవారం (జనవరి 1) నుంచి అమలులోకి వస్తాయని తెలిపారు.

- 17249 తిరుపతి-కాకినాడ టౌన్ విజయవాడకు ఉదయం 7 గంటలకు చేరుకునేది. ఇకపై 6.25 గంటలకు చేరుకోనుంది. ఒంగోలు, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోటల్లో సవరించిన సమయాల ప్రకారం రాకపోకలు సాగిస్తుంది.



- 17405 తిరుపతి-అదిలాబాద్ రైలు, 12509 సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య టెర్మినల్ (ఎస్ఎంవిటి) బెంగళూరు-గౌహతి, లింగంపల్లి-వైజాగ్, అలప్పీ-ధన్‌బాద్, చెన్నై-సెంట్రల్ వైజాగ్, తిరుపతి-పూరి, ఆయా స్టేషన్లలో సవరించిన ప్రకారం ఆగనున్నాయి. మరికొన్ని రైళ్లు కొత్తగా కొన్ని స్టేషన్లలో ఆగనున్నాయి. ప్రయోగాత్మకంగా ఈ స్టాపేజీలను అమలు చేస్తున్నారు.
- సికింద్రాబాద్-వైజాగ్ ఏలూరుస్టేషన్‌లో, భువనేశ్వర్-రామేశ్వరం, పుదుచ్చేరి-హౌరా రాజమండ్రి స్టేషన్‌లో, తిరుపతి-పూరి, తిరుపతి-బాలేశ్వర్ కొవ్వూరు స్టేషన్‌లో, తిరుపతి-పూరి, తిరుపతి-బిలాస్‌పూర్, తిరుపతి-కాకినాడ పోర్ట్ చినగంజాం స్టేషన్‌లో, గుంటూరు-రాయగడ్ భీమడోలు స్టేషన్‌లో, విజయవాడ-కాకినాడ పోర్టు పశివేదల, ఎర్నాకులం జంక్షన్-బరౌని చీరాలలో, సికింద్రాబాద్-వైజాగ్ ఏలూరులో, నరసాపూర్-గుంటూరు రైలు పుట్లచెరువు స్టేషన్లలో ఆగనున్నాయి.
- 88 రైళ్లకు సంబంధించి నెంబర్లను మార్పు చేశారు. ఈ నెంబర్లను గమనించి ప్రయాణికులు తమ టిక్కెట్లను బుక్ చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరారు. అలాగే 14 రైళ్లకు సంబంధించి రైలు వేగాలను 5 నుంచి 25 కిలో మీటర్ల వరకు పెంచారు. విజయవాడ-మచిలీపట్నం వంటి ప్యాసింజర్ రైళ్ల వేగాన్ని కూడా పెంచారు.

ఉదయం 6 గంటలకే రత్నాచల్..

12718 విజయవాడ-వైజాగ్ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ షెడ్యూల్‌లో మార్పుచేశారు. జనవరి 1 నుంచి ఈ రైలు ఉదయం 6.15 గంటలకు బదులు 6 గంటలకే విజయవాడ స్టేషన్‌లో బయల్దేరనున్నదని అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో 6 గంటలకు బయలుదేరి6.30కి నూజివీడు, 6.50కి ఏలూరు,7.20కి తాడేపల్లిగూడెం, 7.35కి నిడదవోలు, 8కి రాజమండ్రి, 8.25కి అనపర్తి, 8.50కి సామర్లకోట, 9.15కి అన్నవరం, 9.30కి తుని, 10.35కి అనకాపల్లి చేరుతుంది.

చలో అస్సాం!

(7వ పేజీ తరువాయి)

గుర్తించారు. గుడివాడ నుంచి నేరుగా ఈశాన్య రాష్ట్రమైన అస్సాం వెళ్లిన కాళీ అక్కడ చేపల వ్యాపారం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గుడివాడ నుంచి పోలీసు బృందాలు అస్సాం వస్తున్నాయని తెలుసుకున్న కాళీ తాను ఉంటున్న ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మకాం మార్చారు. అయితే ఓపిగ్గా వేచి ఉన్న పోలీసులు కాళీ వాడుతున్న ఫోన్లను ట్రాక్ చేసుకుంటూ అతను ఉన్న ప్రాంతాన్ని గుర్తించి మంగళవారం అదుపులోకి తీసుకున్నారు.

కొడాలి నాని మెడకు ఉచ్చు

రావి వెంకటేశ్వరరావుపై హత్యాయత్నం కేసులో కొడాలి నాని కూడా అరెస్ట్ అయ్యే అవకాశముందని సమాచారం. గతంలో అరెస్టయిన 13 మంది నిందితులను గుడివాడ వన్‌టౌన్ పోలీసులు కస్టడీకి తీసుకుని రెండు రోజులపాటు విచారించారు. ఆ సమయంలో వారు కొడాలి నాని ఆదేశాల మేరకే తాము దాడులకు పాల్పడ్డామని వెల్లడించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కాళీ నుంచి కూడా వీలైనంత సమాచారాన్ని సేకరించి నానిపైన కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

ఐదేళ్లు చెలరేగిపోయిన గడ్డం గ్యాంగ్

గుడివాడలో గడ్డం గ్యాంగ్ ముసుగులో కొడాలి నాని అనుచరులు చేసిన ఆగడాలు అన్నీ ఇన్నీ కావు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రాక ముందే ఇక్కడ నాని అనుచరులు టీడీపీ శ్రేణులపై దాడులకు తెగబడటం మొదలుపెట్టారు. 2019 మే 24వ తేదీన ఎన్నికల కౌంటింగ్ రోజున బందరులోని కౌంటింగ్ సెంటర్ నుంచి తిరిగి వస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు కారుపై కొడాలి నాని అనుచరులు దాడి చేశారు. ఆ తర్వాత యలవర్తి శ్రీనివాసరావుకు చెందిన హోటల్‌పై దాడి చేసి నాని అనుచరులు విధ్వంసం సృష్టించారు.

- 2022లో శాంతియుతంగా సాగుతున్న అమరావతి పాదయాత్రలోకి చొరబడిన కాళీ, అతని అనుచరులు పాదయాత్రలో ఉన్న మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. పోలీసులు అక్కడే ఉన్నా కనీసం వారిని నిలువరించే ప్రయత్నం చేయలేదు.
- కొడాలి నాని ఆధ్వర్యంలో 2022 సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన కేసినో వ్యవహారంలో తెలుగుదేశం పార్టీ నియమించిన నిజనిర్ధారణ కమిటీపై ఏకంగా కొడాలి నాని ముఖ్య అనుచరులు దుక్కిపాటి శశిభూషణ్, మెరుగుమాల కాళీ స్వయంగా దాడికి పాల్పడ్డారు.
- 2022 డిసెంబరు 25న రావి వెంకటేశ్వరరావు హత్యకు కాళీ తన అనుచరులు ప్రయత్నించారు. పెట్రోలు సంచులతోపాటు రాడ్డులు, కర్రలతో దాడికి తెగబడ్డారు. అడ్డువచ్చిన పోలీసులపైన, ఈ తంతును చిత్రీకరిస్తున్న పాత్రికేయులపైన కూడా దాడి చేశారు. వీరిని నిలువరించాల్సిన పోలీసులు తిరిగి టీడీపీ శ్రేణులపై లాఠీలు ఝుళిపించారు. అప్పట్లో వన్‌టౌన్ సీఐగా ఉన్న గోవిందరాజులు స్వయంగా లాఠీ చార్జికి పాల్పడటం వివాదాస్పదమైంది.
- 2024 జనవరి 18న స్థానిక బైపాస్ రోడ్డులోని టీడీపీ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ స్టేడియానికి బయలుదేరిన నియోజకవర్గ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. టీడీపీ వాహన శ్రేణికి అడ్డుగా పోలీసులు పెట్టిన బారికేడ్లను టీడీపీ శ్రేణులు తోసివేశారు. దీంతో అసహనానికి గురైన అప్పటి వన్‌టౌన్ సీఐ ఇంద్ర శ్రీనివాసరావు టీడీపీ కార్యకర్తలపై లాఠీలతో విరుచుకుపడ్డారు.
- ఒంగోలుకు చెందిన సొంత పార్టీ నాయకుడు సుబ్బారావు గుప్తా అప్పటి సీఎం జగన్‌కు వ్యతిరేకంగా మాట్లాడారన్న కారణంగా అతనిపై గడ్డం గ్యాంగ్ దాడికి తెగబడింది.

ప్రభుత్వాధికారులనూ వదల్లేదు...

- ఎమ్మెల్యే కొడాలి నాని క్యాంపు కార్యాలయంలో అప్పటి తహశీల్దార్ ఎం.శ్రీనివాసరావుపై కాళీ అతని అనుచరులు దాడి చేశారు. తన సమక్షంలోనే దాడి జరిగినా ఎమ్మెల్యే నాని కనీసం స్పందించలేదు.
- మట్టి అక్రమ తోలకాలను అడ్డుకున్నాడనే నెపంతో అప్పటి ఆర్ఐ అరవింద్‌పై కాళీ అతని అనుచరులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. పోలీసులు మాత్రం ఆర్ఐపైనే తిరిగి కేసు నమోదు చేయడం విశేషం. ఈ దాడులన్నింటిలోనూ ప్రధాన పాత్రధారి కాళీ, అతని అనుచరులే.

గన్నవరంలో కాళీపై హత్యాయత్నం కేసు

కృష్ణా జిల్లాలోనే ప్రతిష్ఠాత్మకమైన విద్యాసంస్థలుగా పేరొందిన వేమూరి కోదండ రామయ్య, వేములపల్లి నాగభూషణం(వీకేఆర్ - వీఎన్‌బీ) ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్‌ను తన పరం చేసుకునేందుకు వైసీపీ హయాంలో అప్పటి మంత్రి కొడాలి నాని, ఆయన అనుచరగణం ఏకంగా ఆ సంస్థల ప్రెసిడెంట్‌నే హత్య చేసేందుకు పథకం వేశారు. సుమారు రూ.300 కోట్ల విలువైన ఆస్తులను తమ ఖాతాలో వేసుకునేందుకు మంత్రి పావులు కదిపారు. తమకు అడ్డుగా ఉన్న ఈ విద్యాసంస్థల ప్రెసిడెంట్ మోపర్తి కాశీ వెంకటేశ్వరరావుపై మంత్రి అనుచరులు గన్నవరం వద్ద దాడికి దిగి హత్య చేసేందుకు ప్రయత్నించారు. హైదరాబాద్‌లో ఉండే కాశీ వెంకటేశ్వరరావు 2022 మార్చి 9న గుడివాడ వచ్చారు. అదే రోజు రాత్రి ఆయన హైదరాబాద్ తిరుగు ప్రయాణమయ్యారు. గన్నవరం సమీపంలో ఐదుగురు వ్యక్తులు బైక్‌పై వచ్చి కాశీ వెంకటేశ్వరరావుపై దాడి చేసి, ఆయన్ను చంపేందుకు ప్రయత్నించారు. ఈ దాడిలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై కాశీ వెంకటేశ్వరరావు గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దాడిలో కాళీ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. కాళీతోపాటు అతనికి వరుసకు సోదరుడయ్యే రాజేశ్, శ్రీనివాసు కూడా ఈ కేసులో నిందితులుగా ఉన్నారు.

కదులుతున్న డొంక

పీడీఎస్ బియ్యం మాయం కేసులో ఏ-6గా పేర్ని నాని



పోలీసుల అదుపులో ఉన్నాడంటూ ఉదయం నుంచి విస్తృత ప్రచారం
హైకోర్టు ఉత్తర్వులతో పేర్ని నాని అరెస్ట్‌పై స్పష్టత ఇవ్వని పోలీసులు
గోడౌన్ మేనేజర్ ఖాతా నుంచి పేర్ని కుటుంబసభ్యులు, మిల్లు యజమాని, లారీ డ్రైవర్‌కు నగదు బదిలీ
రూ.24 లక్షల వరకు బదిలీ అయినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడి
గోడౌన్ మేనేజర్ మానసతేజ అప్రూవర్‌గా మారతాడనే ప్రచారం

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం) మాజీమంత్రి పేర్ని నాని గోడౌన్ నుంచి పీడీఎస్ బియ్యం మాయం కేసులో ఏ-1గా ఉన్న గోడౌన్ యజమాని పేర్ని జయసుధకు జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. సోమవారం అర్ధరాత్రి గోడౌన్ మేనేజర్ మానసతేజ, పౌరసరఫరాలశాఖ టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డి, పెడన మండలం నందిగామకు చెందిన మిల్లు యజమాని బొర్రా ఆంజనేయులు, బంటుమిల్లి మండలం పెనుమల్లికి చెందిన లారీడ్రైవర్ బోట్ల మంగారావుకు న్యాయమూర్తి రిమాండ్ విధించారు. ఏ-6గా ఉన్న పేర్ని నానిని వచ్చే సోమవారం వరకు అరెస్ట్ చేయవద్దని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

నాని కోసం పోలీసుల వేట

మాజీ మంత్రి పేర్ని నానికి చెందిన గోడౌన్‌ల మేనేజర్ మానసతేజ పోలీసుల విచారణలో వెల్లడించిన వివరాల ఆధారంగా పీడీఎస్ బియ్యం మాయం కేసులో పేర్ని నాని పేరును ఏ-6గా సోమవారం అర్ధరాత్రి పోలీసులు నమోదు చేశారు. మంగళవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో పోలీస్ బృందాలు పేర్ని నాని ఇంటి వద్దకు వెళ్లాయి. అప్పటికే ఆయన అక్కడ లేకపోవడపోవడంతో మచిలీపట్నంలోని వివిధ ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. అయినా పేర్ని ఆచూకీని కనిపెట్టలేకపోయారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి పెనమలూరులో పేర్ని నానిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే ప్రచారం జరిగింది. అక్కడి నుంచి ఉంగుటూరు, వివిధ స్టేషన్లకు తరలించినట్టు, మీడియా, సోషల్ మీడియా విస్తృత ప్రచారం చేశాయి. అయితే పీడీఎస్ బియ్యం మాయం కేసులో ఏ-6గా పేర్ని నాని పేరును చేర్చడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారని, హైకోర్టు నిర్ణయాన్ని బట్టి తదుపరి చర్యలు ఉంటాయని పోలీస్ అధికారులు తెలిపారు. పేర్ని నానిని అదుపులోకి తీసుకోలేదని, పోలీస్ అధికారులు స్పష్టం చేశారు.

రూ.24 లక్షల మేర నగదు లావాదేవీలు

గోడౌన్ మేనేజర్ మానసతేజను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించిన సమయంలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడైనట్లు తెలిసింది. మానసతేజ తన యజమాని పేర్ని నాని చెప్పినట్లుగానే నగదు తన ఖాతాలో జమ చేయించుకొని, ఇతరుల ఖాతాల్లోకి నగదు బదిలీ చేసినట్లు పోలీసుల విచారణలో అంగీకరించినట్లు పోలీసులు చెబుతున్నారు. మానసతేజ, మిల్లు యజమాని, లారీ డ్రైవర్ మధ్య నగదు లావాదేవీలు రూ.24లక్షల వరకు జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు. ఇంకా విచారణ జరుగుతోందని, మరి కొందరి పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. మానసతేజ అప్రూవర్‌గా మారే అవకాశాలు ఉన్నాయని జోరుగా ప్రచారం జరుగుతోంది.

2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు 2025

రాష్ట్రంలో సంపద సృష్టి చంద్రబాబుకే సాధ్యం

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్


7వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : సంపదను సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే సత్తా సీఎం చంద్రబాబుకు మాత్రమే ఉందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. మొగల్రాజపురం 6వ డివిజన్‌లో ఆంజనేయ స్వామి గుడి నుంచి గంగానమ్మ గుడి వీధి వరకు రూ.8.17 లక్షలతో మెట్లు, 8.46 లక్షలతో రెయిలింగ్ పనులకు, రూ.6.20 లక్షలతో తోటనారాయణరావు వీధి కొండ ప్రాంతంలో మెట్లు రెయిలింగ్ పనులకు, రూ.5.20 లక్షలతో 7 డివిజన్ పరిధిలో బోయపాటి మాధవరావు రోడ్డు శానిటరీ కార్యాలయం వెనుక యూజీడీ పైపు లైను పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలకి వచ్చిన తరువాత రోజుకు కోటి రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పీపీపీ విధానంలో లక్షా యనభైఆరువేల కోట్లతో ఒక ప్రాజెక్టు తీసుకురాబోతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో 6, 7 డివిజన్ అధ్యక్షులు పడాల గంగాధర్, సతీష్, దుర్గాప్రసాద్, అశోక్, నాగుమోతు రాజా, పెనుగొండ శ్రీనివాస్, పటాన్‌మదర్, దోమకొండ రవి,రత్నాకర్, పరసా లక్ష్మణ్, పెరవల శివ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో రాజకీయ చైతన్యం తెచ్చింది టీడీపీనే..

పటమట : ప్రజాసంక్షేమ పథకాలు, పాలనాపరమైన సంస్కరణలు అమలు చేయడమే కాకుండా, ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకువచ్చిన ఏకైక రాజకీయ పార్టీ టీడీపీనేనని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 12వ డివిజన్‌కు చెందిన కాట్రగడ్డ వెంకట నారాయణకు ఆన్‌లైన్ ద్వారా మంగళవారం టీడీపీ వెబ్‌సైట్‌లో లక్ష రూపాయలు చెల్లించి జీవిత కాల సభ్యత్వ నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పొట్లూరి సాయిబాబు, జాస్తి సాంబశివరావు, సుంకర విజయబాబు, జంపన శరత్‌బాబు, లింగం మురళీ, రామ్మోహన్, కొడాలి శివాజీ పాల్గొన్నారు.

42 రోజులు దత్తక్షేత్రనాథ యాత్ర

పటమట,డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : గణపతి సచ్చిదానంద స్వామిజీ తలపెట్టిన ఆధ్యాత్మిక దత్తక్షేత్ర నాథ్ యాత్ర ఈ నెల 3న విజయవాడ దత్త పీఠం నుంచి ప్రారంభమవుతుందని దత్తపీఠం నిర్వాహకులు తెలిపారు. స్వామిజీ ఆంధ్ర రాష్ట్రానికి మంచి జరగాలని, ప్రజలకు, ప్రభుత్వానికి, పాలకులకు చక్కటి ఆయురారోగ్యాలతో పాటు నిశ్చలంగా సుఖశాంతులతో ఉండాలని, దేశం సుభిక్షంగా, సురక్షితంగా ఆకాంక్షిస్తూ యాత్ర చేస్తారని వివరించారు. రాష్ట్రంలో 42 రోజుల పాటు 32 గ్రామాల్లోని దత్తక్షేత్రాలను సందర్శిస్తూ దత్తనామస్మరణతో స్వామీజీ దీక్షను చేపట్టి ఈ ఆధ్యాత్మిక యాత్రను ప్రారంభిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. జనవరి 4న తేదీ ఉదయం 10 గంటల నుంచి మ్యూజిక్ హీలింగ్ రాగ రాగణీ సంగీత కచేరి జరుగుతుందని, 5న దత్తాత్రేయుడు శివాలయంలో కుంభాభిషేకం జరుగుతుందని దత్తపీఠం నిర్వాహకులు వివరించారు.

కొనసాగుతున్న వాకర్స్ నిరసన


నిరసన తెలుపుతున్న లయోలా, అమరావతి వాకర్స్ సభ్యులు

భారతీనగర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రాలయోలా కళాశాల యాజమాన్యం మొండి వైఖరిని వ్యతిరేకిస్తూ కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్‌కు అనుమతిని కోరుతూ మంగళవారం లయోలా వాకర్స్ అమరావతి వాకర్స్ సభ్యులు నిరసన తెలిపారు. పర్వతనేని ప్రసాద్‌రావు మద్దతు తెలిపారు. బుధవారం నూతన సంవత్సరం వేడుకలలో భాగంగా కళాశాల గేట్‌దగ్గర కేక్ కట్ చేస్తామని వాకర్స్ సభ్యులు తెలిపారు. జనవరి 2 తేదీన కళాశాల గ్రౌండ్‌లో నడవడానికి వాకర్స్ సభ్యులందరూ సిద్ధంగా ఉండాలని వాకర్స్ సంఘ సభ్యులు తెలిపారు.

నెట్‌బాల్ టోర్నీకి ఎస్‌ఆర్‌ఆర్ జట్టు


ఎస్‌ఆర్‌ఆర్ జట్టుతో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, పీడీ యుగంధర్ తదితరులు

గుణదల, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జైపూర్‌లో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు జరగనున్న నెట్‌బాల్ ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ మెన్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల నుంచి జట్టు మంగళవారం బయలు దేరిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. జైపూర్‌లోని సురేష్ జ్ఞాన్ విహార్ యూనివర్సిటీలో జరగనున్న నెట్‌బాల్ టోర్నీకి కృష్ణా యూనివర్సిటీ నుంచి ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ఎంపియిందని ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి తెలిపారు. జట్టు మేనేజర్‌గా డి.నవీన్ కుమార్, కోచ్‌గా బి.దుర్గాప్రసాద్ ఎంపిక చేసేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ డి.సత్యన్నారాయణ, ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల వ్యాయామ విద్య విభాగాధితి డాక్టర్ టి.యుగంధర్ పాల్గొన్నారు.

జాతీయ రోలర్ బాస్కెట్‌బాల్ విజేత జ్ఞానచరణ్



పటమట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : శ్రీ చైతన్య ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి వై.జ్ఞాన చరణ్ జాతీయ స్థాయి రోలర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతగా నిలిచాడని పాఠశాల రీజనల్ ఇన్‌చార్జి పద్మ తెలిపారు. మహారాష్ట్రలో నాగపూర్‌లో డిసెంబరు 27 నుంచి 29 వరకు నిర్వహించిన చాంపియన్‌షిప్ 2024 అండర్-14 విభాగంలో కప్‌తో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నాడన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన అభినందన సభలో పలువురు అభినందనలు తెలిపారు. ఈజీఎం మద్దినేని మురళీకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ కొల్లి సునీత, అకడమిక్ డీన్ వెంకటేశ్వర్లు తదితరుల పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	114,122, 133
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

26వ డివిజన్‌లో పింఛన్ల పంపిణీ

గుణదల, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పేదలు నూతన సంవత్సరం ఆనందంగా గడపాలన్న ఆలోచనతో చంద్రబాబు ఒక్కరోజు ముందుగానే పింఛన్లను పంపిణీ చేశారని ఎమ్మెల్యే ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 26వ డివిజన్‌లో మంగళవారం ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. అదే సమయంలో డివిజన్‌లో సమస్యలపై ఆరా తీశారు. వైసీపీ నాయకులు అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారన్నారు. అయితే వాటిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, డివిజన్ ఇన్‌చార్జి వల్లభనేని సతీష్, డివిజన్ అధ్యక్షుడు తోట పాండు, కార్యదర్శి కారంపూడి సత్య, కడియం ప్రకాష్, శశి, విత్తనాల మూర్తి, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వీపీ సిద్ధార్థలో నూతన సంవత్సర వేడుకలు

మొగల్రాజపురం : మొగల్రాజపురం వీరమాచనేపి పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్‌స్కూల్‌లో నూతన సంవత్సర వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు జానపద గీతాలు ఆలపించారు. చిన్నారులు నృత్యాలు, నాటికలతో అలరించారు. పాఠశాల సంచాలకులు మేడా సీతారామయ్య మాట్లాడుతూ ఈ ఏడాది అన్నీ శుభాలే జరగాలని ఆకాక్షించారు. ఉపసంచాలకులు రోజ్‌మేరీ, ప్రిన్సిపాల్ జయలక్ష్మి పాల్గొన్నారు.

3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

ఆటోనగర్ : భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో 3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ తెలిపారు. మహిళా అభ్యున్నతి కోసం ఆవిర్భవించిన బీసీ యువజన పార్టీ ప్రతిఏటా ఈ వేడుకలు నిర్వహిస్తుందన్నారు. బోధనల్లో ప్రతిభ చూపిన మహిళా ఉపాధ్యాయునీలను సత్కరించనున్నట్టు తెలిపారు.






న్యూ జోష్

పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికారు ఉమ్మడి కృష్ణాజిల్లా వాసులు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలు దాటాక ప్రజలంతా రోడ్లపైకి వచ్చి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ సందడి చేశారు. విజయవాడ నగరంలో పలు చోట్ల పార్టీలు, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వీటికి హాజరైన యువత డ్యాన్సులు చేస్తూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు.

పుస్తకాలకు పండగొచ్చింది

- రేపటి నుంచి పుస్తక మహోత్సవం ● ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- ఐజీఎంఎస్‌లో పూర్తయిన ఏర్పాట్లు ● ఈసారి ఇంగ్లీష్ ప్రచురణకర్తల సందడి

ఆంధ్రజ్యోతి, విజయవాడ: సాహిత్యవాడ విజయవాడలో పుస్తక మహోత్సవానికి సమయం ఆసన్నమైంది. పుస్తకప్రియులు జరుపుకునే ఈ ఉత్సవానికి 2వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా జరిగే పుస్తక మహోత్సవానికి విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. నగరానికి నడిబొడ్డున ఎంజీ రోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 35వ పుస్తక మహోత్సవం నిర్వహణ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. మొత్తంగా 290 స్టాల్స్‌ను ఇక్కడ ఏర్పాటు చేశారు. వాటిలో 253 స్టాల్స్ ప్రచురణకర్తలకు సంబంధించినవి కాగా మిగిలిన 40 స్టాల్స్‌ను ప్రభుత్వ శాఖలకు, పత్రికలకు కేటాయించారు. ఈ ఏడాది ఇంగ్లీష్ ప్రచురణల హవా కొనసాగే అవకాశాలు ఉన్నాయి. 253 స్టాల్స్‌లో 100 స్టాల్స్‌ను ఇంగ్లీష్ ప్రచురణకర్తలు తీసుకున్నారు. ఢిల్లీ, రాజస్థాన్, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై, చండీఘడ్ ప్రాంతాల నుంచి ప్రచురణకర్తలు వస్తున్నట్టు వీబీఎఫ్ఎస్ ప్రతినిధులు తెలిపారు. ముఖ్యంగా ఆక్స్‌ఫర్డ్, సెజ్, జైన్ పబ్లికేషన్స్, కేంబ్రిడ్జి, పెంగ్విన్ వంటి ప్రముఖసంస్థలు పుస్తక మహోత్సవానికి రాబోతున్నాయి. పుస్తకావిష్కరణలు, ప్రముఖ కవులు, రచయితల శత జయంతి సభల నిర్వహణకు ఒక వేదికను, చిన్నారుల ప్రదర్శనలు, బాలసాహిత్యం నిర్వహించడానికి మరో వేదికను ఏర్పాటు చేశారు. ప్రధాన వేదికకు చెరుకూరి రామోజీరావు సాహిత్య వేదికగా నామకరణం చేశారు. చిన్నారుల ప్రదర్శనకార్యక్రమాప్రదలు నిర్వహించే ప్రతిభా వేదికకు రతన్ టాటా వేదికగా పేరు పెట్టారు. 2వ తేదీ సాయంత్రం పుస్తక మహోత్సవం ద్వారాలు తెరుచుకుంటారు. దీని ప్రారంభోత్సవానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఆయనతోపాటు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ హాజరవుతారని వీబీఎఫ్ఎస్ తెలిపింది.


ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు

మారుతున్న వేదికలు

విజయవాడలో పుస్తక మహోత్సవం నిర్వహించడం మొదలు పెట్టినప్పటి నుంచి స్వరాజ్య మైదానం దానికి చిరునామాగా ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి ఈ చిరునామా మారుతూ వచ్చింది. విజయవాడలో మొదటిసారిగా 1989లో నేషనల్ బుక్ ట్రస్ట్ స్వరాజ్యమైదానంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసింది. తర్వాత 1990లోను నిర్వహించింది. అనంతరం 1991లో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఏర్పడింది. అదే సంవత్సరం స్వరాజ్య మైదానంలో వీబీఎఫ్ఎస్ ఆధ్వర్యంలో తొలి పుస్తక మహోత్సవం నిర్వహించారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ఈ మహోత్సవం జరుగుతోంది. కొవిడ్ సమయంలో లాక్‌డౌన్ కారణంగా 2020లో జరగలేదు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్వరాజ్య మైదానంలో అంబేద్కర్ స్మృతి వనం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దీనితో స్వరాజ్య మైదానం నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోకి మహోత్సవం చేరింది. 2023, 2024లో ఇక్కడే పుస్తక మహోత్సవాన్ని నిర్వహించారు. ఇక్కడ ప్రాంగణం స్టాల్స్ ఏర్పాటుకు సరిపడకపోవడంతో కొత్త ప్రాంగణాన్ని వీబీఎఫ్ఎస్ ప్రతినిధులు వెతకాల్సి వచ్చింది. వాస్తవంగా వైసీపీ హయాంలోనే ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించాలని భావించారు. దీనికి అప్పటి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. ఈ ఏడాది వీబీఎఫ్ఎస్ ప్రతినిధులు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి పరిస్థితిని, సమస్యను వివరించారు. ఆయన చొరవతో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 2025 పుస్తక మహోత్సవం ముస్తాబవుతోంది.


ఏపీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ చిరంజీవి చౌదరి

అటవీశాఖ అధికారుల డైరీ ఆవిష్కరణ

విజయవాడ-ఆంధ్రజ్యోతి: ఏపీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ముద్రించిన 2025 డైరీని ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ చిరంజీవి చౌదరి ఆవిష్కరించారు. మంగళవారం ఆయన కార్యాలయంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, విజయవాడ ఫారెస్ట్ రేంజి ఆఫీసర్ కే శ్రీనివాసులరెడ్డితోపాటు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు టి.ఉమామహేశ్వర రెడ్డి, డి.శ్రీవిద్య, ఎస్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

9న తపాలా ఫిర్యాదుల స్వీకరణ

లబ్బీపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తపాలా కార్యాలయాల్లో అందించే సేవలకు సంబంధించిన ఫిర్యాదులను జనవరి 9న విజయవాడ సర్కిల్ ఆఫీసులో స్వీకరించనున్నట్టు చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కెప్రకాష్ తెలిపారు. పోస్ట్ ద్వారా ఫిర్యాదులు పంపేవారు జనవరి 6లోపు నీలంరాజు రంగారావు, అసిస్టెంట్ డైరెక్టర్ (ఫిర్యాదులు, నిర్వహణ), చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్, ఆంధ్రప్రదేశ్ సర్కిల్, విజయవాడ-5200013. కార్యాలయానికి పోస్ట్‌లో పంపాలని, పోస్ట్ కవర్‌పై డాక్ అదాలత్ అని పెద్ద అక్షరాలతో రాసి పంపవచ్చని తెలిపారు. అలాగే నేరుగా ఫిర్యాదుల పరిష్కారానికి జనవరి 9న చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాయయానికి ఉదయం 11గంటలకు అదాలత్‌కు హాజరుకావచ్చని, వర్చువల్‌గానూ పాల్గొనవచ్చన్నారు. వచ్చిన ఫిర్యాదులు పరిశీలించాక ఫిర్యాదుదారుడికి పరిష్కారం లెటర్, ఈ-మెయిల్‌లో తెలియజేస్తామన్నారు.

వృత్తి డీజే.. ప్రవృత్తి చైన్‌స్నాచింగ్

- ఆర్నెల్లలో 8 చోరీలు, ఎట్టకేలకు పోలీసులకు చిక్కిన దుండగుడు
- రూ.12 లక్షల విలువైన బంగారు ఆభరణాల స్వాధీనం

జగ్గయ్యపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): డీజేలు ఏర్పాటుచేసే వృత్తిలో ఉన్న ఒక వ్యక్తి దుర్వ్యసనాలకు గురై, జల్సాలు చేసేందుకు ఒంటరిగా ఉన్న మహిళల మెడల్లో చైన్‌లు దొంగతనం చేయడానికి అలవాటుపడ్డాడు. వరుసగా ఆంధ్ర, తెలంగాణలో ఆర్నెల్లలో 8 దోపిడీలకు పాల్పడి ఎట్టకేలకు వత్సవాయి పోలీసులకు చిక్కాడు. మంగళవారం జగ్గయ్యపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో నందిగామ ఏసీపీ ఏబీజీ తిలక్ ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో నిందితుడితో పాటు అతడు చోరీ చేసిన రూ.12లక్షలు విలువైన బంగారు ఆభరణాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన డీజే మైక్‌సెట్స్ ఆపరేటర్ బర్మావత్ నాగరాజు (36) ఒంటరిగా పనులకు వెళ్లే మహిళలను ఎంచుకుని బైక్‌పై వెళ్తూ చైన్లు లాక్కొని వెళ్లిపోతున్నాడు. అతడిపై తెలంగాణలోని గరిడేపల్లి పీఎస్, చిలుకూరు పీఎస్ పరిధిలో బేతవోలు, మన రాష్ట్రంలో తెనాలి రైల్వేస్టేషన్, జగ్గయ్యపేట సర్కిల్, పెనుగంచిప్రోలు స్టేషన్, నందిగామ పీఎస్, వత్సవాయి పీఎస్‌లోని భీమవరంలో, తాజాగా మూడు రోజుల క్రితం నందిగామ మండలం అనాసాగరం వద్ద బైక్‌పై వెళ్తున్న వారి మెడలో చైన్ తెంచేందుకు ప్రయత్నించి విఫలమై, అదే రోజు వత్సవాయి పోలీస్ స్టేషన్ పరిధిలో చినమోదుగపల్లిలో మహిళ మెడలో చైన్ తెంచుకుని పరారైయ్యాడు. వరుస చోరీలతో సీరియస్‌గా తీసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. జగ్గయ్యపేట ఎస్సై-2 వెంకటేశ్వరరావు, వత్సవాయి ఎస్సై ఉమామహేశ్వరరావుతో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. మంగళవారం అతడిని అదుపులోకి తీసుకోగా రూ.12లక్షలు విలువైన 176 గ్రాముల బంగారం బయటపడింది. దర్యాప్తులో పాలుపంచుకున్న ఏఎస్సై శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు సురేష్, జాలయ్య, హరికృష్ణకు సీపీ ప్రత్యేకంగా నగదు రివార్డులు అందజేశారు. ఏసీపీ తిలక్ వారిని దుశ్శాలువాలతో సత్కరించారు. అతి స్వల్ప కాలంలో నిందితుడిని పట్టుకుని విలువైన ఆభరణాలను రికవరి చేశామన్నారు. సమావేశంలో సీఐ పీ.వెంకటేశ్వర్లు, జగ్గయ్యపేట ఎస్సై-2 వెంకటేశ్వరరావు, వత్సవాయి ఎస్సై ఉమామహేశ్వరరావు, ఏఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.


బంగారు చైన్లు, నిందితుడిని విలేకర్లకు చూపుతున్న నందిగామ ఏసీపీ తిలక్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

సమగ్రంగా పరిశీలించి బాండ్లు అందించండి

- టీడీఆర్ బాండ్స్ కమిటీ సమీక్షలో కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సమగ్రంగా పరిశీలన చేసి లబ్ధిదారులకు టీడీఆర్ బాండ్లను అందజేయాలని కమిషనర్ ధ్యానచంద్ర కమిటీ సభ్యులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం కమిషనర్ ధ్యానచంద్ర తన చాంబర్‌లో టీడీఆర్ బాండ్స్ కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్కిల్-1 పరిధిలోని భవానీపురం ప్రాంతంలోని పున్నమిఘాట్ వద్దనున్న ప్రాంతం, ఆంధ్రప్రభ కాలనీ రోడ్డు విస్తరణ, డోర్నకల్ రోడ్డు విస్తరణ, కార్లమార్క్స్‌రోడ్ విస్తరణ, సర్కిల్-3 పరిధిలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి యనమలకుదురు డొంక రోడ్డు విస్తరణపై చర్చించారు. ఈ సందర్భంలో టీడీఆర్ బాండ్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 14 దరఖాస్తులపై సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కమిటీ సభ్యులందరూ వచ్చిన దరఖాస్తులపై సమగ్ర విచారణ చేసి రోడ్ డెవలప్మెంట్ ప్లాన్ ప్రకారం ఉందా, లేదా అని నిర్ధారించుకుని, మరోసారి రికార్డ్ వెరిఫై చేసి, ప్రభుత్వం అనుమతులకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్తర మండల తహసీల్దార్ సూర్యారావు, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జీ సృజన, జాయింట్ సబ్ రిజిస్టర్ గుణదల నందేశ్వరరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్‌బాబు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఎంపికైన టీటీ జట్టుతో సునీత

సౌత్‌జోన్ టీటీ టోర్నీకి కృష్ణావర్శిటీ టీమ్ ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో జనవరి 3 నుంచి 5 వరకు అమిత్ వర్శిటీ ఆధ్వర్యంలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్శిటీ మహిళా టేబుల్ టెన్నిస్ టోర్నీకి కృష్ణా వర్శిటీ జట్టును ఎంపిక చేసినట్టు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచంట సునీత ఒక ప్రకటనలో తెలిపారు. కే జోషిత, ఏ నిహారిక (కేవీఎస్ఆర్ స్కాప్స్), ఏ రజనీ, కే ఉమామహేశ్వరి (ఎస్‌డీఎంఎస్ఎంకే), కే ప్రణీత (పీబీ సిద్ధార్థ కాలేజ్) బరిలో దిగుతున్నారు.

1998 డీఎస్సీ మిగిలిన అభ్యర్థులకు న్యాయం చేయాలి

ధర్నాచౌక్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం 1998 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేస్తామని చెప్పి ఉద్యోగ నియామక ప్రక్రియలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయకుండా బీసీ, ఎస్సీ, వికలాంగ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేసిందని అఖిల భారత ఓబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ మండిపడ్డారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. 1998 డీఎస్సీలో ఇంకా 594 పోస్టులు ఉన్నాయని ఇటీవల అసెంబ్లీలో విద్యాశాఖ మంత్రి ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. 1998 డీఎస్సీలో మిగిలిన అభ్యర్థులకు న్యాయం చేసే అంశం పై 1998 డీఎస్సీ కమిటీతో చర్చలు జరపాని మంత్రి లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 3న మంగళగిరిలో అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేసి అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలుస్తామన్నారు. 1998 డీఎస్సీ మిగిలిన అభ్యర్థుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఈ శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

ఈశ్వర్ స్వచ్ఛంద పదవీ విరమణ

వన్‌టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఏపీ మునిసిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దొప్పలపూడి ఈశ్వర్ మంగళవారం స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. విజయవాడ వీఎంసీ కార్యాలయంలో ఏపీ మునిసిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ విఎంసీ యూనిట్ అధ్యక్షుడు తిమ్మసత్తి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సలీం అహ్మద్ ఆధ్వర్యంలో అభినందన సన్మానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఉద్యోగ సంఘాల నేతలు కె.శివరామ ప్రసాద్, రవి, శ్రీనివాసరావు, వి.విజయలక్ష్మి, సంగీతరావు, జి.నాగరాజు, విశ్వనాథరెడ్డి, గాలి సుధాకర్, మోహన్ గోపాల్, అమర్నాథ్ రెడ్డి, ఎస్.వెంకట కృష్ణ, కె.కళ్యాణ చక్రవర్తి, ఎం. అప్పలరాజు, జాన్‌పాల్‌తో పాటు వీఎంసీ అధికారులు, ఉద్యోగులు ఈశ్వర్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

మొగల్రాజపురం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఈ నెలలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి నిమిత్తం జనశిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు డైరెక్టర్ ఏ పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్ కోర్సు, జ్యూట్ ప్రొడక్టు మేకింగ్, కటింగ్ టైలరింగ్, డ్రెస్ డిజైనింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, టెక్స్‌టైల్ ప్రింటింగ్, మిర్రర్ వర్క్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, హోమ్‌క్రాఫ్ట్, జామ్ జ్యూస్ తయారీ, రిఫ్రిజరేషన్ వర్క్, ప్యాకింగ్ మొదలైన వాటిలో శిక్షణ ఇస్తామని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు విజయవాడలోని మొగల్రాజపురం రావి చెట్టు సెంటర్ వద్ద ఉన్న జనశిక్షణా సంస్థాన్ లేదా ఫోన్ 0866- 2470420లో సంప్రదించవచ్చన్నారు.

ఇన్ సర్వీసు చదువుకు జిల్లా స్థాయిలోనే అనుమతివ్వాలి

- బహుజన టీచర్ల సంఘం వినతి

అమరావతి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు ఇన్ సర్వీసులో చదువుకునేందుకు జిల్లాస్థాయిలోనే అనుమతివ్వాలని బహుజన టీచర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మనోజ్‌కుమార్, సీహెచ్ రమేశ్ కోరారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజును మంగళవారం ప్రధాన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జీవో 342 ప్రకారం అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ టీచర్లు ఇన్ సర్వీసులో బీఈడీ, ఆపై చదువులు చదువుకోవచ్చన్నారు. దీనికి గతంలో జిల్లా స్థాయిలోనే అనుమతిచ్చేవారని, ఇప్పుడు అనుమతి కోసం కమిషనర్ కార్యాలయానికి పంపడం వల్ల ఆలస్యమై, సీట్లు కోల్పోతున్నారని, సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.


ప్లస్, మైనస్, ఇంటూ, భాగహారం ఆకారాల్లో కూర్చొన్న విద్యార్థులు

గుబాళించిన గణితం

- దళవాయిలో ఘనంగా గణితోత్సవం

వన్‌టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యాధరపురం దళవాయి సుబ్బరామయ్య వీఎంసీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉత్సాహపూరిత వాతావరణంలో ఆసక్తికరంగా గణిత ఉత్సవాలు జరిగాయి. కార్యక్రమాలన్నీ గణితం ఆధారంగానే జరిగాయి. ముగ్గులు, పాటలు, ప్రాజెక్టులు, చార్టులు, సందేశాలన్నీ గణితం గురించే సాగాయి. గణిత శాస్త్రవేత్తల చిత్రపటాలు, తదితర అంశాలతో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కేబీఎన్ కళాశాల గణిత విభాగాధిపతి కల్మా ముఖ్య అతిథిగా విచ్చేసి సందేశం ఇచ్చారు. గణితం లేనిదే ఏ శాస్త్రం ముందుకు సాగదన్నారు. ఆడుతూ గణితం నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రపంచానికి గణిత శాస్త్రవేత్తలు అపూర్వమైన విజ్ఞానాన్ని అందించారన్నారు. చిన్న వయస్సులోనే అనారోగ్యంతో మరణించిన శ్రీనివాస రామానుజన్ జన్మదినోత్సవాన్ని జాతీయ గణిత దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని గుర్తు చేశారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు గణితాన్ని అవగాహనపరచుకునేందుకు పోటీలు నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు చదువుకున్న ప్రతి పుస్తకంపై ఒక గణిత శాస్త్రవేత్త చిత్రపటాన్ని అతికించుకునేలా శిక్షణ ఇవ్వటం ముదావహమన్నారు. గణితం ప్రాధాన్యతతో ముగ్గులను వేయటంపై శిక్షణ ఇవ్వటం ఆశ్చర్యకరమన్నారు. కేబీఎన్ కళాశాల తరఫున పాఠశాలకు రూ.20వేల విలువైన గణిత బోధన సామగ్రి కిట్‌ను అందించారు. ప్రధానోపాధ్యాయుడు మాతంగి కోటయ్య మాట్లాడుతూ గణితం ఒక సబ్జెక్టు కాదని, అది ఒక భాష, అంతకన్న ఒక జీవన విధానమన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్‌తో పాటు గణిత శాస్త్రవేత్తల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు సమర్పించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఆంధ్రప్రదేశ్ మేథమేటిక్స్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు ధృవపత్రాలు అందించారు. పాఠశాల ఉపాధ్యాయుడు డీవీ మురళీ ప్రసాద్, జ్యోతిర్మయి, సి.హెచ్.వి.ఎస్.వి. ప్రసాద్, విజయలక్ష్మి, శారద, అన్నపూర్ణ, వసంతలక్ష్మి పాల్గొన్నారు.


గణిత కిట్‌ను అందిస్తున్న కల్మా

దుర్గమ్మ సన్నిధిలో టీటీడీ ఈవో దంపతులు



వన్‌టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో జె.శ్యామలరావు దంపతులు మంగళవారం ఆలయానికి విచ్చేసి దర్శించుకున్నారు. ఈవో రామారావు వారికి ఆలయ మర్యాదలు అందజేపి అమ్మవారి దర్శనం కల్పించారు. అధికారులు చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం ఇవ్వగా వేద పండితులు వేద ఆశీస్సులిచ్చారు.

రెండోరోజు లెక్కింపులో రూ.2,10,58,165 నగదు రాక



దుర్గగుడిలో సోమవారం మొదలైన కానుకల లెక్కింపు మంగళవారం కొనసాగింది. రూ.2,10,58,165 నగదు రూపంలో కానుకలు లభించాయి. బంగారం 120 గ్రాములు, వెండి 10 కిలోల 535 గ్రాములు రాగా అమెరికన్ డాలర్లు 98, సౌదీ రియాల్స్ 535, యూరప్ యూరోలు 20, అరబ్ ఎమిరేట్స్ దిర్హమ్స్ 60, కెనడా డాలర్లు 5, సింగపూర్ డాలర్లు 44, మలేషియా రింగెట్లు 10 కానుకలుగా లభించాయి. కాగా, సోమవారం నాటి లెక్కింపులో రూ.2,70,66,162 నగదు రూపంలో లభించింది. మొత్తంగా 2 రోజులకుగాను రూ.4,81,24,327 నగదు లభించింది.

దుర్గమ్మ దర్శనానికి వచ్చి స్పృహ తప్పిన వృద్ధురాలు

విజయవాడలోని చిట్టినగర్‌కు చెందిన యిలిపిల్లి అచ్చయమ్మ (65) మంగళవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి వచ్చి దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందిపడుతున్న ఆమె స్పృహతప్పి పడిపోయారు. వెంటనే భక్తులు ఆమె సమాచారాన్ని పోలీసులకు, దేవస్థానానికి తెలిపారు. ఉచిత క్యూలో దర్శనానికి నిలబడిన ఆమె పడిపోవటంతో వన్‌టౌన్ అవుట్ పోస్టు పోలీసులు స్పందించి పరిచర్య చేసి ఆసుపత్రికి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ నరసింహారావు తన రెండు చేతులతో ఆమెను పైకి ఎత్తుకుని ప్రథమ చికిత్సా కేంద్రానికి తరలించారు. అచ్చయమ్మకు ఎలాంటి ప్రాణాపాయం లేదని, కోలుకుంటున్నారని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ నరసింహారావు చొరవ ప్రతిఒక్కరి ప్రశంసలు అందుకుంది.


స్పృహ తప్పిన అచ్చయమ్మ







ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
విజయవాడ ● బుధవారం 1 జనవరి 2025



సీఎంతో భేటీ చాటుమాటు
వ్యవహారం కాదు

- మీ రాజకీయాల కోసం చిత్రపరిశ్రమను వాడుకోవద్దు
- కేటీఆర్‌కు దిల్‌రాజు హితవు

అనవసర వివాదాల్లోకి తెలుగు చిత్ర పరిశ్రమను లాగి, లేనిపోని రాజకీయాలను ఆపాదించొద్దు, రాజకీయ దాడి, ప్రతి దాడులకు దయచేసి పరిశ్రమను వాడుకోవద్దు అని ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నిర్మాత దిల్‌రాజు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పరిశ్రమను లక్ష్యంగా మార్చుకున్నారనీ, సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనను వాడుకొని సినిమావాళ్లతో సెటిల్‌మెంట్ చేసుకొని ఇప్పుడు సైలెంట్ అయ్యారని మీడియా చిట్‌చాట్‌లో కేటీఆర్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ దిల్‌రాజు సోషల్ మీడియా ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జరిగిన తెలుగు చలనచిత్ర పరిశ్రమ సమావేశంపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు బాధాకరం అన్నారు. ఇదేమీ ఒకరిద్దరితో చాటుమాటున జరిగిన వ్యవహారం కాదని స్పష్టం చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమ బాగోగుల గురించి, స్నేహ పూర్వక వాతావరణంలో ఎలాంటి దాపరికాలు లేకుండా జరిగిన ఈ సమావేశంతో తెలుగు చిత్ర పరిశ్రమ చాలా సంతృప్తిగా ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పయనంలో తెలుగు చిత్ర పరిశ్రమ భాగస్వామ్యాన్ని సీఎం గుర్తించారు, రాష్ట్రాభివృద్ధి, సామాజిక సంక్షేమానికి, మా వంతు బాధ్యతగా తగిన సహకారం అందజేయాలని కోరారని తెలిపారు. హైదరాబాద్‌ను గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దాలనే సీఎం బలమైన సంకల్పాన్ని తెలుగు చిత్ర పరిశ్రమగా ప్రతినిధులుగా మేమంతా స్వాగతించాం అని పేర్కొన్నారు. లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తున్న తెలుగు చిత్ర పరిశ్రమకు అన్ని ప్రభుత్వాల సహకారం, ప్రజలందరి ప్రోత్సాహం ఉంటుందని ఆకాంక్షించారు.

అభిమానుల సమక్షంలో...



వైవిధ్యభరితమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తూ, వరుస విజయాలతో దూసుకుపోతున్న నందమూరి బాలకృష్ణ ఈ సంక్రాంతికి మరో విభిన్న కథాచిత్రం 'డాకూ మహరాజ్' తో ప్రేక్షకులను అలరించనున్నారు. ఇంతకుముందెన్నడూ చూడని సరికొత్త అవతారంతో బాలకృష్ణ కనిపించే ఈ చిత్రానికి బాబీ కొల్లి దర్శకుడు. ఇప్పటివరకూ విడుదలైన గ్లింప్స్ టైటిల్ టీజర్ సినిమా మీద అంచనాలు పెంచగా, ఇప్పుడు ట్రైలర్ కోసం అంతా ఎదురు చూస్తున్నారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు హైదరాబాద్‌లోని జేఆర్‌సీ ఆడిటోరియంలో అభిమానుల సమక్షంలో ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన 'డాకూ మహరాజ్' ఈ నెల 12న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.


మీరు నేర్పాల్సిన అవసరం లేదు



పెద్దలను ఎలా గౌరవించాలో మీరు మాకు నేర్పాల్సిన అవసరం లేదు, మీ కన్నా మేము ఎక్కువగా బోనీకపూర్‌ను గౌరవిస్తాం అని బాలీవుడ్ విశ్లేషకుడు సుమిత్ కడేల్‌కు టాలీవుడ్ నిర్మాత నాగవంశీ బదులిచ్చారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న బాలీవుడ్ నిర్మాత బోనీకపూర్, నాగవంశీ మధ్య వాడి వేడీ చర్చ నడిచింది. బాలీవుడ్ సినిమా ఇంకా బాంద్రా, జూహూ దగ్గరే ఆగిపోయిందనీ, మూస ధోరణిలో ఇరుక్కుపోయిన హిందీ పరిశ్రమకు దక్షిణాది దర్శకులే కొత్త దారులు చూపుతున్నారన్న నాగవంశీ వ్యాఖ్యలను బోనీకపూర్ అంగీకరించలేదు. కొత్తగా ప్రయోగాలు చేయడం బాలీవుడ్‌లో ఎప్పట్నుంచో ఉన్నదేననీ, ఇప్పుడు కూడా అది కొనసాగుతోందని ఆయన సమర్థించుకునే ప్రయత్నం చేశారు. హిందీ బెల్ట్‌లో 'పుష్ప 2' తొలి రోజు వసూళ్లు చూసి బాలీవుడ్‌కు నిద్రపట్టలేదేమో అంటూ నాగవంశీ ఎత్తిపొడిచారు. ఈ వీడియో వైరల్ అవడంతో బాలీవుడ్ అభిమానులు నాగవంశీని తప్పుపడుతున్నారు. బోనీకపూర్ పట్ల నాగవంశీ ప్రవర్తన అమర్యాదరకంగా ఉందంటూ సుమిత్ కడేల్ ట్వీట్ చేశారు. మీ అభిప్రాయాన్ని మరింత హుందాగా వ్యక్తం చేసి ఉండొచ్చు, విమర్శ మంచిదే కానీ, అమర్యాదకర ప్రవర్తన ఆమోదయోగ్యం కాదు, అహంకారం పతనానికి దారి తీస్తుందని సుమిత్ కడేల్ చేసిన ట్వీట్‌కు నాగవంశీ బదులిచ్చారు.


ఒకప్పుడు తెలుగు హీరోల క్రేజ్ కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితమయ్యేది. కానీ, ఈ దశాబ్ద కాలంలో టాలీవుడ్ టాప్ హీరోల క్రేజ్ అమాంతం పెరిగిపోయి పాన్‌ఇండియా స్టార్స్‌గా ఎదిగారు. ఇప్పుడు వారి సినిమాల కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కొత్త సంవత్సరంలో మన హీరోలు చేసే సినిమాలపై ఓ లుక్కేద్దాం.

కొత్త ఏడాది కొత్త ప్రాజెక్ట్స్



'బాహుబలి' సిరీస్‌తో దేశవ్యాప్తంగా అభిమానుల్ని సంపాదించుకున్నారు ప్రభాస్. ఆయన తర్వాత చేసిన సినిమాలన్నీ పాన్‌ఇండియా స్థాయిలోనే విడుదలయ్యాయి. 'సలార్', 'కల్కి 2898 ఏ.డీ' చిత్రాలతో వరుస హిట్‌లు కొట్టారు ప్రభాస్. ప్రస్తుతం ఆ సినిమాల సీక్వెల్స్‌తో పాటు హారర్ థ్రిల్లర్ 'రాజాసాబ్', 'స్పిరిట్', 'ఫౌజీ' (వర్కింగ్ టైటిల్) చిత్రాలతో బిజీగా ఉన్నారాయన. కొత్త ఏడాదిలో 'రాజాసాబ్' చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రేక్షకులను భయపెట్టడం ఖాయమని మేకర్స్ తెలిపారు. 'ఫౌజీ' చిత్రీకరణ దశలో ఉంది. సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కించే 'స్పిరిట్' త్వరలోనే పట్టాలెక్కనుంది.

సంక్రాంతి బరిలో



'రంగస్థలం' సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు రామ్‌చరణ్. ఆ తర్వాత నటించిన 'ఆర్‌ఆర్‌ఆర్' ఆయనని గ్లోబల్ స్టార్‌ని చేసింది. కొత్త ఏడాదిలో సంక్రాంతి సందర్భంగా ఈ నెల 10న 'గేమ్‌ఛేంజర్' సినిమాతో వస్తున్నారు చరణ్. అలాగే, దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఆయన నటిస్తున్న 'ఆర్‌సీ 16' షూటింగ్ ఇటీవలే ప్రారంభమైంది. దర్శకుడు సుకుమార్‌తో చేయబోయే సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది.




యుద్ధరంగంలో దేవర

'టెంపర్' నుంచి ఇటీవలే విడుదలైన 'దేవర' వరకు వరుస హిట్స్‌తో దూసుకుపోతున్నారు ఎన్టీఆర్. 'ఆర్‌ఆర్‌ఆర్', 'దేవర' సినిమాలతో నార్త్‌బెల్ట్‌లోనూ మంచి క్రేజ్‌ను తెచ్చుకున్నారాయన. ఎన్టీఆర్ ప్రస్తుతం బాలీవుడ్‌లో 'వార్ 2' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 14న విడుదల కానుంది. ఇటీవలే ప్రశాంత్ నీల్‌తో 'ఎన్టీఆర్ 31' సినిమాను కూడా మొదలుపెట్టారు. ప్రస్తుతం అది షూటింగ్ దశలో ఉంది. ఈ సినిమాల తర్వాత 'దేవర 2' చేయనున్నట్లు టాక్.

త్రివిక్రమ్‌తో నాలుగోసారి



'అలవైకుంఠపురం', 'పుష్ప', 'పుష్ప 2' సినిమాలతో హ్యాట్రిక్ హిట్లు కొట్టారు అల్లు అర్జున్. 'పుష్ప'తో ఉత్తరాది ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నారు ఆయన. ఈ సినిమాకు కొనసాగింపుగా తెరకెక్కిన 'పుష్ప 2' బాలీవుడ్‌లో ఖాన్ త్రయంకు కూడా సాధ్యం కాని రేంజ్‌లో రికార్డులు సృష్టించింది. ప్రస్తుతం త్రివిక్రమ్‌తో ఓ సినిమా చేస్తున్నారు అర్జున్. వీరిద్దరి కలయికలో వచ్చిన మూడు చిత్రాలు హిట్ కావడంతో ఈ సినిమాపై అందరి దృష్టి పడింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ వేసవిలో మొదలుకానుంది. 2026లో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



వీరమల్లుగా...


ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ 2023లో విడుదలైన 'బ్రో' సినిమాతో ప్రేక్షకులను పలకరించారు. ఆయన ప్రస్తుతం మూడు చిత్రాల్లో నటిస్తున్నారు. చారిత్రక నేపథ్యంలో పోరాట యోధుడిగా పవన్ నటిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. మొదటి భాగం 'స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' మార్చి 28న విడుదల కానుంది. సుజీత్ దర్శకత్వంలో ఆయన గ్యాంగ్‌స్టర్‌గా పవన్ నటిస్తున్న 'ఓజీ'.. హరీశ్ శంకర్ దర్శకత్వంలో పోలీసాఫీసర్ పాత్రను పోషిస్తున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రాలు షూటింగ్ దశలో ఉన్నాయి.

తొలి పాన్ ఇండియా చిత్రం



గతేడాది సంక్రాంతికి విడుదలైన 'గుంటూరు కారం'తో అభిమానులను పలకరించారు మహేశ్. ఆయన ప్రస్తుతం ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో ఓ చిత్రంలో నటించనున్నారు. మహేశ్‌కిదే తొలి పాన్ ఇండియా ప్రాజెక్ట్. ఈ నెలలోనే షూటింగ్‌ను ప్రారంభించనున్నట్లు తెలిసింది. దాదాపు రూ. వెయ్యి కోట్ల బడ్జెట్‌తో రెండు భాగాలుగా తెరకెక్కనుంది. 2027లో మొదటి భాగం విడుదల కానుంది.

ఆ టైటిల్‌కు ఓనర్ ఎవరు?



మహేశ్‌బాబు నటించిన 'పోకిరి' టైటిల్‌తో ఇప్పుడు మరో సినిమా వస్తోంది. వరుణ్ రాజ్ ఈ చిత్రానికి హీరో, నిర్మాత కూడా. మమత హీరోయిన్. సినిమాలోని తొలి పాటను విడుదల చేసిన అనంతరం దర్శకుడు వికాస్ మాట్లాడుతూ 'కథ రాసుకున్నప్పుడే 'పోకిరి' టైటిల్ అనుకున్నాం. వేరే పేర్లు పరిశీలించినా ఇదే యాప్ట్ అనుకొని నిర్ణయించాం' అని చెప్పారు. వరుణ్‌రాజ్ మాట్లాడుతూ ' మహేశ్ బాబే 'పోకిరి' టైటిల్‌కు ఓనర్. మేమంతా అభిమానులం మాత్రమే' అన్నారు.

అద్భుతమైన ప్రయాణం



ఇటీవలే 'పుష్ప 2' సినిమాతో ప్రేక్షకులను పలకరించారు రష్మిక మందన్న. ఆమె నటిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టి ఎనిమిదేళ్లయిన సందర్భంగా అభిమానులతో తన ఆనందాన్ని పంచుకున్నారు. "ఈ ఎనిమిదేళ్ల ప్రయాణం ఎంతో అద్భుతంగా ఉంది. ఇంతదూరం వచ్చానంటే.. దానికి మీ ఆదరాభిమానాలు.. ప్రోత్సాహమే కారణం. మనస్ఫూర్తిగా మీ అందరికీ కృతజ్ఞతలు" అని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. కాగా, 2016లో విడుదలైన కన్నడ చిత్రం 'కిరిక్ పార్టీ'తో నటిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టారు రష్మిక. ఆ తర్వాత తెలుగులో 'ఛలో', 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్', 'భీష్మ', 'సీతారామం', 'పుష్ప', 'యానిమల్', 'పుష్ప 2' చిత్రాల్లో నటించారు. 'గర్ల్‌ఫ్రెండ్', 'రెయిన్‌బో', 'ఛావా', 'కుబేర', 'సికందర్' వంటి వరుస చిత్రాలతో కొత్త ఏడాదిలో అభిమానులను పలకరించనున్నారు రష్మిక మందన్న.





మొదటి చిత్రంలో చెరువును తలపిస్తున్న ఈ ప్రాంతంలో జీఏడీ టవర్స్ నిర్మించాల్సి ఉంది. నీటిలో కనిపిస్తున్న ఇనుప చువ్వలు జీఏడీ టవర్స్ పిల్లర్స్‌లో అమర్చినవి. జగన్ పాలించిన ఐదేళ్లలో రాజధాని అమరావతిని పాడు పెట్టడంతో ఈ పిల్లర్స్ ఇలా నీటిలో నానిపోతూనే ఉన్నాయి. తాజాగా భారీ మోటార్లను(రెండో చిత్రంలో) అమర్చి ఆ నీటిని తోడివేసే పనులు నిర్విరామంగా సాగుతున్నాయి.





రాజధాని అమరావతి ప్రాంతంలో జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసాన్ని చక్కదిద్దే పని ఇది. ఐదేళ్లుగా ఈ ప్రాంతాన్ని నిరుపయోగంగా వదిలేయడంతో అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డు వెంబడి చెట్లు అడ్డదిడ్డంగా పెరిగిపోయాయి. జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా ప్రస్తుతం ఆ చెట్లను తొలగించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

అమరావతికి 'టెండర్ల' జోష్!

» నేటి నుంచే టెండర్లకు ఆహ్వానం

» ప్రపంచబ్యాంకు, ఏడీబీ నిధులతో చేపట్టే పనులకు మొదటి టెండర్లు

విజయవాడ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో అభివృద్ధి పనులు పరుగులు పెట్టనున్నాయి. ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) నిధులతో చేపట్టే పనులకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ) తాజాగా టెండర్లు పిలిచింది. 2025 నూతన సంవత్సరం ప్రారంభంలోనే కీలక పనులను తలపెట్టింది. రాజధానిలో ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(ప్రధాన మౌలిక సదుపాయాలు) పనులకు రూ.1206.79 కోట్ల వ్యయంతో రెండు టెండర్లను ఆహ్వానించారు. దీనిలో భాగంగా రహదారులు, మురుగునీటి కాల్వల నిర్మాణం, మంచినీటి సరఫరా, సీవరేజీ పనులు, విద్యుత్-ఐసీటీ యుటిలిటీ డక్ట్స్, రెస్క్యూ వాటర్‌లైన్, అవెన్యూ ప్లాంటేషన్ వంటి పనులు చేపట్టనున్నారు. వీటన్నింటినీ ఒకేసారి పట్టాలెక్కించేలా సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. కాగా, ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టే పనులకు పిలిచిన తొలి టెండర్ ఇదేకావడం విశేషం. ఇక, ప్రపంచ బ్యాంకు ప్రాధాన్యతా పనులలో అమరావతిలో వరదనీటి నిర్వహణ/నివారణ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ పనులను మూడు ప్యాకేజీలలో రూ.1585.96 కోట్ల వ్యయంతో చేపట్టాలని నిర్ణయించారు. వీటికి రానున్న రోజుల్లో వరుసగా టెండర్లను పిలవనున్నారు.

రాజధాని నగరంలో గతంలో తలపెట్టి నిలిచిపోయిన రహదారుల నిర్మాణ పనులను కూడా ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధులతో చేపట్టాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. వీటికి రూ.1500 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలవనుంది. హడ్కో నిధులతో చేపట్టే పనులతో పాటు ప్రపంచబ్యాంకు, ఏడీబీ నిధులతో చేపట్టే పనులు వేర్వేరు అయినప్పటికీ వరుస క్రమంలో టెండర్లు పిలవనుంది. ఈ టెండర్లు జనవరి నెలాఖరు వరకు కొనసాగనున్నాయి.

నేటి నుంచే...

- రాజధాని పనులకు సంబంధించి జనవరి 1 నుంచి ప్రతి రోజూ సీఆర్‌డీఏ టెండర్లను పిలవనుంది. జోన్-1ఏలో నెక్కల్లు, జోన్-1 బీలో నెక్కల్లు(మిగిలిన ప్రాంతం), శాఖమూరు గ్రామాలు, జోన్-2ఏలో అనంతవరం, నెక్కల్లు, నేలపాడు, శాఖమూరు, తుళ్లూరు గ్రామాలు ఉన్నాయి.
- జోన్-2బీలో అనంతవరం, నెక్కల్లు, నేలపాడు, శాఖమూరు, తుళ్లూరు గ్రామాలు, జోన్ -2బీ పార్టు-2లో కొండమరాజుపాలెం, రాయపూడి గ్రామాలలో టెండర్లు పిలవనున్నారు. ప్రపంచబ్యాంకు, ఏడీబీ నిధులతో ఏయే పనులు చేపట్టాలన్నది ముందుగా నిర్దేశించుకున్నారు. ఈ షెడ్యూల్ ప్రకారమే టెండర్లను పిలవనున్నారు.
- భవన నిర్మాణాల పనులు, ఎల్‌పీఎస్ ఇన్ఫ్రా పనులకు కూడా దశలవారీగా టెండర్లను ఆహ్వానిస్తారు.

వరద పనులకు నిధులిలా!

- ప్యాకేజీ-1లో రూ.590.74 కోట్లు.
- ప్యాకేజీ-2లో రూ.386.95 కోట్లు.
- ప్యాకేజీ-3లో రూ.608.26 కోట్లు

టెండర్లు-దరఖాస్తులు ఇలా

- **టెండర్-1:** రూ.603.14 కోట్ల వ్యయంతో అమరావతి రాజధాని నగర పరిధిలోని జోన్-5బీ ప్రాంతంలో అబ్బరాజుపాలెం, బోరుపాలెం, దొండపాడు, రాయపూడి గ్రామాలలో పనులు చేపట్టనున్నారు.
- **టెండర్-2:** రూ.603.65 కోట్ల వ్యయంతో అమరావతి రాజధాని నగర పరిధిలోని జోన్-5డీలో అబ్బరాజుపాలెం, తుళ్లూరు, రాయపూడి గ్రామాలలో పనులు చేపడతారు.
- జనవరి 21వ తేదీ వరకు కాంట్రాక్టర్లు ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో బిడ్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- జనవరి 21వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు బిడ్లను సమర్పించవచ్చు.
- అదే రోజు 4 గంటల తర్వాత సీఆర్‌డీఏ అధికారులు బిడ్లను ఓపెన్ చేస్తారు.

2024లో దురహంకార పాలనకు గుణపాఠం

» ఆంధ్రప్రదేశ్ మళ్లీ ట్రాక్‌లోకి వచ్చింది: మంత్రి సత్యకుమార్



అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): '2024 ఎన్నికల్లో ఏపీ ప్రజలు ప్రజా, అభివృద్ధి వ్యతిరేక, దురహంకార, అవినీతి పాలనకు తగిన గుణపాఠం చెప్పారు. సంఘ వ్యతిరేక శక్తుల్ని దిమ్మ తిరిగేలా తిప్పికొట్టారు' అని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన ఎక్స్‌లో స్పందించారు. 'రాష్ట్ర ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు. రాష్ట్రంలో ఉద్యోగ విప్లవం రావడంతో పాటు యువతకు గౌరవప్రదమైన జీవితాన్ని అందించడం ఖాయం. ప్రజలు ఆకాంక్షించే బంగారు భవిష్యత్తుకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అండగా నిలుస్తారు. 2025లో ప్రజలు ఆరోగ్యంగా, సంపన్నులుగా, సంతోషకరమైన జీవితాన్ని గడపాలి' అని సత్యకుమార్ ఆకాంక్షించారు.

బీసీల అభ్యున్నతికి కృషి చేసేది టీడీపీయే: పల్లా



విశాఖపట్నం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతికి పాటుపడే ఏకైక పార్టీ తెలుగుదేశమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఉదయం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీసీ నాయకులు, అధికారులకు ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలోనే బీసీ సామాజిక వర్గానికి చెందిన విజయానంద్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఇప్పటికే డీజీపీగా మరో బీసీ వ్యక్తి ద్వారకా తిరుమలరావును నియమించింది. టీటీడీ ఈవోగా కూడా బీసీ సామాజిక వర్గానికి చెందిన శ్యామలరావు ఉన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన రామ్మోహన్‌నాయుడుకు కేంద్ర మంత్రి పదవి ఇచ్చి కూటమి ప్రభుత్వం ప్రోత్సహించింది. బీసీ అయిన నన్ను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా చంద్రబాబ నియమించి గౌరవాన్ని ఇచ్చారు. 60 శాతం పదవుల్లో బీసీలకు అవకాశం కల్పిస్తోంది' అని పల్లా అన్నారు.

మద్యం కుంభకోణంలో జగన్‌ను అరెస్టు చేయాలి: మాజీ మంత్రి డొక్కా



అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణం, మైనింగ్ దోపిడీ కేసులను సీబీఐకి అప్పగించాలి. రూ.లక్ష కోట్ల మద్యం కుంభకోణానికి పాల్పడిన జగన్‌రెడ్డిని అరెస్ట్ చేయాలి' అని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'గత ప్రభుత్వం చేసిన అనేక నిర్వాకాలను ప్రజల ముందు తెచ్చి, వారి మన్ననలు పొంది, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. గత ఐదేళ్ల దోచుకున్న జగన్, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలి. జెత్వానీ కేసులో నిందితులైన ముగ్గురు ఐపీఎస్ అధికారులను సస్పెండ్ చేస్తే చాలదు. వారిని ఉద్యోగాల నుంచి తొలగించాలి' అన్నారు. ఎస్సీ వర్గీకరణలో జాబితాల రూపకల్పన ప్రక్రియను మరో వారం పొడిగించాలని డొక్కా ప్రభుత్వాన్ని కోరారు.

సాగునీటి ప్రాజెక్టులు ప్రైవేటుకా?: రామకృష్ణ



కర్నూలు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): 'గోదావరి-బానకచర్ల అనుసంధానం చేసి రాయలసీమలో కరువు, వలసలను శాశ్వతంగా నివారించాలనే సీఎం చంద్రబాబు సంకల్పాన్ని స్వాగతిస్తాం. అయితే ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ ప్రైవేటు సంస్థలకు అప్పగించాలనే ఆలోచన సరైనది కాదు. ఇది ప్రమాదకరమైన నిర్ణయం' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. కర్నూలులో మంగళవారం సీపీఐ శత వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ గోదావరి-బానకచర్ల అనుసంధానాన్ని కేంద్ర నిధులతోనే పూర్తి చేయాలని, లేకుంటే రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టాలన్నారు. అయితే ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే భవిషత్తులో రైతులు నీటిని కొనుక్కోవాల్సి వస్తుందన్నారు. చంద్రబాబులో మళ్లీ పాత ఆలోచనలు పురుడుపోసుకుంటున్నాయన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచేది లేదని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు చార్జీలు పెంచి ప్రజలను మోసం చేశాడని ఆరోపించారు.

జీవో 85 చారిత్రక తప్పిదం: తులసిరెడ్డి

వేంపల్లె, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జగన్‌కు తెలుగు భాషపై ద్వేషం, ఇంగ్లీష్‌పై మోజు ఉంటే తన దినపత్రిక, టీవీ చానెల్‌ను తెలుగు మాధ్యమంలో రద్దు చేసి ఇంగ్లీష్ మాధ్యమంలో నడపాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. మంగళవారం కడప జిల్లా వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ గతంలో జగన్ ప్రభుత్వం జీవో 85ను జారీచేయడం చారిత్రక తప్పిదని, ఆ జీవోను టీడీపీ కూటమి ప్రభుత్వం రద్దు చేయకపోవడం గర్హనీయమన్నారు.

హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్‌గా పద్మనాభం

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్‌గా టి.పద్మనాభం నియమితులయ్యారు. ఇప్పటివరకూ సీఈగా కొనసాగిన జి.వి.ప్రసాద్ మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎస్ఈ కేడర్‌లో అత్యంత సీనియర్ అయిన చిత్తూరు జిల్లా హౌసింగ్ హెడ్ పద్మనాభంను సీఈగా నియమిస్తూ గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.రాజబాబు ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త సీఈగా పద్మనాభం బుధవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

జగన్ పీఏ పేరిట సంగీత మొబైల్స్‌కు టోకరా

» బనశంకరి పోలీస్‌స్టేషన్‌లో కేసు

బెంగళూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ సీఎం జగన్ పీఏ పేరిట సంగీత మొబైల్స్ కంపెనీకి రూ.10.40 లక్షలు టోకరా వేశారు. ఈ వ్యవహారంపై బనశంకరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బెంగళూరు నగరంలోని బనశంకరి రెండో స్టేజ్ సంగీత మొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ కేబీ రాజేశ్ ఫిర్యాదు మేరకు ఐటీ యాక్ట్ కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రెండేళ్ల క్రితం సంగీత మొబైల్స్ మేనేజర్ రాజేశ్‌కు కొత్త నంబరు నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. సీఎం జగన్ పీఏ కేఎన్ నాగేశ్వరరెడ్డిగా అవతలి వ్యక్తి తనను తాను పరిచయం చేసుకున్నాడు. ఏపీ క్రికెటర్ రికీ భుయ్‌కి స్పాన్సర్‌షిప్ అవసరమని, కంపెనీ నుంచి సహకరించాలని కోరారు. అందుకు రూ.10.40 లక్షలు ఖర్చు అవుతుందని, బ్యాంకు ఖాతాకు జమ చేయాలని కోరారు. దీంతో 2022 మే 10, 11తేదీలలో రోజుకు రూ.5.20 లక్షలు చొప్పున మొత్తం రూ.10.40 లక్షలను నాగేశ్వరరెడ్డి ఖాతాలో రాజేశ్ జమ చేశారు. ఆ తర్వాత పలుమార్లు ఫోన్ చేసినా నాగేశ్వరరెడ్డి అందుబాటులోకి రాలేదు. అనుమానం వచ్చి విచారించగా నాగేశ్వరరెడ్డి పేరిట జగన్‌కు పీఏలు ఎవరూ లేరని తేలింది. దీంతో రాజేశ్ 2 రోజులక్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మిలీనియం టవర్లకు మోక్షం!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధం లేని భవనాలనే కోరుకుంటున్నాయి. హిల్ నంబరు 3 మొత్తం సెజ్ పరిధిలో ఉంది. అక్కడే మిలీనియం టవర్లు ఉన్నాయి. కొత్త కంపెనీలను ఆహ్వానిస్తున్నందున వాటికి అనుకూలంగా ఉండేలా ఈ రెండు టవర్లను సెజ్ పరిధి నుంచి డీ నోటిఫై చేయాలని అధికారులు యత్నిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తికాగానే రెండు టవర్లలో ఖాళీగా ఉన్న స్థలాన్ని కొత్త ఐటీ సంస్థలకు కేటాయిస్తారు. దాంతో ఉత్తరాంధ్ర యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశాలున్నాయి.

నాడూ టీడీపీ హయాంలోనే...

తెలుగుదేశం ప్రభుత్వ హయాం (2014-19)లో రుషికొండ ఐటీ పార్కు హిల్ నంబరు 3పై మిలీనియం టవర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఏపీఐఐసీకి బాధ్యతలు అప్పగించారు. టవర్-ఎ, టవర్-బిలను నాలుగు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించేందుకు రూ.145 కోట్లు అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. మొదట రూ.90 కోట్లతో టవర్-1 నిర్మించారు. దానిని 2019 ఫిబ్రవరిలో అప్పటి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. టవర్-ఏ లో మొత్తం పది అంతస్థులు ఉండగా, నాలుగు అంతస్థులను కాండ్యుయెంట్ కంపెనీకి కేటాయించారు. అదేరోజు ఆ సంస్థను ఆయనే ప్రారంభించారు. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం టవర్-ఏ లో మిగిలిన నాలుగు అంతస్థులను ఎవరికీ కేటాయించకుండా ఐదేళ్లు ఖాళీగా ఉంచింది. విశాఖలో పరిపాలనా రాజధాని పెడతామని, అందుకు అవసరమైన కార్యాలయాలు పెట్టుకోవడానికి ఉపయోగించుకుంటామని చెప్పి ఖాళీగా ఉంచేశారు. టవర్-ఏ పక్కనే టవర్-బీ నిర్మాణాన్ని ఏపీఐఐసీ రెండేళ్లలో పూర్తిచేసింది. అందులో మరో 8 అంతస్థులు అందుబాటులోకి వచ్చాయి. వాటిని కూడా వైసీపీ హయాంలో ఎవరికీ కేటాయించకుండా మూడేళ్లు ఖాళీగా ఉంచారు. టవర్-బీ లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖతో 'ప్రీమియం రిజిస్ట్రేషన్ కార్యాలయం' పెట్టించాలని భావించినా కుదర్లేదు. ఈ రెండు టవర్లలో సుమారు 3 లక్షల చదరపు అడుగుల స్థలం ఖాళీగా ఉంది. అడుగుకు రూ.50 అద్దె వేసుకున్నా.. నెలకు రూ.15 లక్షల వరకు అద్దె వస్తుంది.

డీనోటిఫికేషన్ ఎందుకంటే..?

సెజ్‌లో ఏ కంపెనీ పెట్టినా అక్కడ తయారుచేసే ఉత్పత్తులను 100 శాతం ఎగుమతి చేయాలి. అప్పుడే వారికి ప్రభుత్వం నుంచి అన్ని రకాల రాయితీలు అందుతాయి. ఐటీ కంపెనీలు కేవలం విదేశీ ప్రాజెక్టులపైనే ఆధారపడకుండా దేశీయ సంస్థలకూ పెద్ద సంఖ్యలో సేవలు అందిస్తున్నాయి. ఆ వ్యాపారం దక్కాలంటే.. తప్పకుండా సెజ్ బయటే ఉండాలి. అందుకని వాటికి అనుగుణంగా హిల్-3పై కేవలం మిలీనియం టవర్లను మాత్రమే డీనోటిఫై చేయడానికి ఏపీఐఐసీ ఫైల్ పెట్టింది. డీ నోటిఫై అనంతరం టవర్స్‌లో కొత్త కంపెనీలు ఏర్పాటైతే వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

జలహారతికి ప్రపంచబ్యాంకు దన్ను

(మొదటి పేజీ తరువాయి)

అవుతుందని అంచనా వేశారు. ఇతర రాష్ట్రాలతో లింకు పెట్టుకోకుండా.. నదుల అనుసంధానం కింద కాకుండా.. రాష్ట్ర అంతర్గత అనుసంధానం ప్రాజెక్టుగా దీనిని ఆయన ప్రతిపాదిస్తున్నారు. నదుల అనుసంధానం అంటే పొరుగు రాష్ట్రాల అనుమతులు కూడా కావాలి. అంతర్గత అనుసంధానానికి ఆ అవసరం లేదు. అందుబాటులో ఉన్న మిగులు జలాలను కరువు సీమకు మళ్లించడంవరకే ఇది పరిమితం. దీనిపై ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఆయన చర్చించారు. ప్రాజెక్టు డాక్యుమెంటును తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి కూడా పంపించారు. ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్)ను త్వరలో పంపనున్నారు. ఇంకోవైపు.. నిధుల సాధనపై కూడా ఇప్పటి నుంచే దృష్టి పెట్టారు. కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్న ప్రపంచ బ్యాంకు మిగులు నిధులను ఈ ప్రాజెక్టుకు సాధించడానికి ఆయన పూనుకున్నారు. వివిధ ప్రాజెక్టుల కోసం కేంద్రం ప్రపంచ బ్యాంకు నుంచి సమీకరించిన నిధుల్లో ఖర్చు కాకుండా మిగిలిపోయిన మొత్తం సుమారు ఆరు బిలియన్ డాలర్లు ఉన్నట్లు అంచనా. రూపాయల్లో ఈ మొత్తం 51,364 కోట్ల వరకూ ఉంటుంది. ఏదైనా ప్రాజెక్టు కోసం సేకరించిన రుణంలో ఖర్చుకాకుండా మిగిలే నిధులను మరో ప్రాజెక్టుకు వినియోగించుకోవడానికి ప్రపంచ బ్యాంకు నిబంధనలు అనుమతిస్తున్నాయి. ఈ పద్దు కింద ఉన్న నిధులను గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు కోసం సాధించే యోచనలో చంద్రబాబు ఉన్నారు. ఆయన ఇప్పటికే దీనిపై ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రితో సంప్రదింపులు జరిపారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర స్వరూపం ఎలా మారుస్తుందో.. రాష్ట్రానికి ఎంత ఉపయోగకరమో వారికి వివరించారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.40 వేల కోట్ల వరకూ కేటాయించడానికి కేంద్రం సుముఖంగా ఉంది. ప్రపంచ బ్యాంకు మిగులు నిధుల నుంచే ఈ మొత్తం ఇవ్వాలన్న యోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విషయంలో ప్రపంచ బ్యాంకు వర్గాలు కూడా సానుకూల దృక్పథంతో ఉన్నట్లు తెలుస్తోంది. చంద్రబాబు సర్కారు ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేస్తుందని, మంచి ఆలోచనలతో ముందుకు వస్తుందని ఆ వర్గాలు భావిస్తున్నట్లు రాష్ట్రప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. కేంద్రం నుంచి కొంత సానుకూలత వ్యక్తమైన తర్వాతే ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టు వివరాలను బహిర్గతం చేశారు. ప్రస్తుతం దీని సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పన జరుగుతోంది. 3 నెలల్లో సిద్ధంచేసి కేంద్రానికి పంపి.. అనుమతి వచ్చిన 2-3 నెలల్లో టెండర్లు పిలుస్తామని సీఎం చెప్పారు. కేంద్రంతో సత్సంబంధాలు సాగిస్తున్న ఆయన.. కేంద్రం నుంచి నిధులు సాధించి తెస్తారన్న గట్టి నమ్మకంతో అధికార వర్గాలు ఉన్నాయి.

మిగతాది భారీ కాంట్రాక్టు కంపెనీల నుంచి..!

కేంద్రం 40 వేల కోట్లు ఇవ్వగా.. ఇంకా మరో రూ.40 వేల కోట్లు జలహారతి ప్రాజెక్టుకు సమీకరించాల్సి ఉంటుంది. ప్రాజెక్టుల పనులు చేపట్టే భారీ కాంట్రాక్టు సంస్థల నుంచి ఈ నిధులు సేకరించి వాటికి పాతికేళ్లపాటు ఏటా కొంత మొత్తం చెల్లించే నమూనా అమలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం ప్రాథమికంగా అనుకుంటోంది. ఒక పెద్ద కాంట్రాక్టు కంపెనీ ఇప్పటికే కొంత ఆసక్తి చూపి అధ్యయనం చేస్తోంది. ఒక సంస్థ వల్ల కాకపోతే రెండు, మూడు ఏజెన్సీలను కలిపి కన్సార్షియంగా ఏర్పాటు చేసి నిధులు సమీకరించాలని సీఎం అనుకుంటున్నారు.

ప్రకాశం బ్యారేజీకి ప్రత్యామ్నాయం!

జలహారతి ప్రాజెక్టు తొలిదశలో పోలవరం కుడి కాలువ నుంచి గోదావరి జలాలను విజయవాడ నగరంలోని ప్రకాశం బ్యారేజీలోకి తరలించాలని.. అక్కడి నుంచి నాగార్జునసాగర్ కుడికాలువకు తీసుకెళ్లి కొత్తగా నిర్మించే బొల్లాపల్లి రిజర్వాయరును నింపాలని తొలుత అనుకున్నారు. అయితే ఇప్పుడు అధికారులు ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తున్నారు. బ్యారేజీలోకి కాకుండా మరో మార్గం ద్వారా నీటిని తీసుకెళ్లాలని యోచిస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి 60 కిలోమీటర్ల దూరంలో నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాలువ ఉంది. అందులోకి గోదావరి జలాలను తీసుకెళ్లాలి. ఇప్పుడు సాగర్ కాలువ ప్రవాహ సామర్థ్యం పది వేల క్యూసెక్కులు మాత్రమే ఉంది. దీనిని 30 వేల క్యూసెక్కులకు విస్తరించాలని తాజాగా భావిస్తున్నారు. గోదావరి జలాలు కలిసే చోటు నుంచి కాలువను వెడల్పు చేయాలనేది యోచన.



డయాఫ్రం వాల్ పనులు వాయిదా

» ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్చర్‌ను నిపుణులు ఆమోదించాకే అనుమతి

» కేంద్ర జలసంఘం స్పష్టీకరణ

» 4 నమూనాలు పంపిన జలవనరుల శాఖ

» క్రిస్మస్ సెలవుల్లో నిపుణులు.. స్పందన కరువు

» 7-10 తేదీల మధ్య వారితో వీడియో కాన్ఫరెన్సు

అమరావతి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణానికి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. పనుల ప్రారంభానికి కేంద్ర జలసంఘం ఇంకా పచ్చజెండా ఊపలేదు. విదేశీ నిపుణుల నుంచి ఆమోదం రాకపోవడమే దీనికి కారణం. దీంతో గురువారం నుంచి మొదలవ్వాల్సిన పనులు వాయిదాపడ్డాయి. వాల్ నిర్మాణం కోసం జర్మన్ కాంట్రాక్టు సంస్థ బావర్ అవసరమైన యంత్ర సామగ్రిని, అనుభవజ్ఞులైన ఇంజనీరింగ్ సిబ్బందిని సిద్ధం చేసుకుంది. నిర్మాణ పనులను జనవరి 2 నుంచి ప్రారంభించి నవంబరు నాటికి పూర్తిచేయాలని ముందస్తుగా నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి తాను హాజరవుతానని సీఎం చంద్రబాబు సైతం చెప్పారు. కానీ ఇప్పటిదాకా కేంద్ర జల సంఘం నుంచి గ్రీన్ సిగ్నల్ అందలేదు. వాల్ నిర్మాణంలో కీలకభూమిక వహించే ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్చర్‌పై విదేశీ నిపుణులు.. డేవిడ్ బ్రియాన్ పాల్, జియాన్ ఫ్రాంకో డి సిక్కో (అమెరికా), సీన్ హించ్‌బెర్గర్, చార్లెస్ రిచర్డ్ డొనెల్లీ(కెనడా)తో కూడిన బృందం ఆమోదం పొందాల్సిందేనని జల సంఘం స్పష్టం చేసింది. జల వనరుల శాఖ ఇప్పటికే నాలుగు ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్చర్ల నమూనాలను సిద్ధం చేసి నిపుణులకు పంపింది. వాటిని పరిశీలించాల్సిన వారు ప్రస్తుతం క్రిస్మస్ వేడుకల్లో ఉన్నారు. జల సంఘం, పీపీఏ, జల వనరుల శాఖ ఎంత ప్రయత్నించినా వారి నుంచి సమాధానం రాలేదు. దీంతో.. గురువారం నుంచి ప్రారంభం కావలసిన డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు వాయిదా పడ్డాయి. నిపుణులు అందుబాటులోకి వస్తే.. జనవరి 7-10 తేదీల మధ్య వీడియో కాన్ఫరెన్సులో వారితో సంప్రదింపులు జరిపి.. కాంక్రీట్ మిక్చర్‌పై నిర్ణయానికి వస్తామని జల వనరులశాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో వాల్ నిర్మాణ పనులు ఈ నెల మూడో వారం నుంచి ప్రారంభమయ్యే వీలుందని అధికారులు చెబుతున్నారు.

నిపుణులకూ అనుభవం లేదు!

డయాఫ్రం వాల్ ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్చర్‌పై విదేశీ నిపుణుల ఆమోదం పొందాలని కేంద్ర జల సంఘం చెబుతోంది. అయితే ఈ మిక్చర్ విషయంలో వారికి కూడా అనుభవం లేదని కేంద్ర జలశక్తి శాఖ వర్గాలు అంటున్నాయి. ఈ విషయంలో కాంట్రాక్టు సంస్థ బావర్‌కు మాత్రమే విశేషానుభవం ఉందని ఇంజనీరింగ్ వర్గాలు చెబుతున్నాయి. అయినప్పటికీ విదేశీ నిపుణుల ఆమోదం పొందాకే పనులు ప్రారంభించాలని జల సంఘం ఆదేశించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

మద్యం లైసెన్సీలకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 10 శాతం మద్యం షాపులను గీత కులాలకు కేటాయించడంపైనా చర్చించారు. వారం రోజుల్లో షాపుల కేటాయింపుపై నోటిఫికేషన్ జారీచేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. అంటే 340 షాపులు గీత కులాలకు దక్కుతాయి. వారికి 50 శాతం లైసెన్స్ ఫీజుతోనే షాపులు కేటాయిస్తారు. కల్లు గీతపై ఆధారపడే గౌడ, యాత, సోంది, శెట్టిబలిజ, ఈడిగ, గామల్ల, కలాలీ, శ్రీశయన, శెడిగ, గౌండ్ల కులాలకు వీటిని కేటాయిస్తారు. ఒకరికి ఒక షాపు మాత్రమే కేటాయిస్తారు. ఈ షాపుల కాలపరిమితి 2026 సెప్టెంబరు 30 వరకు ఉంటుంది.

ఆదాయం తక్కువొచ్చినా సరే..

క్వార్టర్ రూ.99 మద్యం అందుబాటులోకి తేవడంతో అనుకున్న స్థాయిలో ఆదాయం రావడం లేదని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. 21 శాతం అమ్మకాలు అవే ఉన్నాయన్నారు. 72 శాతం అమ్మకాలు జరుగుతున్న 19 రకాల బ్రాండ్ల ధరలు తెలంగాణ కంటే మన వద్దే తక్కువని తెలిపారు. ప్రభుత్వానికి ఆదాయం తగ్గినా తక్కువ రేటు మద్యం అన్ని చోట్లా అందుబాటులో ఉంచాలని సీఎం స్పష్టంచేశారు. అలాగే బెల్టు షాపుల విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. మద్యం తయారీ, సరఫరా, అమ్మకాలను టెక్నాలజీ ద్వారా పర్యవేక్షించాలని.. ఇతర రాష్ట్రాల మద్యం, నకిలీ మద్యం రాకుండా చూడాలని చెప్పారు. గత ఆరు నెలల్లో బెల్టులపై 8,842 కేసులు నమోదుచేసి, 26వేల లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. బెల్టులకు మద్యం అమ్మిన షాపులపైనా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. నాటుసారా నియంత్రణకు నవోదయం 2.0 పేరుతో జనవరి నుంచి కొత్త కార్యక్రమం ప్రారంభిస్తున్నామని అధికారులు చెప్పారు. సమీక్షలో ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, ఉన్నతాధికారులు ఎంకే మీనా, నిషాంత్ కుమార్, రాహుల్‌దేవ్‌శర్మ పాల్గొన్నారు.

జీఎస్టీ చెల్లింపుల్లో అక్రమాలకు చెక్

» నేటి నుంచి రిజిస్ట్రేషన్లకు బయోమెట్రిక్ ఫేస్ అథంటికేషన్

అమరావతి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడుతున్న వారికి చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్రంలో అనేక వాణిజ్య సంస్థలు, వ్యాపారులు నకిలీ ఆధార్ కార్డులు, ఇతర గుర్తింపు పత్రాలతో ఆన్‌లైన్‌లోనే జీఎస్టీ రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. ఆ జీఎస్టీ నంబరుతో కొంతకాలం సక్రమంగా పన్ను చెల్లించడం... ఆ తర్వాత నుంచి నకిలీ వ్యాపారాలతో బురిడీ కొట్టిస్తూ ప్రభుత్వానికి రూ.కోట్లలో పన్ను ఎగవేతకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఉదంతాలు అధికారుల తనిఖీల్లో కోకొల్లలుగా వెలుగులోకి వస్తున్నాయి. నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)తో దుర్వినియోగాలకూ పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో జీఎస్టీ రిజిస్ట్రేషన్ దశలోనే అక్రమార్కులను గుర్తించేందుకు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్) సహకారంతో బయోమెట్రిక్ ఫేస్ అథంటికేషన్ విధానాన్ని బుధవారం నుంచి అమలులోకి తీసుకువస్తోంది. నకిలీ ఆధార్ కార్డులు, పత్రాలను గుర్తించేందుకు ఈ టెక్నాలజీ తోడ్పడుతుందని వాణిజ్య పన్నులశాఖ చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబు వివరించారు. రాష్ట్రంలోని 12 జీఎస్టీ సేవా కేంద్రాల్లో పన్ను చెల్లింపుదారుల వేలిముద్రలు లేదా ఐరిస్ స్కానర్‌ను ఉపయోగించి బయోమెట్రిక్ ప్రామాణికతను పరిశీలిస్తారు. పన్ను చెల్లింపుదారులకు మరింత సులువుగా ఉండేలా ఆండ్రాయిడ్ డివైజ్ (సెల్‌ఫోన్లు లేదా ట్యాబ్‌లు)లకు అనుసంధానించేందుకు వీలుగా జీఎస్‌టీఎన్ ప్రత్యేక మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేసింది. ఇక మీదట జీఎస్టీ కేంద్రాల్లో ఇతర పరికరాలతో పనిలేకుండా ఈ కొత్త యాప్ ద్వారానే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేస్తారు. కాగా, జీఎస్టీ రిజిస్ట్రేషన్లకు సంబంధించి బయోమెట్రిక్ పరిశీలన ప్రక్రియను గతంలో మూడు దశలుగా నిర్వహించేవారు. ఇప్పుడు కొత్తగా ప్రవేశపెట్టిన బయోమెట్రిక్ వెరిఫికేషన్ విధానంలో రెండు దశల్లోనే పూర్తి చేయనున్నారు. దరఖాస్తుదారుల బయోమెట్రిక్ వివరాలన్నీ ఫేస్ అథంటికేషన్ విధానం ద్వారా పరిశీలిస్తారు.



మెరుపులు కొన్ని... మరకలు కొన్ని! తీపి జ్ఞాపకాలు కొన్ని... చేదు గుణపాఠాలు కొన్ని! ఏడాదిలోని రోజుల లెక్క అందరికీ ఒకటే! కానీ... ఏడాది గడిచిన తీరు మాత్రం అందరికీ ఒకటిగా ఉండదు! అయినప్పటికీ... కొందరుంటారు! కాల ప్రవాహంలో కొట్టుకుపోకుండా... మంచిని చూస్తారు! మాటలకే పరిమితం కాకుండా మంచి చేతలూ చేస్తారు. సొంతలాభం కొంత మానుకోవడమే కాదు... సొంత సొమ్ములు ఖర్చు పెట్టి మరీ మానవ సేవలో నిమగ్నమవుతారు. సాటి మనుషులు కష్టాల కన్నీళ్లను తుడిచేందుకు ముందుంటారు. కొత్త ఏడాదిని సరికొత్తగా ప్రారంభిస్తున్న ఈ తరుణంలో... కొన్ని మంచి మాటలు, కొందరు మంచి వాళ్ల ఊసులు! మీకోసం!

హ్యాపీ న్యూ ఇయర్!

అర్ధరాత్రి కేక్ కోసి... హ్యాపీ న్యూ ఇయర్ అని గట్టిగా అరవగానే జీవిత చిత్రం మొత్తం మారిపోదు! ఇప్పుడు మారేది క్యాలెండర్ మాత్రమే! నిజంగా జీవితం 'హ్యాపీ'గా ఉండాలంటే... కొన్ని పద్ధతులు మార్చుకోవాలి! కొన్ని విడిచిపెట్టాలి! దీనికోసం ఘోర తపస్సులు చేయక్కర్లేదు! అప్రమత్తత, జాగ్రత్తతో ఆర్థికంగా, ఆరోగ్యంగా 'హ్యాపీ'...




ఆరోగ్యంతో ఆనందం!

ఆరోగ్యమే మహా భాగ్యం! దానిని కాపాడుకుంటేనే ఆనందం! నిత్యం వ్యాయామం, మంచి ఆహారం, సరైన నిద్ర... ఈ మూడూ పాటిస్తే జీవన శైలికి సంబంధించిన వ్యాధులను చాలావరకు దూరంగా పెట్టొచ్చు. అనుకోకుండా అనారోగ్యంతో ఆస్పత్రి పాలైతే... బిల్లులతో గుండె గుభేల్‌మంటుంది. అనారోగ్యానికి చికిత్స చేయించుకునే క్రమంలో ఆర్థిక ఆరోగ్యం కోలుకోలేనంతగా దెబ్బతినే ప్రమాదముంది. అందుకే... కుటుంబం మొత్తానికి తగిన మొత్తంలో ఆరోగ్య బీమా ఉండేలా చూసుకోవాలి. ఆనందంగా ఉండండి... ఆరోగ్యంగా ఉండండి!

'డిజిటల్ వల'లో పడొద్దు!



ఇది 'స్మార్ట్'లోకం! కనిపించకుండానే 'స్మార్ట్'గా మాటేసే కాలం! మీ చేతిలోని స్మార్ట్ ఫోన్‌తోనే మిమ్మల్ని బురిడీ కొట్టిస్తారు! డిజిటల్ అరెస్టులు, తప్పుడు లింకులపై క్లిక్‌లు, ఓటీపీతో వేట... ఇలా ఒకటా, రెండా! రోజుకో మార్గంలో డిజిటల్ మోసాలు జరుగుతున్నాయి ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ఖాతాలు ఖాళీ అయిపోతాయి! 2024లో మన రాష్ట్రంలో ఏకంగా 1229 కోట్ల రూపాయలను సైబర్ నేరగాళ్లు కొట్టేశారు. ఇందులో కేవలం రూ.225 కోట్లను మాత్రమే పోలీసులు 'ఫ్రీజ్' చేయగలిగారు. మిగిలిన మొత్తమంతా గోడకు కొట్టిన సున్నమే! అనుమానాస్పద కాల్స్‌తో జాగ్రత్తగా ఉండండి! డిజిటల్ అరెస్టు అనగానే భయపడిపోకండి! మీ సిమ్ కార్డును బ్లాక్ చేసేస్తాం, డెబిట్ కార్డును రద్దు చేస్తాం, క్రెడిట్ పాయింట్లకు కాలం చెల్లుతోంది... అని ఎవరైనా ఫోన్ చేశారంటే! అది ఫేక్! డిజిటల్ అరెస్టు మోసాలపై ప్రధాని మోదీ కూడా జాగ్రత్తలు చెప్పారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు! మీ అప్రమత్తతే మీ సొమ్ములకు శ్రీరామ రక్ష!



వనమే.. ప్రాణం

దినసరి కూలీగా జీవనం సాగిస్తున్న అంకారావు.. ప్రకృతిపైన ప్రేమతో వనాలను పెంచడానికి తన సర్వస్వాన్ని ధారపోస్తున్నారు. నిరక్షరాస్యుడైనా చదువుకున్న వాళ్ల కంటే ఎక్కువగా ప్రకృతిని అధ్యయనం చేశారు. వనాల సంరక్షణకు నిర్విరామకృషి చేస్తున్న అంకారావును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి. ఎవరికి వారు మనకెందుకులే అని ఊరుకుంటే భవిష్యత్తులో ప్రాణవాయువును కొనుక్కునే పరిస్థితి వస్తుంది. సొంత పనులు కోసం సమయం కేటాయిస్తూనే.. కనీసం వారంలో ఒక్కరోజైనా పర్యావరణం, అడవులు పెంపొందించడంపై శ్రద్ధ చూపితే ప్రకృతి సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుంది. కొత్త సంవత్సరంలో అయినా వన సంరక్షణకు ప్రజలంతా నడుంకడితే.. భవిష్యత్తుకు భరోసా ఉంటుంది.

నల్లమలలో పచ్చదనం... అంకారావు అందరికీ ఆదర్శం

విచ్చలవిడిగా అడవుల నరికివేత ప్రాణికోటికి ప్రమాదం అని 45 ఏళ్ల కొమ్మెర అంకారావు.. అలియాస్ జాజి గుర్తించారు. మొక్కలు పెంచడాన్ని, పక్షులను కాపాడడాన్ని తన వృత్తిగా ఎంచుకున్నారు. 30 ఏళ్లుగా నల్లమల ప్రాంతంలో అడవులను కాపాడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా కారంపూడి సమీపంలోని నల్లమల ప్రాంతానికి చెందిన ఆయన.. స్థానిక గిరిజనులతో కలిసి అడవిలో చెట్లు పెంచేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. చెట్లు నరికివేత కారణంగా కారంపూడి సరిహద్దుల్లో అడవి అంతరించిపోతుంది. అంకారావు ప్రయత్నాల వల్ల తిరిగి పచ్చదనం సంతరించుకుంటోంది. నాం, నల్లవేప, చింత విత్తనాలను నాటుతున్నారు. వాటి ద్వారా భవిష్యత్‌లో కలప, చింతపండు వంటి ఉత్పత్తులతో గిరిజనులకు ఆదాయం రానుంది.

తనకున్న ఎకరం పక్షుల కోసమే...

తనకున్న ఎకరం పొలంలో అంకారావు జొన్న, సజ్జ వంటివి పండిస్తూ పక్షులకు ఆహారాన్ని అందిస్తున్నారు. ఇక్కడికి రోజూ రామ చిలుకలు, పావురాళ్లు, పిచ్చుకలు, గోరింకలు వంటివి వచ్చి సందడి చేస్తాయి. నిజానికి అంకారావుకి సరైన ఆదాయం లేదు. నెలలో కొన్ని రోజులు దినసరి కూలీగా పనిచేస్తారు. దాంతో పాటు అడవుల్లో లభించే వన మూలికలు అమ్మి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కుటుంబసభ్యుల సహకారంతో తన ఆదర్శవంతమైన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

అనారోగ్యానికి అడవే మందు...

చిన్నతనంలో అంకారావు అనారోగ్యంతో బాధపడుతుండేవారు. వ్యవసాయ కూలీలైన తల్లిదండ్రులు దూరప్రాంతాలకు తీసుకెళ్లి వైద్యం చేయించలేని పరిస్థితి. సమీపంలోని అడవిలో దొరికే వనమూలికలతోనే వైద్యం చేసేవారు. ఈ క్రమంలో వనమూలికలు, వాటి ఉపయోగాల గురించి అంకారావు తెలుసుకున్నారు. అలా ఆయనకు అడవులపై మమకారం పెరిగింది. అడవుల్లో తిరగడం వల్లే తన ఆరోగ్యం మెరుగుపడిందని ఆయన చెబుతుంటారు. ఓ రోజు అడవిలో విష సర్పం కాటేస్తే వనమూలికలతోనే బయటపడ్డానని వివరించారు. తన జీవితంలో నల్లమల అడవులను విస్తరింపజేయాలనేది ఆయన కల. ప్రకృతిని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుందని ఆయన నమ్మకం. అందుకే పాఠశాలలకు వెళ్లి పర్యావరణంపై విద్యార్థులకు ఉపన్యాసాలు ఇస్తారు. విద్యార్థులతో సీడ్ బాల్స్ తయారు చేయించి అడవుల్లో చల్లుతున్నారు. అంతేగాక పర్యాటకులు వదిలి వెళుతున్న వ్యర్థాలతో అడవి జంతువుల ప్రాణాలు పోతున్నాయని గుర్తించిన ఆయన.. ఆ వ్యర్థాలను ఏరివేయడంలోనూ తనవంతు కృషి చేస్తున్నారు. పర్యాటకులు వదిలివెళ్లిన మందు బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు, కవర్లు ప్రతిరోజు ఏరివేసి అడవికి దూరంగా తరలిస్తున్నారు.

-మాచర్లటౌన్, ఆంధ్రజ్యోతి



పర్యాటకులు వదిలివెళ్లిన బాటిళ్లను సేకరించిన అంకారావు



విష్ యు హ్యాపీ జర్నీ!

అడ్డదిడ్డంగా బండి నడిపేవాళ్లు... రోడ్ల పక్కన ప్రమాదకరమైన రీతిలో లారీలు, ట్రక్కులు ఆపేవాళ్లు... నిర్లక్ష్యంగా, అతివేగంతో డ్రైవింగ్ చేసేవాళ్లు... నిద్ర ముంచుకొస్తున్నా స్టీరింగ్ వదలని వాళ్లు! వీళ్లే... 'రోడ్ ఇడియట్స్'! ఒకటి... ఈ జాబితాలో ఉండకండి! రెండు... ఈ జాబితాలో ఉన్న వాళ్లతో జాగ్రత్తగా ఉండండి! హెల్మెట్, సీట్ బెల్టు, ఇతర రహదారి నిబంధనలన్నీ పాటిస్తేనే జర్నీ హ్యాపీగా జరుగుతుంది! 2024 సంవత్సరంలో రాష్ట్రంలో 7315 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 7863 మంది రోడ్లకు బలైపోయారు! అంటే... సగటున రోజుకు 21 మంది! అన్యాయమైన, అకారణమైన చావులు ఇవి! 'విజయవాడలో వాహనదారులకు క్రమ శిక్షణ లేదు' అని స్వయంగా హైకోర్టు ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. 'మన దేశ పౌరులకు చట్టాలంటే గౌరవం లేదు' అని కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ వాపోయారు! ఎవరో చెప్పారని కాదు... మన కోసం, మన కుటుంబం కోసం రహదారులపై భద్రంగా ప్రయాణిద్దాం! విష్ యూ హ్యాపీ అండ్ సేఫ్ జర్నీ!

డిజిటల్ డిటాచ్‌మెంట్!



మనసు విప్పి మాట్లాడుకుంటే బంధాలు బలపడతాయి! కానీ... కుటుంబంలో ఒకరికొకరు మాట్లాడుకునే సమయాన్ని స్మార్ట్ ఫోన్లు, టీవీలు మింగేస్తున్నాయి. ఇన్‌స్టా రీల్స్, ఫేస్‌బుక్ స్టోరీస్, వాట్సాప్ స్టేటస్, యూట్యూబ్ షార్ట్స్ చూడటంలో ఇంటిల్లిపాదీ బిజీ! చేతిలో స్మార్ట్ ఫోన్ పెడితేగానీ నోట్లో ముద్ద పెట్టుకోని చిన్నారులు! అన్నీ పక్కన పెట్టేసి.. ఫోన్‌లో తలదూర్చేసే పెద్దలు! ఇదో 'డిజిటల్' వల! ఇది మానవ సంబంధాలనే కాదు... మానసిక ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తోంది! దీనికి మందు... 'డిజిటల్ డిటాచ్‌మెంట్'! అంటే... అవసరమైనప్పుడు, అవసరమైన మేరకే ఫోన్‌ను చూడటం! నిర్దిష్టంగా కొన్ని సమయాల్లో ఫోన్‌ను చూడొద్దు అని తీర్మానం చేసుకోవాలి. అంటే... భోజనం చేస్తున్నప్పుడు, బాత్ రూమ్‌లో, బెడ్ రూమ్‌లో, సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి ఉన్నప్పుడు, మిత్రులను కలిసినప్పుడు ఫోన్ అస్సలు చూడొద్దు! ఇలా ప్రయత్నించి చూడండి! 'హ్యాపీ'గా ఉంటుంది!

పుడమి పులకింత..

విత్తన బంతులతో విశాఖలో పచ్చదనం

వృక్షో రక్షతి..

ఓ పక్క సాగర తీరం.. మరోపక్క వన హారం.. ఇవి విశాఖకు ప్రత్యేకం. నగరం మధ్యలో నల్లతాచులా ఉండే జాతీయ రహదారిపై వెళుతుంటే.. పక్కనే ఏపుగా పెరిగిన చెట్లు స్వాగతం పలుకుతుంటే.. ఆ ప్రయాణమే ఆహ్లాదం. అయితే పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్న నగరాన్ని కాలుష్యం కమ్మేస్తోంది. 'మొక్కలు నాటాలి...పచ్చదనం పెంచాలి' అనే నినాదం కొంతకాలం క్రితం ఊపందుకుంది. అప్పుడే గ్రీన్ క్లైమేట్ బృందం రంగంలో దిగింది. అంతకు ముందే ఆ సంస్థ విత్తన బంతులు తయారుచేసి, మొక్కలు పెరగడానికి అనువైన ప్రాంతాల్లో వెదజల్లేది. ఎప్పుడైతే ప్రభుత్వం మొక్కలు పెద్ద సంఖ్యలో పెంచాలని నిర్ణయించిందో.. దానికి విత్తన బంతులే సరైన మార్గమని గ్రీన్ క్లైమేట్ ఎన్‌జీఓ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం.. అధికారులను కలిసి వివరించారు. వారికి అది నచ్చడంతో కార్యాచరణ సిద్ధం చేశారు. మహా విశాఖ నగర పాలక సంస్థ, తూర్పు నౌకాదళం, విశాఖ మహా నగర అభివృద్ధి సంస్థ, విజయ నిర్మాణ్, రోటరీ క్లబ్ ఇలా అనేక ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు సాయం చేశాయి. దాంతో లక్షల సంఖ్యలో విత్తన బంతులు తయారుచేసి నగరం నలుమూలలా, కొండలపైనా వెదజల్లారు. దాని ఫలితంగా ఇప్పుడు నగరంలో ఏ కొండ చూసినా పచ్చదనంతో కళకళలాడుతోంది. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఒక్కో విద్యార్థికి ఒక్కో మొక్క


ఆ బడిలో పచ్చగా పెరుగుతున్న బాల్యం

శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం తగరకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో 203 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ బడిలో పుట్టిన రోజు వేడుకలకు కేక్ కట్ చేయడం, స్వీట్లను పంచడం వంటివి ఉండవు. పుట్టిన రోజున పాఠశాల ఆవరణలో ఆ విద్యార్థితో మొక్కను నాటిస్తారు. దాని సంరక్షణ బాధ్యతను ఆ విద్యార్థికే అప్పగిస్తారు. ఇలా ఒక్కొక్క మొక్క పెరిగి.. పాఠశాల ఆవరణ ఇప్పుడు వనాన్ని తలపిస్తోంది. ఈ బడి ఆవరణలోని ఖాళీ స్థలంలో కూరగాయలను సాగు చేస్తున్నారు. వాటిని పాఠశాల మధ్యాహ్న భోజనం తయారీలో వినియోగిస్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి వారానికి రెండు రోజులు పాఠశాలలో మొక్కలకు నీరు పోస్తారు. చెట్ల కింద రాలిపోయిన ఆకులను తొలగించి.. శుభ్రపరుస్తారు. ఇలాంటి బడి ఆవరణలో పిల్లలు పచ్చగా ఎదగడంలో ఆశ్చర్యం ఏముంది!

మద్యం ముట్టని గ్రామం..!

15 ఏళ్లుగా మద్యానికి దూరంగా వెల్లలూరు

ఆ గ్రామం ఒకనాడు ఫ్యాక్షనిజంతో అట్టుడికేది. నిత్యం గొడవలు.. హత్యలతో భయానక వాతావరణం కనిపించేది.. ఆ గ్రామం పేరు చెబితే పోలీసులు, ఉన్నతాధికారులు సైతం ఉలిక్కిపడేవారు.. అలాంటి గ్రామం నేడు.. ఓ మహనీయుడి ఆశయాలకు అనుగుణంగా మద్యానికి దూరంగా ఉంటూ గ్రామ స్వరాజ్యం వైపు అడుగులు వేస్తోంది. 15 ఏళ్లుగా కక్షలు, కార్పణ్యాలను పక్కనబెట్టిన ప్రజలు శాంతి బాటలో పయనిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆ గ్రామం గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గంలోని వెల్లలూరు కాగా.. ఆ ఊరిని మార్చిన మహనీయుడు.. విశ్రాంత న్యాయమూర్తి అంబటి లక్ష్మణరావు. 15 ఏళ్ల క్రితం వరకు ఈ గ్రామంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన బంధువర్గం స్వల్ప కారణాలతో తగాదాలు పడేవారు. ఆ గొడవలు ఒకరినొకరు చంపుకొనే దాకా వెళ్లాయి. దీంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతకాల్సి వచ్చేది. పోలీసు కేసులతో యువత జీవితాలు నిర్వీర్యం అయ్యేవి. ఈ పరిస్థితులను చూసి చలించిన వెల్లలూరు గ్రామానికి చెందిన జస్టిస్ లక్ష్మణరావు గ్రామ స్వరాజ్యానికి శ్రీకారం చుట్టారు. అన్ని వర్గాలవారినీ సమావేశపరిచి సుదీర్ఘంగా చర్చించారు. పోలీసు కేసులతో యువత నిర్వీర్యం అవుతోందని, కక్షలు, ముఠా తగాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తే అశాంతి తొలగిపోతుందని నచ్చచెప్పారు. అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన అంబటి లక్ష్మణరావు మాటలు వారిని ఆలోచింపజేశాయి. ఆ నాటి నుంచి గ్రామంలో మద్యపాన నిషేధానికి అడుగులు పడ్డాయి. లక్ష్మణరావుపై ఉన్న గౌరవంతో ఊరంతా ఆయన వైపు నిలబడింది. ప్రజలను దైవమార్గంలో నడిపించేందుకు గ్రామంలోని ఆలయాలను అభివృద్ధి చేశారు. 15 ఏళ్లుగా గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహించకుండా చర్యలు తీసుకున్నారు. గ్రామంలో విభేదాలకు రాజకీయ పార్టీలు కారణమని గుర్తించి... స్థానిక సంస్థల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగేలా జస్టిస్ లక్ష్మణరావు కృషి చేశారు. ఊరిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామానికి దూరంగా ఇతర ప్రాంతాల్లో బాగా స్థిరపడిన వారిని గుర్తించి వారు జన్మభూమి రుణం తీర్చుకునేలా గ్రామ అభివృద్ధిలో వారినీ భాగస్వాములను చేశారు. రైతుల సమస్యలపై నిరంతర పోరాటం సాగించారు. అంబటి లక్ష్మణరావు ఇటీవల మృతి చెందినప్పటికీ ఆయనకు ఇచ్చిన మాటమేరకు గ్రామంలో నేటికీ మద్యం అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. - పొన్నూరు టౌన్, ఆంధ్రజ్యోతి



వెల్లలూరు గ్రామం, జస్టిస్ అంబటి లక్ష్మణరావు (ఫైల్)

మానవ సేవే..

మానవత్వం ఆ పోలీస్ తత్వం

'కరుణ'తో అనాథ శవాలకు అంతిమయాత్ర



అనాథ శవాన్ని మోస్తున్న కరుణాకర్ తదితరులు, కరుణాకర్ (ఫైల్)

సొంత వారు మరణిస్తేనే కొంతమంది శవం దగ్గరకు వెళ్లేందుకు ఆలోచిస్తుంటారు. అలాంటిది 25 సంవత్సరాలుగా అనాథ శవాలకు అంతిమ సంస్కారాలు చేస్తూ మానవత్వం బతికేవుందని నిరూపిస్తున్నారు చిత్తూరుకు చెందిన ఏఆర్ ఎస్‌ఐ ఆర్.కరుణాకరన్ (కంద). 2000వ సంవత్సరంలో చిత్తూరులో ఒక హిజ్రా మరణిస్తే అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు ఎవరూ ముందుకురాకపోవడంతో కరుణాకర్ ఆమెకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అప్పుడే చిత్తూరు సంతపేటలో మాతృసేవా సమితి సేవా సంస్థను నెలకొల్పారు. అప్పటి నుంచి 25 ఏళ్లుగా సుమారు 700 అనాథ మృతదేహాలకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఇక సంతపేటలో 2017లో అప్పటి ఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్ చేతులమీదుగా నిత్య అన్నదాన సేవానిలయ ఆశ్రమాన్ని ప్రారంభించారు. నేటికీ పేదలకు రోజూ అన్నదానం చేస్తున్నారు. తన భార్య దేవి, కుమారుడు సాయిధనుష్, కుటుంబ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు కరుణాకర్. అనాథ శవాల అంతిమ సంస్కారాల కోసం 9391665281లో సంప్రదించవచ్చు.

-చిత్తూరు సిటీ, ఆంధ్రజ్యోతి

చిన్న ఆదాయం.. పెద్ద ఆదర్శం

▸▸ సైకిల్ షాప్ ఆదాయంతో నిత్యాన్నదానం



అన్నదానం చేస్తున్న రవికుమార్ (ఆకుపచ్చ చొక్కా)

సొంత లాభం కొంత మానుకొని..

శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణానికి చెందిన రవికుమార్ సైకిల్‌షాప్ నడుపుతున్నారు. ఆ షాపులో వచ్చే ఆదాయంతో సంసారాన్ని నెట్టుకురావడమే కష్టమే. అలాంటిది పంక్చర్లు వేయడం ద్వారా వచ్చే కొద్ది సంపాదనను జాగ్రత్తగా పొదుపు చేస్తూ, వందలాదిమంది ఆకలి తీర్చుతున్నారు. రవికుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రవికుమార్ సైకిల్ షాప్ వద్దకు నిత్యం గ్రామీణ ప్రజలు వస్తుంటారు. ఇతర పనులపై, ఆస్పత్రులకు వచ్చే వారూ ఉండేవారు. వారిలో పేదలు ఆకలి బాధలు పడటం రవికుమార్ గమనించాడు. ఒక్క ఇడ్లీ తినాలంటే హిందూపురంలో రూ.10 వెచ్చించాలి. భోజనం చేయాలంటే రూ.100. అంత ఖర్చు భరించలేని పేదలు ఆకలితోనే పనులు పూర్తి చేసుకుని ఊళ్లకు వెళ్లడం గమనించాడు. తనకు ఉన్నంతలో వారి ఆకలి తీర్చాలనే ఆలోచన వచ్చింది. అలా మొదలై.. రోజుకు 200 నుంచి 300 మందికి అన్నం పెట్టేదాకా వెళ్లింది. తన సైకిల్ షాప్ వద్దే ఒకరి ద్వారితో అన్నదానం ప్రారంభించారు. ఇప్పుడు అది 'శ్రీయోగి నారాయణ సేవాసమితి'గా అవతరించి.. నిత్యం వందల మంది ఆకలితీరుస్తోంది. భోజనంలో రోజూ ఏదో ఒక తీపి పదార్థం, అన్నం, పప్పు, సాంబర్ వడ్డిస్తున్నారు. రోజుకు రూ.ఆరు వేలు వరకు ఖర్చవుతోందని, కొన్ని సందర్భాల్లో దాతలు ముందుకొస్తున్నారని రవికుమార్ వెల్లడించారు. -హిందూపురం, ఆంధ్రజ్యోతి

ధైర్యే సాహసే..



యుక్తవయసులో పేచ్చియమ్మాళ్, మగవేషంలో పేచ్చియమ్మాళ్

మగువ తెగువ

కూతురి భద్రత కోసం... 30 ఏళ్లుగా ఓ తల్లి మగవేషం

పిన్నవయసులోనే పెళ్లి.. అంతలోనే గర్భం.. అది తెలిసే లోపే భర్త మరణం.. ఏం చేయాలో పాలుపోని పరిస్థితి! తన చిన్నారిని సంరక్షించుకునేందుకు, ఆకతాయిల నుంచి 'ఆకలి' చూపులు తప్పించుకునేందుకు.. ఒక్కటే మార్గమని తలచింది. అంతే! తన ఆడతనాన్ని మరచిపోయి మగాడిలా అవతారమెత్తింది. కురులు, దుస్తులే కాదు.. అలవాట్లు కూడా మగాడిగానే మార్చుకుంది. వినడానికి సినిమాలా అనిపించినా.. ఇది మూడు దశాబ్దాలకు పైగా మగాడిగా బతుకుతున్న ఓ మగువ కథ! ఆ కథలోకి వెళితే.. తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా చొక్కలింగాపురానికి చెందిన పేచ్చియమ్మాళ్ ఇరవై యేళ్ల ప్రాయంలో శివనాండి అనే వ్యక్తిని పెళ్లి చేసుకుంది. అయితే, పెళ్లయిన కొద్ది రోజులకే భర్త మృతి చెందాడు. అప్పటికే గర్భంతో ఉన్న ఆమెకు కొద్ది నెలలు గడిచాక ఆడబిడ్డ జన్మించింది. ఆ బిడ్డను పెంచి పెద్ద చేసేందుకు సంపాదన ముఖ్యమని భావించింది. పిన్నవయస్సులోనే వితంతువుగా మారిన తనకు సమాజంలో శీలరక్షణ ఉండదని నిర్ధారించుకుంది. అందుకే మగవేషం ధరించింది. పేచ్చియమ్మాళ్ అనే తన పేరును 'ముత్తుకుమార్'గా మార్చుకుంది. ఆధార్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డులలో ముత్తుకుమార్ అనే పేరునే నమోదు చేసింది. లుంగీ, చొక్కా ధరించింది. మగవారి మరుగుదొడ్లను ఉపయోగించుకునేది. ఈ పాట్లన్నీ తన ముద్దుల కుమార్తెకోసమే కనుక పేచ్చియమ్మాళ్ ఎన్నడూ బాధ పడలేదు. -చెన్నై, ఆంధ్రజ్యోతి

సంక్షేమం, అభివృద్ధి చేసి చూపిస్తాం

- కొత్త పథకాలకు వేదికగా 2025: చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కొత్త సంక్షేమ పథకాలు, మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు 2025 సంవత్సరం వేదిక కాబోతోందని సీఎం చంద్రబాబు అన్నారు. మంగళవారం రాత్రి ఆయన ఎక్స్ వేదికగా తెలుగు ప్రజలందరికీ ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. '2025లో మీకు ఆనందకరమైన, ఆరోగ్యకరమైన జీవితం కలగాలని కోరుకుంటున్నా. 2024లో మీరు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుతో ఏర్పడిన మీ మంచి ప్రభుత్వం అందరి ఆశలు నెరవేర్చేలా అహర్నిశలు పని చేస్తోంది. కేవలం ఆరు నెలల్లోనే సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనలను ఆవిష్కృతం చేశాం. స్వర్ణాంధ్ర-2047 విజన్ సాకారమే లక్ష్యంగా పది సూత్రాల ప్రణాళిక అమలు చేస్తూ, అటు ప్రజా సంక్షేమాన్ని, ఇటు రాష్ట్రాభివృద్ధిని మీ అందరి సహకారంతో చేసి చూపిస్తాం. మీ అందరికీ మరోసారి హ్యాపీ న్యూ ఇయర్ 2025' అని పేర్కొన్నారు. ఇప్పటికే చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలను ఈ సందర్భంగా చంద్రబాబు ప్రస్తావించారు.

టీడీపీ కార్యాలయానికి బొకేలు, కేక్‌లు తేవొద్దు: అశోక్‌బాబు

నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలవటానికి వచ్చే వారెవరూ బొకేలు, పూలదండలు, కేక్‌లు, స్వీట్లు తేవొద్దని పార్టీ కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్‌బాబు కోరారు. వాటిని పార్టీ కేంద్ర కార్యాలయంలోకి అనుమతించరని చెప్పారు. వాటికి అయ్యే ఖర్చుతో మొక్కలు నాటడం, పేదలకు భోజన సదుపాయం కల్పించడం, విద్యార్థులకు పెన్నులు, పుస్తకాల వంటి బహుమతులివ్వడం ద్వారా సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.

అందరూ శాంతి, శ్రేయస్సుతో ఉండాలి: గవర్నర్

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రాష్ట్ర గవర్నర్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'నూతన సంవత్సరంలో అందరూ ఉల్లాసం, ఉత్సాహం, శాంతి, శ్రేయస్సుతో ఉండాలి. నూతన సంవత్సరం సందర్భంగా తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు. కొత్త సంవత్సరం ఉజ్వల భవిష్యత్తు కోసం ఎదురు చూడడానికి, కొత్త అవకాశాలను అన్వేషించడానికి, కొత్త లక్ష్యాలను సాధించడానికి స్ఫూర్తిని ఇస్తుంది' అని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'బ్రేక్'పై బాబు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: మల్లు రవి

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగేందుకు, మరింత మెరుగుపరిచేందుకు ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం ఎంతో దోహదం చేస్తుందని తెలంగాణ నాగర్‌కర్నూలు ఎంపీ డా.మల్లు రవి తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో తెలంగాణ ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల లేఖల ద్వారా వీఐపీ బ్రేక్ దర్శనాలకు అనుమతిస్తూ ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ తెలంగాణ ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల తరఫున లేఖ రాశారు.

హెల్త్ అసిస్టెంట్లను పునర్నియమించండి

- సీఎం చంద్రబాబుకు ఉద్యోగుల సంఘం లేఖ

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): హెల్త్ అసిస్టెంట్ల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మానవతా దృక్పథంతో వ్యవహరించి సత్వరం నిర్ణయం తీసుకోవాలని ఏపీ పారామెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం కన్వీనర్ జీ.వీ.వీ.ప్రసాద్ విన్నవించారు. సంఘం తరఫున మంగళవారం ఉదయం సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. 'హెల్త్ అసిస్టెంట్‌లు ఉద్యోగాలు కోల్పోయిన తీవ్ర ఆవేదనతో ఉన్నారు. ఇప్పటికే నలుగురు ప్రాణాలు కోల్పోయారు. రెండవ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో హెల్త్ అసిస్టెంట్ల పునర్నియామకంపై నిర్ణయం తీసుకోవాలి. ప్రభుత్వం తప్పనిసరిగా మాకు న్యాయం చేస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు.

స్థిరంగా ఉపరితల ఆవర్తనం

విశాఖపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం మంగళవారం నాటికి హిందూ మహా సముద్రం దానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతోంది. దీని ప్రభావంతో బుధవారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. మంగళవారం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ పొడి వాతావరణం నెలకొంది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి.



పచ్చటి శుభాకాంక్షలు!

నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక గ్రామంలో పల్ల వెంకన్న నర్సరీలో కొత్త ఏడాదికి వివిధ రకాల మొక్కలతో ఇలా వినూత్నంగా స్వాగతం పలికారు. మొక్కలు, పూలతో హ్యాపీ న్యూ ఇయర్ 2025 అంటూ కూర్పు చేశారు. ఈ నెల 18 వరకూ సందర్శకుల కోసం దీనిని ఇలాగే ఉంచుతామని నర్సరీ అధినేత పల్ల సత్తిబాబు, వెంకటేశ్, వినయ్ తెలిపారు. -కడియం

ఆన్‌లైన్‌లో బ్రేక్ దర్శనాల బుకింగ్!

ప్రజాప్రతినిధులకు ప్రత్యేక యూజర్ ఐడీ, పాస్‌వర్డ్

(తిరుమల-ఆంధ్రజ్యోతి)

ప్రజాప్రతినిధులే నేరుగా శ్రీవారి బ్రేక్ దర్శన టికెట్లు బుక్ చేసుకునేలా టీటీడీ అధికారులు ఆలోచన చేస్తున్నారు. నిత్యం దాదాపు 60వేల నుంచి 70వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుంటున్నారు. అయితే దర్శనానికి వచ్చేవారిలో సగానిపైగా బ్రేక్ దర్శనాల కోసమే ఆరాటపడుతున్నారు. నిత్యం ఎవరో ఒక ప్రజాప్రతినిధి సిఫారసు లేఖతో వచ్చి తిరుమలలోని అదనపు ఈవో కార్యాలయం అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధుల నుంచి రోజుకు 2, 3 లేఖలు కూడా వస్తున్నాయి. వీటన్నింటికీ అడ్డుకట్ట వేసేలా టీటీడీ ప్రణాళికలు రూపొందిస్తోంది. గతంలో ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను తయారుచేసి టీటీడీ బోర్డు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులకే యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ కేటాయించారు. కోటాకు తగినట్టు వారే ఆన్‌లైన్ ద్వారా బ్రేక్ దర్శన టికెట్లు బుక్ చేసి భక్తులకు అందజేసేవారు. ఇదే పద్ధతిని ప్రజాప్రతినిధులకూ అమలుచేయడంపై అధికారులు పరిశీలిస్తున్నారు. తెలంగాణ నేతల సిఫారసు లేఖలపై కూడా వీఐపీ బ్రేక్ దర్శనాలు కేటాయించేందుకు ప్రభుత్వం తాజాగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో నూతన విధానం అమలులోకి తెస్తే ప్రజాప్రతినిధులే తమ కోటాకు తగినట్టు ఆన్‌లైన్ ద్వారా బ్రేక్ టికెట్లు బుక్ చేసుకుంటారని భావిస్తున్నారు. ఇందులో ఉన్న సమస్యలపైనా అధికారులు దృష్టి సారించారు. ఈ విధానంలో నేతలు వంద శాతం కోటాను వినియోగించుకుంటారు.



'రేషన్' కేసులో పేర్ని నాని

ఆరో నిందితుడిగా మాజీ మంత్రి

- నగదు బదిలీలన్నీ ఆయన ఆదేశాలతోనే!
- గోడౌన్ మేనేజర్ అంగీకారం



మచిలీపట్నం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తన గోదాముల్లో రేషన్ బియ్యం మాయం వ్యవహారంలో మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని వెంకట్రామయ్య(నాని)పై మచిలీపట్నం తాలూకా పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఆయన్ను ఆరో నిందితుడు(ఏ-6)గా చేర్చారు. ఆయన గోడౌన్‌లో మేనేజరుగా పనిచేస్తున్న మానస తేజను పోలీసులు చెన్నైలో మూడ్రోజుల కిందట అరెస్టుచేసిన సంగతి తెలిసిందే. ఆయన్ను విచారించగా.. మేనేజర్ బ్యాంకు ఖాతా నుంచి రూ.24 లక్షలను మిల్లు యాజమాని బొర్రా ఆంజనేయులు, లారీడ్రైవర్ బొట్ల మంగారావు, పేర్ని కుటుంబసభ్యుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు తేలింది. పేర్ని నాని సూచనల మేరకే ఈ నగదును వివిధ బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు మానసతేజ పోలీసుల ఎదుట అంగీకరించాడు. ఈ వివరాలను నమోదుచేసిన పోలీసులు ఉన్నతాధికారుల సూచనల మేరకు పేర్ని నానిపై కేసు నమోదు చేశారు. ఆయన్ను అరెస్టు చేసేందుకు మంగళవారం తెల్లవారుజామున ప్రయత్నించారు. ఇది తెలిసి ఆయన అదృశ్యమయ్యారు. ఆ తర్వాత ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు.

6 వరకు తొందరపాటు చర్యలొద్దు

పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గోడౌన్ నుండి రేషన్ బియ్యం మాయమైన వ్యవహారంలో వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్నినానిపై సోమవారం వరకు ఎలాంటి తొందరపాటు చర్యలూ తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించింది. వ్యాజ్యంపై విచారణను జనవరి 6కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పేర్ని సతీమణి జయసుధ మచిలీపట్నంలోని తన గోదామును పౌరసరఫరాలశాఖకు లీజుకిచ్చారు. ఇందులో నిల్వ చేసిన రేషన్ బియ్యం మాయమయ్యాయని ఆ శాఖ అధికారి కోటిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా జయసుధపై పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా పేర్ని నానిని ఏ-6గా చేర్చారు. పోలీసులు అరెస్టు చేస్తారనే ఆందోళన ఉందని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపించారు. గోడౌన్‌లోని బియ్యం నిల్వలతో పేర్ని నానికి సంబంధం లేదని.. రాజకీయ కారణాలతో నిందితుడిగా చేర్చారని తెలిపారు. సోమవారం రాత్రి 70 మంది పోలీసులు ఆయన నివాసం వద్దకు వచ్చారని, అరెస్టు చేస్తారనే ఆందోళన ఉందన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ... వ్యాజ్యం మొదటిసారి విచారణకు వచ్చిందని.. కేసు వివరాలు తెప్పించుకునేందుకు సమయం కోరారు. రేషన్ బియ్యం గోడౌన్ నుంచి తరలించి, వాటిని విక్రయించడంలో పిటిషనర్‌ది కీలక పాత్ర అని, వాస్తవాలను వెలికితీసేందుకు కస్టోడియల్ విచారణ అవసరమని తెలిపారు. సీనియర్ న్యాయవాది రఘు స్పందిస్తూ.. ప్రాసిక్యూషన్ వివరాలు తెప్పించుకునేందుకు సమయం కోరుతున్నందున పిటిషనర్‌పై తొందరపాటు చర్యలువద్దన్నారు.

తిరుమల గిరిపై 'బంగారు'కొండ!



ఐదు కేజీల బంగారు ఆభరణాలను ధరించిన ఈయన పేరు కొండ విజయ్‌కుమార్. శ్రీవారికి పరమ భక్తుడైన ఈయన మంగళవారంశ్రీవారిని దర్శించుకున్నారు. తెలంగాణ హాకీ జోన్ సంయుక్త కార్యదర్శి, హోప్ ఫౌండేషన్ చైర్మన్ అయిన విజయ్ కుమార్ ధరించిన బరువైన ఆభరణాలను భక్తులు ఆసక్తిగా చూశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఏపీఎన్‌జీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రమాణం చేస్తున్న విద్యాసాగర్

ఉద్యోగుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం

- ఏపీఎన్‌జీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్

ధర్నాచౌక్(విజయవాడ), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సంక్షేమానికే తన తొలి ప్రాధాన్యమని ఏపీఎన్‌జీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఎ.విద్యాసాగర్ పేర్కొన్నారు. ప్రభుత్వంతో సామరస్యపూర్వక సంబంధాలను కొనసాగించి ఉద్యోగుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మంగళవారం విజయవాడలోని జింఖానగ్రౌండ్‌లో ఆయన ప్రమాణస్వీకారం చేశారు. ఎన్జీవో హోం నుంచి ఉద్యోగులతో భారీర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శివారెడ్డి ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానన్నారు. అవసరమైతే ఆందోళనబాట పడతానని, వారి సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. సంఘం మాజీ అధ్యక్షుడు పరుచూరి అశోక్‌బాబు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, మేధావుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ఏపీఎన్‌జీజీవో సహాధ్యక్షులు దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

బియ్యం 'సిట్'లో మార్పులు

డీఎస్పీలు అవుట్.. సబ్ కలెక్టర్లు ఇన్..

'ఆంధ్రజ్యోతి' కథనంతో కదలిక

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టు నుంచి బియ్యం అక్రమ ఎగుమతి వ్యవహారంలో బాధ్యులను గుర్తించి చట్టపరంగా శిక్షించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సిట్'లో ఎట్టకేలకు మార్పులు జరిగాయి. డిసెంబరు 6న ఏర్పాటు చేసిన సిట్‌లో అందరూ పోలీసులే ఉండటం చర్చనీయాంశం అవడంతో అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ఆ విషయం ప్రచురించింది. వైసీపీ అనుకూల డీఎస్పీలు కూడా సిట్‌లో ఉన్నారంటూ సోషల్ మీడియాలో విమర్శలు వచ్చాయి. దీనిపై సమీక్షించుకున్న ప్రభుత్వం, తాజాగా ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లు, పౌర సరఫరాలు, బీసీ సంక్షేమ శాఖల నుంచి ఒక్కొక్కరి చొప్పున సిట్‌లో చేర్చింది. అయితే సిట్ అధిపతిగా సీఐడీ ఐజీ వినీత్ బ్రిజిలాల్‌ను కొనసాగించిన ప్రభుత్వం గత సిట్‌లో ఉన్న సీఐడీ ఎస్పీ బి.ఉమా మహేశ్వరరాజును మార్చలేదు. తాజా సిట్‌లో ఎ.శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్(బీసీ వెల్ఫేర్), కాకినాడ; పి. రోహిణీ, ఆర్డీడీ (మహిళా శిశు సంక్షేమం) కర్నూలు; కె.మధుసూదన రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి, విజయనగరం; ఎం.బాల సరస్వతి, కోనసీమ జిల్లా పౌర సరఫరాల మేనేజర్‌ను, సభ్యులుగా చేర్చి తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత సిట్‌లో సభ్యులుగా ఉన్న డీఎస్పీలు అశోక్ వర్ధన్ రెడ్డి, బాలసుందరరావు, గోవిందరావు, రత్తయ్యలను తప్పించింది.

మార్గాని భరత్‌ను అరెస్టు చేయొద్దు

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టారనే ఆరోపణలతో నమోదు చేసిన కేసులో వైసీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్‌ను అరెస్టు చేయవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. అయితే కేసులో దర్యాప్తును కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. పోలీసు దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్ దాఖలు చేసిన అనంతరం క్వాష్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకుంటామని ప్రకటించింది. కేసు దర్యాప్తుదశలో ఉందని, ఈ దశలో జోక్యం చేసుకోలేమని పేర్కొంది. ఫిర్యాదుదారుడు చాపలరాజుకు నోటీసులు జారీ చేసింది. పిటిషన్‌పై తదుపరి విచారణను వేసవి సెలవుల తరువాతకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రతిష్ఠను దిగజార్చేలా, హిందువులను మనోభావాలను దెబ్బతీసేలా పోస్టులు పెట్టానని ఆరోపిస్తూ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చాపల రాజు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ భరత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వి.మహేశ్వరరెడ్డి వాదనలు వినిపించారు.

కిలారికి షరతులతో ముందస్తు బెయిల్

- మరో 8 మంది సహ నిందితులకూ మంజూరు

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టడమే కాకుండా అసభ్యకర పోస్టులు పెట్టేలా అనుచరులను ప్రోత్సహించారనే ఆరోపణలపై నమోదైన కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్యకు హైకోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేలతో 2 పూచికత్తులు సమర్పించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. చార్జిషీట్ దాఖలు చేసేవరకు వారంలో ఒకరోజు దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న మరో 8మందికి ముందస్తు బెయిల్ ఇచ్చారు. వీరికి కూడా షరతులు వర్తిస్తాయని స్పష్టం చేశారు. తన కుమార్తెపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టడమే కాకుండా ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తిచేసేలా అనుచరులను ప్రోత్సహించారంటూ పొన్నూరు టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర సతీమణి జోతిర్మయి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కిలారు రోశయ్య, ఆయన అనుచరులపై పొన్నూరు రూరల్ పోలీసులు కేసు పెట్టారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రోశయ్య పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాట్సాప్ గ్రూపులోని సభ్యులు షేర్‌చేసిన పోస్టులకు అడ్మిన్‌గా ఉన్న పిటిషనర్‌ను బాధ్యుడిని చేయడానికి వీల్లేదని, పిటిషనర్ ఎలాంటి అనుచిత పోస్టులు చేయలేదన్నారు. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు కీలక దశలో ఉందని, ఫొటోలను ఎవరు మార్ఫింగ్ చేశారో దర్యాప్తులో తేలుతుందని తెలిపారు. ఈ వ్యవహారంలో పూర్తి సమాచారం కోసం సామాజిక మాధ్యమాల సంస్థలకు లేఖలు రాశామని, పిటిషనర్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు. ఫిర్యాదుదారు తరఫున న్యాయవాది వీవీ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ ప్రోత్సాహంతోనే అతని అనుచరులు ఫిర్యాదుదారు కుమార్తెపై సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారని తెలిపారు.

ఇక డాకింగ్‌పై గురి..!

- ఈ నెల 7న ఉండొచ్చన్న ఇస్రో
- ఇస్ట్రాక్ సెంటర్ నుంచి పర్యవేక్షణ
- జనవరిలో వందో ప్రయోగానికి ఇస్రో సిద్ధం

సూళ్లూరుపేట, డిసెంబరు 31: అంతరిక్షంలో డాకింగ్ సాంకేతికతను ప్రదర్శించేందుకు ఇస్రో చేపట్టిన స్పేడెక్స్ మిషన్‌లో కీలక ఘట్టం పూర్తయింది. సోమవారం రాత్రి ఛేజర్, టార్గెట్ అనే జంట ఉపగ్రహాలను రోదసీలోకి మోసుకెళ్లిన పీఎస్ఎల్వీ-సీ60 వాటిని ఒకదాని తర్వాత ఒకటిగా నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఇక ఈ ప్రయోగంలో మిగిలింది అసలు సిసలైన డాకింగ్ (రెండు ఉపగ్రహాల అనుసంధానం) ఘట్టమే. దీనిపై ఇస్రో చైర్మన్ మాట్లాడుతూ.. డిసెంబరు 31 నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు బెంగళూరులోని ఇస్ట్రాక్ సెంటర్ నుంచి వీటిని పర్యవేక్షిస్తారని చెప్పారు. డాకింగ్ ప్రక్రియ బహుశా జనవరి 7న ఉండొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆ ఉపగ్రహాలు కక్ష్యలో తిరుగుతున్నాయని కొద్ది రోజుల తర్వాత వాటిని దగ్గరకు చేర్చి మరో వారం రోజుల్లో డాకింగ్ ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. కాగా.. ఈ మిషన్‌లో పీఎస్ఎల్వీ ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్ (పోయెమ్-4) ద్వారా పంపిన మరో 24 పేలోడ్లు కూడా కీలక పాత్ర పోషిస్తాయని సోమనాథ్ తెలిపారు. వాటిలో అంకుర సంస్థలు, పరిశ్రమలు, విద్యాసంస్థలతోపాటు ఇస్రో కేంద్రాల నుంచి రూపొందించిన పేలోడ్లు ఉన్నాయన్నారు. వాటిని దిగువ కక్ష్యలోకి తీసుకురానున్నట్టు తెలిపారు. అక్కడి నుంచి అవి అనేక పరిశోధనలు చేస్తాయని వివరించారు. పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడం పట్ల ఇస్రో గర్వంగా ఉందని, త్వరలోనే స్పేడెక్స్ మిషన్ లక్ష్యాన్ని కూడా పూర్తిచేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రైవేటు సంస్థ అందించిన ఉపగ్రహాలు

స్పేస్ డాకింగ్ కోసం ఎస్‌డీఎక్స్01 (ఛేజర్), ఎస్‌డీఎక్స్02 (టార్గెట్) అనే జంట ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది. ఒక్కోటి 220 కేజీల బరువుండే ఈ శాటిలైట్లను అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఏటీఎల్) అనే ప్రైవేటు పరిశ్రమ అందించింది. కొన్నేళ్లుగా ఇస్రోతో అనుబంధం కొనసాగిస్తున్న ఏటీఎల్... ఇస్రో సహకారంతో వాటిని రూపొందించింది. 'ఇప్పటివరకు ప్రైవేటు పరిశ్రమలు ఇలాంటి పెద్ద ఉపగ్రహాలను సొంతంగా తయారు చేయలేదు. అయితే ఈ రెండు ఉపగ్రహాలను రూపొందించి వాటిని పరీక్షించడం ఇదే తొలిసారి' అని యూఆర్ రావు స్పేస్ సెంటర్ (యూఆర్ఎస్‌సీ) డైరెక్టర్ ఎం శంకరన్ తెలిపారు. ఈ మిషన్ విజయవంతమైతే ప్రైవేటు పరిశ్రమ రంగానికి మేలు చేస్తుందని చెప్పారు.

త్వరలో శ్రీహరికోటలో ఇస్రో సెంచరీ

ఇస్రో ప్రధాన కార్యాలయం ఉన్నది బెంగళూరులో అయినా.. రాకెట్ ప్రయోగాలు ఎక్కువగా చేపట్టేది మాత్రం తిరుపతి జిల్లా శ్రీహరికోటలోనే. ఈ క్రమంలో ఇక్కడి సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్) అరుదైన రికార్డుకు చేరువైంది. ఈ జనవరిలో ఇస్రో జీఎస్ఎల్వీ ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఇది శ్రీహరికోటలో చేపట్టే 100వ ప్రయోగంగా రికార్డులకెక్కనుంది. స్పేడెక్స్ మిషన్ కోసం డిసెంబరు 30న.. ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ప్రయోగం ఇక్కడ 99వది. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ సోమనాథ్ మాట్లాడుతూ.. కొత్త ఏడాది ఆరంభంలో ఇక్కడ వందో ప్రయోగానికి సిద్ధమవుతున్నామని చెప్పారు. జీఎస్ఎల్వీ ప్రయోగం ద్వారా నావిగేషన్ శాటిలైట్ ఎన్వీఎస్-02ను జనవరిలో ప్రయోగిస్తామని తెలిపారు. 2023 మే నెలలో జీఎస్ఎల్వీ-ఎఫ్12 రాకెట్ ద్వారా ఎన్వీఎస్-01 అనే శాటిలైట్ ఉపగ్రహాన్ని ఇస్రో విజయవంతంగా ప్రయోగించింది.



ప్రమాదానికి కొన్ని క్షణాల ముందు.. జెరాక్స్ షాపులోకి దూసుకొస్తున్న లారీ(సీసీ ఫుటేజీ దృశ్యం)

షాపులోకి దూసుకుపోయిన ఇసుక లారీ

- స్టీల్‌ప్లాంటు ఉద్యోగి దుర్మరణం.. త్రుటిలో తప్పించుకున్న మహిళ

గాజువాక, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగర పరిధిలోని గాజువాక సుందరయ్య కాలనీలో మంగళవారం ఒక ఇసుక లారీ బీభత్సం సృష్టించింది. బ్రేకులు ఫెయిలై సరాసరి ఓ దుకాణంలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో స్టీల్‌ప్లాంటు ఉద్యోగి దుర్మరణం పాలయ్యారు. వివరాలివీ.. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇసుక లోడుతో ఓ లారీ సుందరయ్య కాలనీ వీధిలోకి వెళ్తోంది. వీధి చివర మలుపు తిరగాల్సి ఉండగా, లారీ బ్రేకులు ఫెయిల్ కావడం, ఆపై ఆ ప్రాంతం పల్లంగా ఉండడంతో సరాసరి ఎదురుగా ఉన్న జెరాక్స్ దుకాణంలోకి దూసుకుపోయింది. ఆ సమయంలో జెరాక్స్ షాపు యజమాని పక్కనే ఉన్న ఇంటికి భోజనానికి వెళ్లగా, జెరాక్స్ తీయించుకునేందుకు వచ్చిన స్టీల్‌ప్లాంటు ఉద్యోగి బీవీ రమణ (58) బలైపోయారు. లారీ వేగంగా దూసుకొచ్చి బలంగా ఢీకొనడంతో రమణ అక్కడికక్కడే మృతిచెందారు. షాపు ముందు నిలబడిన మరో మహిళ.. లారీ వేగంగా రావడాన్ని గమనించి పక్కకు తప్పుకోవడంతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. గాజువాక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అతి కష్టం మీద లారీని వెనక్కి తీసి, మృతదేహాన్ని బయటకు తీశారు. ప్రమాదంలో జెరాక్స్ షాప్ పూర్తిగా ధ్వంసమయ్యింది. ప్రమాద దృశ్యాలు సీసీ ఫుటేజీలో రికార్డయ్యాయి. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరిద్దరిని కాదు.. 40 మందిని..!!

- ఇంటర్ విద్యార్థులను చితకబాదిన లెక్చరర్
- చర్యలకు అధికారుల మీనమేషాలు



విద్యార్థి చేతిపై గాయాలు

తగరపువలస, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లాలోని తగరపువలస బాసర జూనియర్ కళాశాలలో మంగళవారం కెమిస్ట్రీ లెక్చరర్ మహేష్ పూనకం వచ్చినట్లు ఎంపీసీ ఇంగ్లీషు మీడియం విద్యార్థులను చావబాదారు. చదువుపై శ్రద్ధ చూపడంలేదన్న సాకుతో విచక్షణ మరచి ఏకంగా తరగతి గదిలోని 40 మందినీ క్రరతో చితక్కొట్టారు. విద్యార్థుల ఒంటిపై తట్లు తేలడం, ఓ విద్యార్థి చేతి వేలు చిట్లి రక్తం కారడంతో ఫొటోలు తీసి విద్యార్థి సంఘం నాయకులకు పంపించడంతో, ఈ విషయం తెలిసి, దానిపై కూడా కళాశాల యాజమాన్యం కూడా విద్యార్థులను వేధించింది. ఎవరు ఫొటోలు తీశారు?, ఎవరికి పంపించారో చెప్పాలంటూ మరోసారి వారిని కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఏఐడీఎస్ఓ విద్యార్థి సంఘం విశాఖ జిల్లా నాయకుడు బి.సంతోష్. ఆర్ఐఓకు ఫిర్యాదు చేశారు. అయితే అధికారులు కూడా కళాశాల యాజమాన్యానికే వత్తాసు పలుకుతున్నట్టు మాట్లాడారని విద్యార్థి సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. పిల్లలు సరిగా చదవలేదని, మార్కులు తక్కువ వచ్చాయని వాతలు వచ్చేలా కొడతారా? అంటూ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ వివాదం రచ్చ కాకుండా చూసేందుకు విద్యార్థుల తల్లిదండ్రులను రప్పించి వారితో మాట్లాడుతున్నట్లు చెబుతున్నారు. విద్యార్థులను కొట్టిన లెక్చరర్ మహేష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని కళాశాల చైర్మన్ పి.రమేష్ 'ఆంధ్రజ్యోతి'కి వివరణ ఇచ్చారు.

మరో బెంచ్‌కు ఇవ్వండి

- ప్రభావతి పిటిషన్ విచారణ నుంచి తప్పుకొన్న న్యాయమూర్తి

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గుంటూరు, నగరంపాలెం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ ప్రభావతి దాఖలు చేసిన పిటిషన్ విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి మంగళవారం ప్రకటించారు. పిటిషన్ మరో బెంచ్ ముందు విచారణకు వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని ఆదేశించారు. విచారణ శుక్రవారానికి వాయిదా వేశారు. వ్యాజ్యంలో ప్రతివాదిగా ఉన్న రఘురామ తరఫున గతంలో తాను న్యాయవాదిగా కోర్టుకు హాజరైనందున కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు.

నిందితుడిగా చేర్చాలనుకుంటే నోటీసులు ఇవ్వండి

- రాఘవరెడ్డి పిటిషన్ విచారణలో పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టేలా ప్రోత్సహించారనే ఆరోపణలతో నమోదైన కేసులో వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డిని నిందితుడిగా చేర్చాలనుకుంటే 48 గంటల ముందు అతనికి నోటీసులు జారీ చేయాలని అన్నమయ్య జిల్లా, మున్నూరు పోలీసులను హైకోర్టు ఆదేశించింది. వ్యాజ్యంపై విచారణను మూసివేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రాఘవరెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్ రెడ్డి, ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు.

మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు హైకోర్టులో ఊరట

- 2016, 17 నాటి కేసుల్లో 12 వారాలపాటు చర్యల నిలిపివేత

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు హైకోర్టులో ఉపశమనం లభించింది. ఆయనపై అమలాపురం మేజిస్ట్రేట్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న 2 కేసులలో తదుపరి చర్యలన్నింటినీ 12 వారాలపాటు నిలుపుదల చేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. విచారణను 8 వారాలకు వాయిదా వేశారు. 2016, 17 సంవత్సరాలకు సంబంధించిన ఆ రెండు కేసులను కొట్టివేయాలని కోరుతూ సుభాష్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేయగా, సీనియర్ న్యాయవాది కె.చిదంబరం వాదనలు వినిపించారు.

సీదిరి అప్పలరాజు క్వాష్ పిటిషన్‌పై విచారణ వాయిదా

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు సంక్రాంతి సెలవుల తర్వాతకు వాయిదా వేసింది. ఫిర్యాదుదారు కామేశ్‌కు నోటీసులు జారీ చేసింది. ట్రయల్ కోర్టులో విచారణకు హాజరు నుంచి అప్పలరాజుకు మినహాయింపు ఇచ్చింది. ప్రాసిక్యూషన్ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయిరోహిత్ వాదనలు వినిపించారు. పోలీసులు చార్జిషీటు దాఖలు చేశారని వివరించారు.

హైకోర్టులో నూతన సంవత్సర వేడుకలు

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): హైకోర్టులో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ కె.సురేశ్‌రెడ్డి, జస్టిస్ కె.మన్మథరావు, అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ పాల్గొని కేక్‌ను కట్ చేశారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ ముద్రించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ఏపీహెచ్‌సీఏఏ అధ్యక్షుడు కె.చిదంబరం, ఉపాధ్యక్షుడు ఎన్.రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.